### మొదటి పేజి తరువాయి

## దేశ సినీ పరిశ్రమకు హైదరాబాద్‌ను కేంద్రంగా మారుస్తాం

రాష్ట్ర యువతకు, టెక్నీషియన్లకు, రచయితలకు, దర్శకులకు భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ సినీ మార్కెట్‌కు హైదరాబాద్ కేంద్రంగా మారనుందని, ఇందుకు సంబంధించిన బ్లూప్రింట్‌ను ప్రభుత్వం సిద్ధం చేస్తోందని వెల్లడించారు. గత ప్రభుత్వం దశాబ్దాలుగా సినిమా అవార్డులను నిర్లక్ష్యం చేసిందని, కానీ తమ ప్రభుత్వం సినీ రంగానికి తిరిగి పురస్కారాలు అందించి ప్రోత్సహిస్తోందని భట్టి వివరించారు. సమాజం కోసం, కళల ద్వారా తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహానుభావుడు గద్దర్ అని ఆయన కొనియాడారు. తెలంగాణ కళలు, సంస్కృతి, విప్లవ స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన వ్యక్తి గద్దర్ అని, అందుకే ఆయన పేరు మీద గత ఏడాది నుంచి అవార్డులు అందిస్తున్నామని తెలిపారు. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ప్రతిభ, పారదర్శకత ఆధారంగానే అవార్డుల ఎంపిక ఉంటుందని భట్టి హామీ ఇచ్చారు. గద్దర్ అవార్డుకు ఎంపికయ్యే సినిమాల్లో వాణిజ్య అంశాలతో పాటు బలమైన సామాజిక సందేశం ఉండేలా చూడాలని జ్యూరీ సభ్యులకు సూచించారు. ఈ నెల 6 నుంచి అవార్డుల స్క్రీనింగ్ ప్రారంభమవుతుందని, ఫిబ్రవరి 19న ఉగాది పర్వదినం నాడు అవార్డుల ప్రదానోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, ఐ అండ్ పీఆర్ కమిషనర్ ప్రియాంక, ఎఫ్‌డీసీ ఈడీ కిశోర్ బాబుతో పాటు సినీ ప్రముఖులు తనికెళ్ల భరణి, కేఎస్ రామారావు, రోజా రమణి, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 2026-27 ఏపీ బడ్జెట్.. పయ్యావుల కీలక చర్చలు..

అచ్చెన్నాయుడు, అనితలతో వరుస సమావేశాలు జరిపారు. ఈ సమావేశాల్లో ఆయా శాఖలకు నిధుల కేటాయింపులు, ప్రాధాన్యతలపై విస్తృతంగా చర్చలు జరిగాయి. వివిధ శాఖల మంత్రులు తమ ప్రతిపాదనలను ఆర్థిక మంత్రికి సమర్పించారు. సంక్షేమం, అభివృద్ధికి సమపాళ్లలో నిధులు కేటాయించేలా ఆర్థిక శాఖ కసరత్తు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌ను రూపొందిస్తున్నారు. ఈసారి బడ్జెట్‌లో ఇరిగేషన్ ప్రాజెక్టులు, ఉత్తరాంధ్ర-రాయలసీమ ప్రాంతాల అభివృద్ధి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రాజధాని అమరావతి నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయించేలా బడ్జెట్ కూర్పు సాగుతోంది. పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక కేటాయింపులు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పారిశ్రామిక ప్రోత్సాహకాల చెల్లింపులకు ఎస్క్రో ఖాతాలు తెరుస్తామని స్పష్టం చేశారు. ఈ బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు సమాచారం. తల్లికి వందనం, దీపం-2.0, అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు వంటి పథకాలకు ప్రత్యేక నిధులు కేటాయించే అవకాశం ఉంది. వివిధ వర్గాలకు అందించే సంక్షేమ పథకాలకూ రాష్ట్ర ప్రభుత్వం నిధులను కేటాయించనున్నట్లు తెలుస్తోంది. రోడ్ల అభివృద్ధిపైనా ఈ బడ్జెట్‌లో ప్రత్యేక దృష్టి సారించనున్నారు. పాత హోల్స్ రోడ్లు, కొత్త రోడ్ల నిర్మాణానికి ఫోకస్ పెట్టే అవకాశం ఉంది. హార్టికల్చర్ రంగ అభివృద్ధికి ప్రత్యేక కేటాయింపులు, లాజిస్టిక్స్ సెక్టార్ వృద్ధిపై సర్కార్ ప్రత్యేక ఫోకస్ పెట్టనుంది. అంతేకాకుండా, జల్ జీవన్ మిషన్ పథకాన్ని వేగవంతం చేసేందుకు తగిన ప్రణాళికలు, నిధుల కేటాయింపులు జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే బడ్జెట్ కేటాయింపులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మంగళవారం (ఫిబ్రవరి 3) చర్చలు జరిపారు. అలాగే మిగిలిన శాఖల మంత్రులతోనూ త్వరలో సమావేశాలు జరిగే అవకాశం ఉంది.

## తెలుగు రాష్ట్రాల్లో భారీగా ఎయిడ్స్ మరణాలు..

ఏపీలో 32,642 మంది చనిపోగా... తెలంగాణలో 11,498 మంది మృతి చెందారు. మరో షాకింగ్ విషయం ఏమిటంటే... ఐటీ రంగంలో హెచ్ఐవీ వైరస్ విస్తృతంగా వ్యాపిస్తోంది. ఈ విషయాన్ని జాతీయ ఎయిడ్స్ నియంత్రణ వ్యవస్థ వెల్లడించింది. విదేశీ తరహా జీవనశైలికి అలవాటు పడటం ఐటీ రంగంలో హెచ్ఐవీ వ్యాప్తి కావడానికి కారణమవుతోందని తెలిపింది. ఈ రంగంలో హెచ్ఐవీ పరీక్షల సంఖ్యలను పెంచాల్సి ఉందని సూచించింది.

## కేటీఆర్ కు సీరియస్ వార్నింగ్ ఇచ్చిన బండి సంజయ్

పదేళ్ల పాటు అధికారంలో ఉన్న కేటీఆర్ తనపై వేల కేసులు పెట్టించారని బండి సంజయ్ మండిపడ్డారు. ఇప్పుడు కోర్టుల నుంచి నోటీసులు పంపిస్తున్నారని దుయ్యబట్టారు. నా జోలికి వస్తే నీ బతుకును రోడ్డుకీడుస్తా అని హెచ్చరించారు. నీ అరాచకాలు, నీ నీచ పనులు బయటపెడతానని అన్నారు. తనకు భయపడి సిరిసిల్లలోనే కేటీఆర్ మకాం వేశారని ఎద్దేవా చేశారు. ఓటుకు రూ. 5 వేల నుంచి రూ. 10 వేల వరకు ఇచ్చేందుకు కూడా సిద్ధంగా ఉన్నారని ఆరోపించారు. సిరిసిల్ల మున్సిపాలిటీలో బలవంతంగా ఏడు గ్రామాలను కలిపి... అక్కడి పేదలకు ఉపాధి హామీ పనులు లేకుండా చేశారని మండిపడ్డారు. సిరిసిల్లకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధుల వివరాలను కేటీఆర్ సహా అందరికీ పంపిస్తామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని... మీరు ఓటు వేస్తే, తాను సిరిసిల్లను అభివృద్ధి చేసి చూపిస్తానని చెప్పారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ వ్యభిచారం చేస్తోందని సంజయ్ అన్నారు. పార్టీ మారినట్టు అన్ని ఆధారాలు ఉన్నప్పటికీ... స్పీకర్ కేసు కొట్టేయడం దారుణమని చెప్పారు. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ స్థానంలో ఉండి... చరిత్రహీనులు కావద్దని సూచించారు.

## మీ జాతికే ఆయన 'జాతిపిత' ప్రజలకు కాదు..

## కేసీఆర్‌పై ధ్వజమెత్తిన సీఎం రేవంత్

పేర్కొన్నారు. ఎస్ఎల్‌బీసీ పనులు ఆగితే మామ అల్లుళ్లు దావత్‌లు చేసుకున్నారని ఆరోపించారు. నల్గొండపై విషం చిమ్ముతున్న బీఆర్ఎస్‌కు అసలు ఓటు అడిగే హక్కు ఉందా అని ప్రశ్నించారు.

మున్సిపల్ ఎన్నికల వేళ రైతులకు తీపికబురు.. రైతు భరోసాపై సీఎం రేవంత్ కీలక ప్రకటన

### ఎర్రవెల్లి, జన్వాడ ఫామ్‌హౌస్‌లు ప్రజలకు ఇస్తారా..

ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ కు నోటీసులు ఇస్తే.. జాతిపితకు నోటీసులు ఇస్తారా? అని ప్రశ్నిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హరీశ్ రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు, కృష్ణారావు వంటి నేతలకు ఆయన జాతిపిత కావచ్చు.. కానీ ప్రజలకు ఆయనతో ఏం పని అని మండిపడ్డారు. నేరాలు, ఘోరాలు చేస్తే పోలీసులు ముసుగు వేసి పట్టుకుని వస్తారని.. హరీశ్ రావు, కేటీఆర్‌లను కూడా ముసుగు వేసి పట్టుకుని రావాల్సిందని అన్నారు. కేసీఆర్‌కు నోటీసులు ఇస్తే తెలంగాణ జాతికి ఇచ్చినట్లుగా చెబుతున్నారని, అలా అయితే ఎర్రవెల్లి జన్వాడ ఫామ్‌హౌస్‌లు ప్రజలకు ఇస్తారా అని ప్రశ్నించారు. వేల కోట్లు కొల్లగొట్టిన సొమ్ములో నిరుద్యోగులకు ఏమైనా ఇస్తారా అని నిలదీశారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మంత్రులు అన్నీ అనుభవించారని.. కానీ తెలంగాణ సమాజానికి ఏమైనా ఇచ్చారా? అని ధ్వజమెత్తారు. తెలంగాణ కోసం సర్వం త్యాగం చేసిన ప్రొఫెసర్ జయశంకర్ జాతిపిత అవుతారు కానీ.. కేసీఆర్ ఎలా అవుతారని ప్రశ్నించారు. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ తెలంగాణ తల్లి అవుతుందని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## తెలంగాణలో సనాతన ధర్మంపై

## జరిగే దాడులను సహించేది లేదు

హైదరాబాద్: రాష్ట్రంలో సనాతన ధర్మం మీద జరిగే దాడులను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ హెచ్చరించారు. మహబూబ్ నగర్‌లోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన 'విజయ సంకల్ప్' సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ, ముస్లిం ఓటు బ్యాంకు కోసం కాంగ్రెస్ ఆరాటపడుతోందని మండిపడ్డారు. రాష్ట్రంలో హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతున్నా నోరు మెదపడం లేదని, ఆలయాల భూములు ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఎందరో పోరాడారని అన్నారు. హైదరాబాద్ విముక్తి కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి చేశారని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం బుజ్జగింపు రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. వక్ఫ్ బోర్డును బలోపేతం చేసేందుకు చూస్తోందని అన్నారు. బలహీనవర్గాలకు న్యాయం జరగలేదని, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల నిధుల్లో ప్రభుత్వం కోత విధిస్తోందని ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల హామీలను తుంగలో తొక్కిందని మండిపడ్డారు. రైతు భరోసా, రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలు కూడా నెరవేరలేదని అన్నారు. ఎస్సీలు, ఆదివాసీలు, బీసీలను తెలంగాణ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులు, బిల్లుల మంజూరుకు ఆర్ఆర్ ట్యాక్స్ చెల్లించవలసి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. అవినీతి, కమీషన్ల ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించాలని అన్నారు. ప్రతి ఒక్కరికి న్యాయం జరగాలంటే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ప్రాధాన్యత ఇస్తోందని, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. తెలంగాణలో రైల్వే పనులకు రూ.5,400 కోట్లకు పైగా కేటాయించామని, మూడు హైస్పీడ్ రైల్ రైళ్లను ఇచ్చామని గుర్తు చేశారు. ప్రపంచవ్యాప్తంగా మోదీ ప్రభుత్వం పట్ల ఆదరణ పెరుగుతోందని అన్నారు. ఈయూతో ఒప్పందం చేసుకుని దేశాభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు.

## బలూచ్ తిరుగుబాటుదారుల వద్ద

## అమెరికన్ అడ్వాన్స్‌డ్ ఆయుధాలు ఉన్నాయి

ఆసిఫ్ మాట్లాడుతూ, తిరుగుబాటుదారుల దగ్గర ఒక్కొక్కటి రూ.20 లక్షల విలువైన రైఫిల్స్, 4,0005,000ల డాలర్ల విలువైన థర్మల్ వెపన్ సైట్స్, నైట్ విజన్ డివైసెస్ ఉన్నాయని వెల్లడించారు. "ఇలాంటి రైఫిల్ మన సైన్యంలో లేదు. ఈ అమెరికన్ ఆయుధాలు వారికి ఎక్కడి నుంచి వస్తున్నాయి ఎవరు డబ్బు చెల్లిస్తున్నారు?" అని ఆయన ప్రశ్నించారు. బలూచ్ తిరుగుబాటుదారుల నాయకత్వం ఆఫ్ఘనిస్థాన్‌లో ఉందని, అక్కడి నుంచే తిరుగుబాటుదారులకు మద్దతు అందుతోందని ఆసిఫ్ ఆరోపించారు. బలూచిస్థాన్ ప్రావిన్స్ పరిమాణం పెద్దది కావడం, తిరుగుబాటుదారులు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ ఉపయోగించడం వల్ల భద్రతా బలగాలు కష్టపడుతున్నాయని ఆయన ఒప్పుకున్నారు. పాకిస్థానీ పంజాబీలను బీఎల్ఏ టార్గెట్ చేస్తోందని ఆసిఫ్ తెలిపారు. "వీరితో చర్చలు జరపలేము. పాక్ సైన్యం పూర్తి స్థాయిలో వారిపై దాడి చేస్తుంది" అని హెచ్చరించారు.

# హిందూ ద్రోహి వైసీపీ.. జనసేన నేత నాగబాబు కీలక వ్యాఖ్యలు

### మొదటి పేజి తరువాయి

అలానే అర్చకుల జీతభత్యాల గురించి నేను శాసనమండలిలో మాట్లాడాను' అని నాగబాబు తెలిపారు. ఇదే సమయంలో వైసీపీ ప్రభుత్వంలో జరిగిన దారుణ ఘటనలను నాగబాబు ప్రస్తావించారు. '2020 సెప్టెంబర్ 6న అంతర్వేది రథం దగ్ధమైన రోజు. ఆనాటి వైసీపీ ప్రభుత్వం ఉద్యమాలకు తలొగ్గి కేసును సీబీఐకి అప్పగిస్తామని చెప్పింది. 2023లో ఆర్టీఐ కింద దరఖాస్తు చేస్తే.. అంతర్వేది కేసును అసలు తాము విచారణ చేయలేదని సీబీఐ వివరించింది. అంటే వైసీపీ నేతలు చేసిన ప్రకటనను అమలు చేయకుండా మోసం చేశారని తేలిపోయింది. మసి పూసి మారేడు కాయ చేయడంలో నిపుణులైన వైసీపీ నేతలు దీనిపై ఎందుకు మాట్లాడరు. అవతలి వారి వ్యక్తిగత జీవితాలపై వారికి ఉన్న ఆసక్తి.. హిందూ ఆలయాలపై ఎందుకు ఉంటుంది. రామతీర్థం రాముడు మనకు దైవం.. డిసెంబర్ 2020లో రాముడు తల నరికినా వైసీపీ ప్రభుత్వంలో చర్యలు లేవు. నామ్ కే వాస్తేగా కేసులు పెట్టి.. చేతులు దులుపుకున్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యంతో దోషులను శిక్షించలేదు. మీరు, మీ మంత్రులకు ఇతర వ్యక్తుల సినిమాలపై రివ్యూలు ఇచ్చే శ్రద్ధ రాముడిపై ఎందుకు ఉంటుంది' అని ఆయన అన్నారు. 'అయోధ్యలో రామమందిరం కల సాకారం అయితే.. చంద్రబాబు, పవన్ వెళ్లి పాలు పంచుకున్నారు. నేడు హిందువులపై



ఎక్కడ లేని ప్రేమ వలక పోస్తున్న ఆ నాయకుడు అయోధ్యపై ఒక్క పోస్టు అయినా పెట్టారా. వెళ్లలేక పోయినా కనీసం స్పందిస్తూ.. ప్రకటన అయినా విడుదల చేశారా?. పేదల నుంచి కోటీశ్వరుల వరకు అందరూ తిరుమల వెంకన్నను దర్శనం చేసుకోవాలని చూస్తారు. అటువంటి కొండపై వసతుల ఛార్జీలు ఇష్టం వచ్చినట్లు పెంచేశారు. ఇది సామాన్యులకు భగవంతుడిని దూరం చేయడం కాదా?. మాఫియా కోసం పేద ప్రజలను వెంకన్న స్వామికి అందకుండా చేస్తారా . కూరగాయలు బేరమాడినట్లు సేవల పెంపులో వైసీపీ నేత సుబ్బారెడ్డి బేరం ఆడిన విధానం అందరూ చూశారు. తిరుమలపై నువ్వు చేసిన దోపిడీ అంతా ఇంతా కాదు.. టీటీడీ కామన్ గుడ్ ఫండ్ ఇచ్చే కంట్రిబ్యూషన్ రూ.2.50 కోట్లు ఉండేది.. రూ.50 కోట్లకు ఒకేసారి పెంచేశావు' అని నాగబాబు విమర్శించారు. 'తిరుపతిలోనే కాదు.. ఎక్కడ కొండ కనిపించినా గుండు కొట్టేయడమే మీకు అలవాటు. డిక్లరేషన్ ను గౌరవించడం మన సంప్రదాయం. అయినా బాధ్యత గురించి వైసీపీ నేతలకు చెప్పడం చెవిటోడి చెవిలో శంఖం ఊదినట్లే. పవన్ కల్యాణ్ తన సతీమణి, పిల్లలను తీసుకెళ్లినప్పుడు, అలానే మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం డిక్లరేషన్ ఇచ్చారు. అబ్దుల్ కలాం కంటే నువ్వు గొప్పోడివా.. నీ మంత్రి వచ్చి తిరుమల నీ అమ్మ మొగుడు కట్టాడా అంటాడా... అలా తలపొగరుతో మాట్లాడినందుకే 151 మధ్యలో 5 తీసేసి 11 సీట్లే ఇచ్చారు. అయినా నువ్వేమైనా మారావా.. డిక్లరేషన్ అడిగారని తిరుమల పర్యటన మానుకున్న చరిత్ర నీది. సెక్యులర్, రిలీజియస్ ప్లేస్‌లకు తేడా తెలియని వ్యక్తివి నువ్వు. తిరుమల కల్తీ ఉదంతంలో అబద్ధాలు చెబుతున్నారు' అంటూ వైసీపీపై నాగబాబు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రెండున్నర గంటలపాటు సాగిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ సమావేశం

### మొదటి పేజి తరువాయి



ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం సుమారు రెండున్నర గంటల పాటు కొనసాగింది. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలు, కూటమి పక్షాల మధ్య సమన్వయం, భవిష్యత్ కార్యాచరణ వంటి అనేక కీలక అంశాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా, వైసీపీ అనుసరిస్తున్న వైఖరి పైనే ఈ సమావేశంలో ఎక్కువగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. కుల రాజకీయాలను రెచ్చగొట్టడం ద్వారా వైసీపీ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తోందని, ఆ పార్టీ పన్నుతున్న వ్యూహాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని ఇరువురు నేతలు నిర్ణయించుకున్నారు. వైసీపీ ట్రాప్‌లో పడకుండా కూటమి శ్రేణులను అప్రమత్తం చేసేందుకు ఉమ్మడి వ్యూహంతో ముందుకు సాగాలని తీర్మానించుకున్నారు. క్షేత్రస్థాయిలో టీడీపీ, జనసేన కార్యకర్తల మధ్య వైసీపీ చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తోందని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఇరువురు నేతలు ఓ అభిప్రాయానికి వచ్చారు. ఈ భేటీలో రాజకీయ అంశాలతో పాటు పరిపాలనాపరమైన విషయాలు కూడా ప్రస్తావనకు వచ్చాయి. త్వరలో ఖాళీ కానున్న నాలుగు రాజ్యసభ స్థానాల భర్తీపై నేతలు ప్రాథమికంగా చర్చించినట్లు సమాచారం. అలాగే, చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని కూడా నిర్ణయించినట్లు తెలుస్తోంది. వివిధ కార్పొరేషన్లకు ఛైర్మన్లతో పాటు డైరెక్టర్ల నియామకంపై కూడా సమాలోచనలు జరిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య క్షేత్రస్థాయిలో సమన్వయం మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఈ సమావేశంలో అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. తిరుమల లడ్డూ ప్రసాదం వంటి అంశాలపై వైసీపీ సోషల్ మీడియాలో చేస్తున్న విష ప్రచారాన్ని సమష్టిగా తిప్పికొట్టాలని, ఇందుకోసం కూటమిలోని మూడు పార్టీల నేతలు కలిసి ఉమ్మడి మీడియా సమావేశాలు నిర్వహించాలని పవన్ సూచించినట్లు సమాచారం. రాబోయే 15 ఏళ్లు కూటమే అధికారంలో కొనసాగేలా పటిష్టమైన భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవాలనే దిశగా కూడా వీరి మధ్య చర్చలు సాగినట్లు తెలుస్తోంది. నిన్న కేబినెట్ భేటీకి ముందు చంద్రబాబు, పవన్ క్లుప్తంగా మాట్లాడుకున్నప్పటికీ, అన్ని అంశాలపై విపులంగా చర్చించేందుకు ఈరోజు ప్రత్యేకంగా భేటీ అయ్యారు.

# మణిపుర్‌లో రాష్ట్రపతి పాలన ఎత్తివేత

### మొదటి పేజి తరువాయి

దిల్లీలోని మణిపుర్ భవన్‌లో మంగళవారం రాష్ట్ర ఎన్ డీఏ భాగస్వామ్య పక్షాల భేటీ జరిగింది. దీపీ, ఛీపా, ఛీఫీ ఎమ్మెల్యేలతో పాటు ముగ్గురు స్వతంత్ర మీబాలు హాజరయ్యారు. వారంతా ఖేమ్‌చంద్‌ను తమ నేతగా ఎన్నుకున్నారు. అంతకుముందు మంగళవారం మణిపుర్ బీజేపీ ఎమ్మెల్యేలు దిల్లీలోని తమ పార్టీ ప్రధాన కార్యాలయంలో సమావేశమై ఖేమ్‌చంద్‌ను పార్టీ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి అనారోగ్య కారణాల వల్ల ఇద్దరు ఎమ్మెల్యేలు హాజరుకాకపోగా, మిగిలిన బీజేపీ శాసన సభ్యులందరూ హాజరయ్యారు. ఆ సమావేశంలో మాజీ సీఎం ఎన్ .బీరెన్ సింగ్ , అసెంబ్లీ స్పీకర్ సత్యబ్రత సింగ్ , రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు ఎ.శారదా దేవి, కేంద్ర పరిశీలకు తరుణ్ చుగ్, సంబిత్ పాత్రా పాల్గొన్నారు.

ఎవరీ ఖేమ్‌చంద్ సింగ్?

మైతేయ్ వర్గానికి చెందిన ఖేమ్ చంద్ సింగ్ 2017, 2022లో వరసుగా రెండు సార్లు సింగ్జమేయి అసెంబ్లీ నియోజక వర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. తైక్వాండోలో ప్రావీణ్యమున్న ఖేమ్‌చంద్, 2017 నుంచి 2022 వరకు మణిపుర్ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. 2022 అసెంబ్లీ ఎన్నికల తరువాత బీరెన్ సింగ్ తన మంత్రివర్గంలోకి ఖేమ్ చంద్ ను తీసుకున్నారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ , మున్సిపల్ పరిపాలన, గృహ నిర్మాణం, విద్య సహా పలు కీలక శాఖల మంత్రిగా పనిచేశారు. రాష్ట్రపతి పాలన విధించే వరకు ఆయన ఆయా శాఖల మంత్రిగా కొనసాగారు. మణిపుర్‌లోని మూడు కీలక సామాజిక వర్గాలతోనూ సత్సంబంధాలు కలిగి ఉండటం ఖేమ్‌చంద్‌కు కలిసొచ్చినట్లు తెలుస్తోంది.

### ఉపముఖ్యమంత్రిగా కుకీ మహిళా నేత

కాగా, మణిపుర్ కొత్త ప్రభుత్వంలో కుకీ మహిళా నాయకురాలు, మాజీ మంత్రి నెమ్చా కిప్గెన్ ఉపముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. నాగాలకు చెందిన ఎమ్మెల్యేను మరో డిప్యూటీ సీఎంగా ఉంచాలన్న ప్రతిపాదన కూడా ఉన్నట్లు సమాచారం. బీజేపీ ఇక్కడ చాలా వ్యూహాత్మకంగా ఒక మైతేయ్ తెగ నుంచి ముఖ్యమంత్రిని, కుకీ తెగ నుంచి డిప్యూటీ సీఎంను ఎంపిక చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇది కుకీ వర్గంలో ఉన్న అసంతృప్తిని తగ్గించే ప్రయత్నంగా భావించవచ్చు.

### రెండు జాతుల వైరంతో ఘర్షణలు

2023లో రెండు జాతుల మధ్య ఘర్షణ చెలరేగడంతో మణిపుర్ అట్టుడికింది. ఈ హింసాత్మక ఘర్షణల వల్ల కనీసం 260 మందికి



పైగా మరణించగా, వేలాది మంది పూర్తిగా నిరాశ్రయులు అయ్యారు. ఈ ఘర్షణలు ఏమాత్రం చల్లారకపోవడంతో, గతేడాది ఫిబ్రవరిలో బీరెన్ సింగ్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. ఫలితంగా అక్కడ రాష్ట్రపతి పాలన విధించారు. ఇలా మణిపుర్ లో 2025 ఫిబ్రవరి 13 నుంచి రాష్ట్రపతి పాలన కొనసాగుతోంది. దీంతో 60 మంది సభ్యుల అసెంబ్లీని అప్పటి నుంచి సుప్తచేతనావస్థలో ఉంచారు. అయితే గత కొన్ని నెలలుగా బీజేపీ కేంద్ర నాయకత్వం మైతేయ్, కుకీ ఎమ్మెల్యేలతో నిరంతరం చర్చలు జరుపుతూ వచ్చింది. ముఖ్యంగా డిసెంబర్ 14న దిల్లీలో ఇరువర్గాల ఎమ్మెల్యేలతో జరిపిన సమావేశం అనంతరం శాంతి దిశగా అడుగులు పడ్డాయి. ఈ నేపథ్యంలో మణిపుర్‌లో తిరిగి ప్రభుత్వం ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవడంతో రాష్ట్రపతి పాలనను ఎత్తివేశారు.

# ప్రధాని మోదీకి జనరల్ నరవణే రాసిన పుస్తకం అందజేస్తా

### మొదటి పేజి తరువాయి

విపక్ష నేత రాహుల్ గాంధీ. 2020లో భారత్-చైనా సరిహద్దు వివాదం సమయంలో ప్రధాని మోదీ తన బాధ్యతను సరిగ్గా నిర్వర్తించలేదని మండిపడ్డారు. డోక్లాం ప్రతిష్టంభన బాధ్యతను అప్పటి ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణెపైకి నెట్టేశారని విమర్శించారు. పార్లమెంట్ వెలుపల మీడియాతో రాహుల్ మీడియాతో మాట్లాడారు. ఈ క్రమంలో మోదీ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. ఆ సమయంలో రాహుల్ ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణె రాసిన బుక్‌ను చేతిలో పట్టుకున్నారు. చైనా దురాక్రమణపై భారత సైన్యం మాజీ అధిపతి ఎంఎం నరవణె రాసిన బుక్‌ను ప్రధాని మోదీకి అందజేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఆ పుస్తకంలోని విషయాలు లద్దాఖ్ సంక్షోభ సమయంలో ప్రభుత్వ ప్రతిస్పందన గురించి నిజాలను వెల్లడిస్తాయన్నారు. "ఈ బుక్ అసలు లేదని, స్పీకర్, కేంద్ర ప్రభుత్వం, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ చెప్పారు. దేశంలోని ప్రతి యువకుడు ఈ పుస్తకం ఉందని గమనించాలి. లద్దాఖ్‌లో ఏం జరిగిందో నరవణె పూర్తి వివరాలను ఈ బుక్‌లో రాశారు. ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణే రాసిన బుక్ భారత్‌లో ప్రచురించడానికి ప్రభుత్వం అనుమతించడం లేదు. ఈ బుక్ విదేశాల్లో ప్రచురితమైంది." అని రాహుల్ స్పష్టం చేశారు. "ప్రధాని మోదీ బుధవారం లోక్‌సభకు వస్తారని నేను అనుకోవడం లేదు. ఎందుకంటే మోదీకి సభకు వస్తే నేను నేరుగా వెళ్లి ఆయనకు నరవణె రాసిన పుస్తకాన్ని ఇస్తాను. తద్వారా ఆ పుస్తకాన్ని చదివి మోదీ నిజాలను తెలుసుకుంటారు. ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ నరవణె రాసిన బుక్ లద్దాఖ్‌లో జరిగిన ఘటనలను వివరిస్తుంది. దీనిని ముఖ్యంగా దేశంలోని యువత చదవాలి. కైలాష్ రిడ్జ్ ప్రాంతంలో చైనా దళాలు, వారి ట్యాంకుల మోహరింపు గురించి ఈ బుక్‌లో నరవణె హైలెట్ చేశారు. "

**రాహుల్ గాంధీ,**
**లోక్‌సభలో విపక్ష నేత**

చైనా ట్యాంకులు కైలాష్ రిడ్జ్ వద్దకు చేరుకున్నప్పుడు అప్పటి ఆర్మీ చీఫ్ జనరల్ నరవణె వెంటనే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను సంప్రదించారని రాహుల్ తెలిపారు. అప్పుడు నరవణెకు రాజ్‌నాథ్ సరైన సమాధానం ఇవ్వలేదని ఆరోపించారు. ఆ తర్వాత నరవణె విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ఢోబాల్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌ను సంప్రదించారని, అప్పుడూ స్పష్టమైన స్పందన రాలేదన్నారు. ఆ తర్వాత రాజ్‌నాథ్ టాప్ (ప్రధాని మోదీని ఉద్దేశించి)ను అడుగుతానని చెప్పారని ఆరోపించారు. చైనా బలగాలు భారత భూభాగంలోకి ప్రవేశించినప్పటికీ, స్పష్టమైన అనుమతి లేని పక్షంలో భారత బలగాలు కాల్పులు జరపకూడదనేది ఆ సమయంలో టాప్ నుంచి అందిన స్టాండింగ్ ఆర్డర్ అని రాహుల్ ఆరోపించారు. "చైనా బలగాలు భారత భూభాగంలోకి వచ్చినా, తమ అనుమతి లేకుండా వారిపై కాల్పులు జరపకూడదని 'టాప్' స్టాండింగ్ ఆర్డర్. అయితే అప్పటి సైన్యాధిపతి నరవణె భారత భూభాగంలోకి వచ్చిన చైనా ట్యాంకులపై కాల్పులు జరపాలనుకున్నారు. అయితే మోదీ మీకు ఏది సరైనదని అనిపిస్తే అది చేయండన్నట్లు సందేశం ఇచ్చారు. అందుకే ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ నరవణె తన పుస్తకంలో తాను ఒంటరినయ్యాని రాసుకొచ్చారు. అంటే మోదీ తన బాధ్యతలను సరిగ్గా నిర్వర్తించలేదని అర్థం. ప్రధాని మోదీ ఈ సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించాలి. లద్దాఖ్ ప్రతిష్టంభన సమయంలో తన పాత్రను దేశ ప్రజలకు వివరించాలి. దేశానికి జాతీయ భద్రత విషయంలో పారదర్శకత, జవాబుదారీతనం అవసరం." అని రాహుల్ పేర్కొన్నారు.

### రాహుల్ వర్సెస్ కేంద్ర మంత్రి

మరోవైపు, పార్లమెంట్ వెలుపల రాహుల్ గాంధీ, కేంద్ర రైల్వే సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు మధ్య మాటల యుద్ధం నడిచింది. పార్లమెంట్‌లోని మకర్ ద్వార్ వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ ఎంపీల పక్క నుంచి వెళ్తున్న రవ్‌నీత్ సింగ్ బిట్టును రాహుల్ గాంధీ 'ద్రోహి' అని సంబోధించారు. 2024లో రవ్‌నీత్ బిట్టు కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరడంతో రాహుల్ ఆయన్ను ద్రోహిగా అభివర్ణించారు. 'ఇదిగో ఒక ద్రోహి పక్కన నడుస్తున్నాడు. ఆయన ముఖం చూడండి.' అని రాహుల్ వ్యాఖ్యానించారు. అలాగే బిట్టుతో కరచాలనం చేయడానికి ముందుకొచ్చారు. 'మీరు చింతించకండి. కాంగ్రెస్‌లోకి తిరిగివస్తారు' అని బిట్టుతో రాహుల్ అన్నారు. అయితే రాహుల్ కరచాలనం చేయడానికి ముందుకు రాగా కేంద్ర మంత్రి రవ్‌నీత్ నిరాకరించారు. ఈ క్రమంలో రాహుల్‌పై విరుచుకుపడ్డారు. దేశానికి శత్రువుగా రాహుల్‌ను అభివర్ణించారు. నిరసనలు తెలుపుతున్న ఎంపీలు యుద్ధంలో గెలిచినట్లుగా కూర్చున్నారని ఎద్దేవా చేశారు.

### మొదటి పేజి తరువాయి

# బంగాల్ ను టార్గెట్ చేస్తున్నారు, ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

### బంగాల్‌నే టార్గెట్ చేశారు!

"బంగాల్‌ను ఉద్దేశపూర్వకంగా టార్గెట్ చేశారు. అసోం రాష్ట్రంలో ఎస్ఐఆర్ కోసం ఏ నిబంధనలు పాటించారు? అక్కడ పాటించిన ప్రమాణాలను ఇక్కడెందుకు పాటించడం లేదు? మాకు ఎక్కడా న్యాయం జరగడం లేదు. ఇప్పటికే ఎన్నికల సంఘానికి నేను ఆరు లేఖలు రాశాను. అయినా స్పందన లేదు" అని ఆమె ధర్మాసనానికి వివరించారు. విచారణ ముగిసే సమయంలో, తన వాదనలు వినిపించే అవకాశం ఇచ్చినందుకు ధర్మాసనానికి కృతజ్ఞతలు తెలిపారు.

### 1.36 కోట్ల మందికి నోటీసులు

మమత తరఫున సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్ కోర్టుకు గణాంకాలను సమర్పించారు. "రాష్ట్రంలో 'లాజికల్ డిస్క్రిపెన్సీ' లేదా సాంకేతిక లోపాల పేరుతో ఏకంగా 1.36 కోట్ల మంది ఓటర్లకు నోటీసులు ఇచ్చారు. తల్లిదండ్రుల పేర్లలో చిన్న చిన్న తేడాలు ఉన్నాయని, వయసు వ్యత్యాసం తక్కువగా ఉందనే సాకుతో ఓట్లు తొలగిస్తున్నారు. ఫిబ్రవరి 14తో ఈ ప్రక్రియ ముగుస్తుంది. తప్పులు సరిదిద్దుకోవడానికి ప్రజలకు సమయం లేదు. ఇది కోట్లాది మంది ఓటు హక్కును హరించే ప్రమాదం ఉంది" అని దివాన్ వాదించారు.

### సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంచోలిలతో కూడిన ధర్మాసనం ఈ అంశంపై స్పందించింది. "ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది. అర్హులైన, నిజమైన ఓటర్ల పేర్లు జాబితాలో కచ్చితంగా ఉండాలి. ఏ ఒక్క అమాయక పౌరుడి పేరు జాబితా నుంచి తొలగించకూడదు. బంగాలీ మాండలికం వల్ల ఓటర్ల స్పెల్లింగ్‌లో తేడాలు రావడం సహజం. దాన్ని సాకుగా చూపి ఓట్లు తొలగించకూడదు" అని సీజేఐ వ్యాఖ్యానించారు. ఈసీ తీరుపై మమత మరిన్ని ఆరోపణలు చేశారు. "బతికున్న మనుషులను ఈసీ అధికారులు చనిపోయినట్లుగా రికార్డుల్లో చూపిస్తున్నారు. ఓటర్ల జాబితా సవరణ కోసం ఆధార్ కార్డును అనుమతించడం లేదు. ఇతర పత్రాలు అడుగుతూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు" అని ఆమె ధర్మాసనానికి తెలిపారు.

### ఈసీ ఎదురుదాడి

ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేది వాదనలు వినిపిస్తూ, "ఎస్ఐఆర్ పర్యవేక్షణ కోసం మమతా బెనర్జీ ప్రభుత్వం తగినంత మంది అధికారులను ఇవ్వడం లేదు. ఎస్‌డీఎం స్థాయి అధికారులను కేవలం 80 మందినే ఇచ్చారు. ఎక్కువగా అంగన్‌వాడీ కార్యకర్తలను, కింది స్థాయి సిబ్బందిని కేటాయించారు" అన్నారు. దీనిని మమత ఖండించారు. ఈసీ అడిగినవన్నీ సమకూర్చామని బదులిచ్చారు. గతంలోనూ మమత బెనర్జీ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు రాసిన లేఖలో తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇప్పుడు జరుగుతున్న ప్రక్రియ ప్రణాళికా రహితంగా ఉందని, దీనివల్ల భారీగా ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం ఉందని, ఇది ప్రజాస్వామ్య పునాదులను దెబ్బతీస్తుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

# సంపాదకీయం

## వాణిజ్య బంధాలూ సమర వివాదాలూ

రాష్ట్రపతి ప్రసంగం ముగిసిన తర్వాత కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన రెండో రోజే పార్లమెంటులో తీవ్ర గందరగోళం నెలకొన్నది. దీన్నిబట్టి చూస్తే అసలు పార్లమెంట్ సమావేశాలు సజావుగా జరగాలన్న ఉద్దేశం అటు ప్రతిపక్షాలకు కానీ, ఇటు ప్రభుత్వానికి కానీ ఉన్నదా అన్న అనుమానం వస్తోంది. సాధారణంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తర్వాత రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరగడం ఆనవాయితీ. ఆ తర్వాతే బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చలు మొదలవుతాయి. పార్లమెంటు ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి వెలువరించే ప్రసంగం ఒక రకంగా ప్రభుత్వ విధాన డాక్యుమెంట్. నిజానికి మోదీ ప్రభుత్వం అమలుపరుస్తోన్న వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఇస్తోన్న ప్రాధాన్యం గురించి రాష్ట్రపతి ప్రపంగం వివరించింది.. రాజకీయ విభేదాలు విస్మరించి వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా జాతీయ ప్రజాప్రతినిధులు అందరూ దేశ ప్రయోజనాలకోసం కలిసికట్టుగా కృషి చేయాలని రాష్ట్రపతి పిలుపునిచ్చారు. విచిత్రమేమంటే బడ్జెట్ ప్రవేశపెట్టిన మరుసటి రోజే పాలక, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాదోపవాదాలతో సభా సమావేశాలు కొనసాగలేని పరిస్థితి ఏర్పడింది. ఇందుకు ఎవరు కారణం? రాష్ట్రపతి ప్రసంగంపై సోమవారం నాడు ప్రారంభమైన చర్చలో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య కాంగ్రెస్‌పై వాడి వేడి బాణాలు సంధించారు. భారతీయ నాగరికత, సంస్కృతి, జాతీయవాదం, దేశభక్తి అనే వాటికి కాంగ్రెస్ పార్టీ తీవ్ర వ్యతిరేకమని ఆయన మాట్లాడిన మాటలు కాంగ్రెస్‌ను రెచ్చగొట్టాయి. ఇప్పటికే అనేక గాయాలతో రెచ్చిపోతున్న కాంగ్రెస్ ఊరుకుంటుందా? ఆ వెంటనే కాంగ్రెస్ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ రంగంలోకి దిగి తమ దేశ భక్తిని, జాతీయవాదాన్ని శంకించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 'మా దేశ భక్తి గురించి, భారతీయ సంస్కృతి గురించి బీజేపీ యువ ఎంపీ వ్యాఖ్యలు చేసినందుకే నేను కొన్ని వాక్యాలను చదివి వినిపించదలుచుకున్నాను' అని రాహుల్ మొదలుపెట్టారు. 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పేరిట 2020లో చైనాతో జరిగిన సరిహద్దు ఘర్షణపై మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణే రచించిన పుస్తకంలో ఉన్న అంశాలపై 'కారవాన్' అనే పత్రిక వెలువడిన ఆ పుస్తక భాగాలను చదవ సాగారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గురించి నరవణే రాసిన వాక్యాలను చదవడం మొదలుపెట్టగానే బీజేపీ ఎంపీలు తీవ్ర గందరగోళం సృష్టించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్ షా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఇంకా ప్రచురణ కాని ఆ పుస్తకంలోని వాక్యాలను ఎలా చదువుతారని మంత్రులు ప్రశ్నించారు. స్పీకర్ ఓం బిర్లా కూడా 342 నిబంధన క్రింద అలా చదవడం కుదరదని స్పష్టం చేశారు. అధికార ప్రతిపక్ష సభ్యుల మధ్యే కాక, స్పీకర్‌కూ, ప్రతిపక్ష సభ్యుల మధ్య కూడా వాగ్వివాదం జరిగింది. మంగళవారం కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. తాను నరవణే పుస్తకంలో ఉన్న అంశాలు సరైనవేనని సాధికారికంగా చెబుతున్నానంటూ రాహుల్ స్పీకర్‌కు నోట్ సమర్పించి మరీ మళ్లీ ప్రసంగం ప్రారంభించారు. అయితే అధికార పక్షం వారు యథా ప్రకారం రాహుల్ మాట్లాడకుండా అడ్డుకున్నారు. ప్రధానమంత్రి అన్న పదం ఉచ్చరించినప్పుడల్లా స్పీకర్ అడ్డుకున్నారు. రాహుల్‌ను అడ్డుకుంటున్నారని గందరగోళం సృష్టించినందుకు ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలను సస్పెండ్ చేశారు. చివరకు అనేక వాయిదాల తర్వాత సభ మళ్లీ బుధవారానికి వాయిదా పడింది. అసలీ పరిస్థితి ఎందుకు వచ్చింది? తేజస్వి సూర్య విమర్శనాస్త్రాలే కాంగ్రెస్‌ను రెచ్చగొట్టాయా? జనరల్ నరవణే పుస్తకంలోని అంశాలను రాహుల్ ప్రస్తావించకుండా బీజేపీ ఎందుకు అడ్డుకుంటోంది? నిజానికి నరవణే పుస్తకం వెలుగులోకి రాకుండా గత రెండేళ్లుగా కేంద్రం అడ్డుకుంటోంది. ఆ పుస్తకం ప్రచురించడానికి రక్షణమంత్రిత్వ శాఖ, విదేశాంగమంత్రిత్వ శాఖ ఇంతవరకూ పబ్లిషర్‌కు అనుమతినీయలేదు. 'నేను రాయాల్సింది రాశాను. ఇక ఆ పుస్తకాన్ని ఎలా విడుదల చేయాలో పబ్లిషరే తేల్చుకోవాలి' అని నరవణే అన్నారు. ఆ పుస్తకంలో తాను రాసిన అంశాలపై వస్తున్న వివాదం విషయమై కూడా ఆయన ఏ మాత్రం స్పందించలేదు. 'కారవాన్'లో వచ్చిన పుస్తక భాగాలపై కూడా ఆయన వ్యాఖ్యానించలేదు. అంటే తాను రాసిన వాటికి ఆయన కట్టుబడి ఉన్నట్లే కదా. భారత్ చైనాల మధ్య సరిహద్దు ఘర్షణలు కొత్త కాదు. ఆ పొరుగు దేశంతో విభేదాలు యుద్ధానికి దారితీయడంలో నెహ్రూ ప్రభుత్వ తప్పిదాల గురించి అనేక పుస్తకాలు వచ్చాయి. చైనాతో యుద్ధం జరుగుతున్నప్పుడు అసోంను కోల్పోతామేమోనన్న ఆవేదనను నెహ్రూ వ్యక్తపరిచారు. 'నా హృదయం అసోం ప్రజలకోసం తపిస్తోంది..' అన్న ఆయన ఆవేదనాపూరిత వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. కాంగ్రెస్ హయాంలో జరిగిన అనేక తప్పిదాలు, సంభవించిన పరాజయాలు, వాటిల్లిన వైఫల్యాలను కప్పిపుచ్చడానికి ఎవరూ ప్రయత్నించలేదు. ఇవాళ కాంగ్రెస్ పార్టీ దేశ రక్షణ, భద్రత నుంచి అనేక విషయాల్లో ఆత్మరక్షణలో పడేందుకు, ఎన్నికల పరాభవాల నుంచి కోలుకోలేకపోతున్నందుకు అవే కారణం. మరి మోదీ హయాంలో ఇలాంటి విషయాలపై చర్చ జరిగేందుకు కూడా ఆస్కారం లేకుండా పోతోంది. ఏ చిన్న విజయం లభించినా ఉప్పొంగిపోయి, అమితోత్సాహం ప్రదర్శించి ప్రచారార్భాటాలు చేసేవారు జాతీయ ప్రాధాన్యమున్న వివాదాలపై చర్చించడానికి నిరాకరించడం దేనికి? జనరల్ నరవణే పుస్తకం బయటకు వచ్చి ఉంటే దానిపై కొద్ది రోజులు చర్చ జరిగి సమసిపోయివుండేది. గల్వాన్ లోయలో చైనా చొచ్చుకువస్తున్నప్పుడు 'మీకేది సముచితమో అదే చేయండి' అని ప్రధానమంత్రి తనకు చెప్పారని రక్షణమంత్రి వెల్లడించినట్లు నరవణే రాశారు. ఆ సమయంలో జరిగిన ఘటనలేమిటో, ఎంతమందితో ఎన్ని చర్చల తర్వాత, ఎన్ని తర్జనభర్జనల

## సాగు రంగంలో మారిన ప్రాథమ్యాలు



దేశానికి ఆహార భద్రత సమకూరిన పరిస్థితుల్లో 2026 కేంద్ర బడ్జెట్లో సాగు రంగానికి సంబంధించి ప్రాథమ్యాలు మారాయి. రుణ మాఫీలు, కనీస మద్దతు ధరలు, సబ్సిడీల పెంపు వంటి సంచలన ప్రకటనలేమీ ఈ పద్దులో లేవు. తాత్కాలిక పరిహారాలు, ఉపశమనాల నుంచి నష్టభయం లేని స్థిర ఆదాయాల సాధనకు పునాది ఏర్పరచడమే ఈ బడ్జెట్ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. భారతీయ వ్యవసాయం నేడు కొత్త మలుపులో నిలిచి ఉంది. ఆహార ధాన్యాలు, పండ్లు, కూరగాయలు, చేపలు, పాడి ఉత్పత్తులను అవసరానికి మించి ఉత్పత్తి చేసుకోగలుగుతున్నాం. విదేశాలకూ ఎగుమతి చేస్తున్నాం. అయితే, రైతులకు స్థిరమైన ఆదాయం కల్పించడం, వాతావరణ మార్పులను, జాతీయ, అంతర్జాతీయ విపణుల్లో ఒడుదొడుకులను తట్టుకుంటూ ఎప్పటికప్పుడు రాబడి పెరిగేలా చూడటం విధానకర్తల ముందున్న అతి పెద్ద సవాలు. తాజా కేంద్ర బడ్జెట్ దీనికే ఎక్కువ ప్రాధాన్యమిచ్చింది. భారతదేశ స్థూల విలువ జోడింపులో వ్యవసాయం వాటా 18శాతమే. కానీ, శ్రామిక బలగంలో 45శాతం ఈ రంగంపైనే ఆధారపడి ఉందని 2025-26 ఆర్థిక సర్వే తెలిపింది. వ్యవసాయం, అనుబంధ వృత్తుల్లో ఉత్పత్తి పెరుగుతున్నా తరచూ అనిశ్చితి ఎదురవుతోంది. 2024-25లో ఆహార ధాన్యాల ఉత్పత్తి 35.7 కోట్ల టన్నులకు చేరింది. అంతకుముందు సంవత్సరం కన్నా అది 7.5శాతం ఎక్కువ. ఉద్యాన పంటల ఫలసాయం ఆహారోత్పత్తిని మించిపోయింది. దశాబ్దం కిందటి నుంచి పంటల సాగుకన్నా పశుపోషణ, మత్స్య పరిశ్రమ వేగంగా వృద్ధి చెందుతున్నాయి. మరోవైపు వాతావరణ మార్పుల వల్ల ప్రకృతి విపత్తులు సర్వసాధారణమవుతున్నాయి. అస్థిర వర్షపాతం, మండుటెండలు, భూగర్భ జలాలు తరిగిపోవడం, ఒకే జిల్లాలో, ఒకే మండలంలో దిగుబడుల్లో తేడాలు గ్రామీణుల ఆదాయాలలో అనిశ్చితికి దారితీస్తున్నాయి. దిగుబడులు పెరిగినా మార్కెట్లో ధరలు పడిపోయి రైతు ఆదాయాలకు కోతపెడుతున్నాయి. విత్తనాలు, ఎరువుల ధరలు పెరిగిపోతున్నాయి. కోతల తరవాత ఆరు నుంచి 10శాతం పంట నష్టమవుతున్నట్లు అంచనా. ఈ నేపథ్యంలో తాజా బడ్జెట్ దిగుబడుల పెంపుకన్నా, నష్టాల నివారణపై ఎక్కువగా దృష్టి సారించింది.

అధిక రాబడే ధ్యేయంగా...

తాజా కేంద్ర బడ్జెట్లో కీలకమైన ప్రకటన భారత్-విస్తార్ పోర్టల్ ప్రారంభం. ఇది కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో బహు భాషల్లో పనిచేసే వ్యవసాయ సలహా వేదిక. అగ్రిస్టాక్, ఐసీఏఆర్ పరిశోధనా ఫలాలు, డిజిటల్ సమాచార వ్యవస్థల సమ్మేళనమిది. భారతీయ వ్యవసాయ విస్తరణ సేవలకు సమాచార కొరతేమీ లేదు. ఈ సమాచారాన్ని రైతులకు సకాలంలో అందించి ఆశించిన ఫలితాలను సాధించడంలోనే సమస్య ఎదురవుతోంది. సమాచారానికి తోడు ఉత్పత్తి సాధనాలను సమకూర్చాలి. నీరు, రుణాలు సకాలంలో అందాలి. పంట చేతికొచ్చాక ధరలు పడిపోకుండా చూడాలి. ఈ లోపాలను అధిగమిస్తేనే విస్తార్ సార్థకమవుతుంది. భూసార పరీక్షలు, ఏ నేలలో ఏ పంటలు వేయాలనే సూచనలు, వాతావరణ వివరాలు, పంటల వైవిధ్యానికి సంబంధించిన సిఫార్సులు, మార్కెట్ సమాచారం అందించి రైతులు సరైన నిర్ణయాలు తీసుకోవడానికి తోడ్పడాలి. నష్ట భయాన్ని నివారించాలి. ఈ పనులను చేయగల సత్తాను భారత్-విస్తార్‌కు సమకూర్చాలి. చిన్న రైతులకు దీనివల్ల ఎంతో లబ్ధి చేకూరుతుంది. కొత్తగా 500 ప్రధాన జలాశయాలు, అమృత్ సరోవరాలను సమగ్రంగా అభివృద్ధి చేయనున్నట్లు తాజా బడ్జెట్లో ప్రకటించారు. దీనికి మరి కాస్త ఎక్కువ ప్రాధాన్యం లభించి ఉంటే బాగుండేది. పంట దిగుబడి స్థిరంగా ఉండాలంటే నీటి సరఫరా నికరంగా జరగాలి. అలాంటి చోట్ల గ్రామీణుల ఆదాయాలు స్థిరంగా ఉంటాయి. వర్షాభావ ప్రాంతాల్లోనూ నిరంతర నీటి సరఫరా, భూగర్భ జలాల పునరుద్ధరణ, చెరువుల్లో చేపల పెంపకం, పశువులకు నీరు, గ్రామస్థాయిలో వాతావరణ మార్పుల నుంచి భద్రత లభించినప్పుడు రైతులకు నీటి వనరులు ప్రభుత్వ సబ్సిడీలకన్నా మెరుగైన నష్టనివారణ సాధనాలవుతాయి. ఆహార ధాన్యాలకన్నా మిన్నగా ఆదాయం తెచ్చిపెట్టే కొబ్బరి, జీడిపప్పు, కొకొవా, చందనం, ఇతర ఉద్యాన పంటలకు ఈసారి బడ్జెట్ ప్రాధాన్యమివ్వడం విశేషం. భవిష్యత్తులో వరి, గోధుమ వంటి ఆహార పంటలు మాత్రమే గ్రామీణ ఆదాయాలను పెంచలేవని ఆర్థిక సర్వే తెలిపింది. నీటి కొరత, పెట్టుబడి ఖర్చులు పెరగడం, భూసార క్షయం వంటివి దీనికి కారణాలు! ఆహార పంటలకు బదులు కొబ్బరి, జీడి, చందనం వంటి పంటలకు మళ్లితే హెక్టారుకు అధిక ఆదాయం లభిస్తుంది. ఎగుమతుల ద్వారా అదనపు రాబడి సిద్ధిస్తుంది. బ్రాండు పేరు మీద అమ్మితే వ్యాపార వృద్ధి జరుగుతుంది. సాగు, శుద్ధి, ఎగుమతులు, మార్కెటింగ్ విభాగాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అయితే, నాణ్యమైన వంగడాలను వాడటం, పంట కోత తరవాత సరైన ప్రాసెసింగ్, శీతల గిడ్డంగుల సదుపాయాలు, మార్కెట్ వసతులు ఉంటేనే అధిక ఆదాయానికి అవకాశం ఉంటుంది. ఈ ఏడాది బడ్జెట్లో మూలధన వ్యయాన్ని రికార్డు స్థాయిలో రూ.12.2 లక్షల కోట్లుగా నిర్ణయించడంతో ఇలాంటి మౌలిక వసతుల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టిపెట్టిందని అర్థమవుతోంది.

తెలుగు రాష్ట్రాలకు ప్రయోజనం

అధిక విలువనిచ్చే కొబ్బరి, జీడి, ఉద్యాన పంటలకు బడ్జెట్ ప్రాధాన్యమివ్వడం ఆంధ్ర, తెలంగాణలకు లాభిస్తుంది. అమృత్ సరోవరాలు, సమగ్ర జలాశయాల అభివృద్ధి కార్యక్రమాలు రాయలసీమ, ఉత్తర తెలంగాణలలోని చెరువులకు, తద్వారా రైతులకు మేలు చేస్తాయి. భారత్-విస్తార్ వల్ల రైతులకు వారి భాషలోనే వ్యవసాయ పరమైన సలహా సంప్రదింపులు లభిస్తాయి. మౌలిక వసతుల విస్తరణతో వారు ఎంతో ప్రయోజనం పొందుతారు. ప్రధానమంత్రి-కిసాన్ పథకం కింద ఇప్పటి వరకు దేశంలో 11 కోట్ల మందికి పైగా రైతులకు రూ.4 లక్షల కోట్ల మేర సాయం అందింది. కేంద్ర బడ్జెట్ ఈ పథకాన్ని విస్మరించలేదు. అదే సమయంలో ఇక సంక్షేమం అంటే కేవలం నగదు సాయం చేయడం మాత్రమే కాదనీ సాగులో, రైతు జీవితాల్లో అనిశ్చితిని తగ్గించడమన్న సందేశం బడ్జెట్‌లో కనిపిస్తోంది.

## వంద అబద్ధాలు.. ఒక పెళ్లి.. లక్షల వసూళ్లు..




ఒకప్పుడు పెళ్లి అంటే పెద్దల మాట, పరిచయాల విశ్వాసం, కుటుంబాల మధ్య బాధ్యత, రెండు మనసుల మధ్య బంధం ఈ నాలుగు స్థంభాల మీద నిలబడిన వ్యవస్థ. కానీ నేడు యాప్, సబ్‌స్క్రిప్షన్, కమీషన్, డీల్ క్లోజింగ్.. ఇది పెళ్లి కాదు.. మ్యాట్రిమోనియల్ మార్కెట్.. ఈ మార్పు ఒక్కరోజులో రాలేదు. మొదట పరిచయాల కొరత వచ్చింది. పట్టణీకరణ పెరిగింది. కుటుంబాలు చిన్నవయ్యాయి. పెద్దల పాత్ర తగ్గింది. ఈ ఖాళీలోకి మ్యారేజ్ బ్యూరోలు ప్రవేశించాయి..

వంద అబద్ధాలు.. ఒక పెళ్లి.. లక్షల వసూళ్లు..

ఒకప్పుడు పెళ్లి అంటే పెద్దల మాట, పరిచయాల విశ్వాసం, కుటుంబాల మధ్య బాధ్యత, రెండు మనసుల మధ్య బంధం ఈ నాలుగు స్థంభాల మీద నిలబడిన వ్యవస్థ. కానీ నేడు యాప్, సబ్‌స్క్రిప్షన్, కమీషన్, డీల్ క్లోజింగ్.. ఇది పెళ్లి కాదు.. మ్యాట్రిమోనియల్ మార్కెట్.. ఈ మార్పు ఒక్కరోజులో రాలేదు. మొదట పరిచయాల కొరత వచ్చింది. పట్టణీకరణ పెరిగింది. కుటుంబాలు చిన్నవయ్యాయి. పెద్దల పాత్ర తగ్గింది. ఈ ఖాళీలోకి మ్యారేజ్ బ్యూరోలు ప్రవేశించాయి. ప్రారంభంలో అవి అవసరానికి సమాధానం ఇచ్చాయి. కానీ అవసరమే శాశ్వతమైతే, అది వ్యాపారంగా మారడం సహజం. ఇక్కడే అసలు సమస్య మొదలైంది..

కులగణనపై ఓబీసీల సందేహాలు..

ఏ సమాజంలోనైనా వివాహ వ్యవస్థ ఎలా ఉందో చూసి ఆ సమాజం మానవ విలువల స్థాయి అర్థమవుతుంది. భారతీయ సమాజంలో పెళ్లి కేవలం రెండు మనసుల మధ్య ఒప్పందం కాదు.. అది రెండు కుటుంబాల మధ్య బాధ్యతా బంధం, తరాల కొనసాగింపు, సామాజిక భద్రతా వ్యవస్థ. అలాంటి వ్యవస్థ నేడు నెమ్మదిగా కానీ స్పష్టంగా వాణిజ్య మార్కెట్‌గా మారుతోంది..

కర్నూలులో ప్రరవే 8వ మహాసభలు..

సేవ నుంచీ.. దోపిడీ వరకు..

నేడు చాలా మ్యారేజ్ బ్యూరోలు 'సేవ' అన్న పదాన్ని వాడుతున్నప్పటికీ, వాటి పని తీరును గమనిస్తే అవి ఒక రిస్క్ లేని బ్రోకరేజ్ వ్యవస్థలా పనిచేస్తున్నాయి. మొదట్లో మ్యారేజ్ బ్యూరోలు ఒక అవసరంగా పుట్టాయి. ఉద్దేశ్యం మంచిదే, సరైన సంబంధం వెతకడం, కుటుంబాల మధ్య మధ్యవర్తిత్వం, విశ్వసనీయత కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. నేడు కనిపిస్తున్న భయంకర వాస్తవాలు, ఒక పెళ్లి కుదిరితే 5% 10% కమిషన్, అబ్బాయి జీతం ఎక్కువైతే 'ప్రీమియం ప్రొఫైల్', అమ్మాయి ఆస్తి ఉంటే 'హాట్ డీల్' ఇది పెళ్లి కాదు.. హ్యూమన్ ట్రేడింగ్, వంద అబద్ధాలాడి ఒక పెళ్లి చేయాలనేది పాత కాలం సూక్తి, కానీ నేడు.. వంద అబద్ధాలాడి ఒక పెళ్లి చేసి లక్షలు దోచుకోవాలి.. అంటే, పెళ్లి ఎంత 'పెద్దది' అయితే, బ్రోకర్ లాభం అంత ఎక్కువ.

సామాన్యుడికి అభయం లేని బడ్జెట్!

లాభం ప్రైవేట్‌కి, నష్టం సమాజానికి..

ఇక్కడ ఒక ప్రాథమిక ప్రశ్న వేయాలి, పెళ్లి కుదరడంలో మధ్యవర్తి పాత్ర ఉందనుకుందాం. కానీ అతనికి అబ్బాయి మంచివాడా? మానసికంగా స్థిరంగా ఉన్నాడా? వ్యసనాలు ఉన్నాయా? మహిళలపై దృక్పథం ఎలా ఉంది? ఇవి నిజాయితీగా పరిశీలించే బాధ్యత వాస్తవంలో లేదు. ఎందుకంటే ఆ ప్రశ్నలకు సమాధానాలు వెతికితే డీల్ ఆలస్యం అవుతుంది, లేదా పూర్తిగా కుదరకపోవచ్చు.. వ్యాపార దృష్టిలో అది 'నష్టం'. ఇదే కారణంగా అబద్ధాలు వ్యవస్థలో భాగమయ్యాయి. ఇది వ్యక్తిగత దుర్మార్గం కాదు. ఇది వ్యవస్థాగత ప్రోత్సాహం. అందుకే ఇవన్నీ 'తర్వాత చూసుకుందాం' అన్న ధోరణితో పెళ్లి చేసేస్తున్నారు. ఇక పెళ్లి తర్వాత సమస్యలు వస్తే అది కుటుంబాల సమస్యగా మారుతుంది, బ్రోకర్ బాధ్యత కాదు. అంటే లాభం ప్రైవేట్‌కి, నష్టం సామాజానికి..

సమాజం మౌనంతో చేసిన హత్య!

నష్టపోతున్న ఆడపిల్ల తల్లిదండ్రులు..

ఈ వ్యవస్థలో అత్యధికంగా నష్టపోతున్న వర్గం ఆడపిల్ల తల్లిదండ్రులు.. ఇది భావోద్వేగ వాదన కాదు, ఒక సామాజిక వాస్తవం. పెళ్లి వయసు దాటిపోతుందేమో అన్న భయం, సమాజపు ప్రశ్నలు, బంధువుల ఒత్తిడి ఇవి ఇప్పటికే మానసి కంగా భారంగా ఉంటాయి. ఈ భయాన్ని కొందరు బ్యూరోలు స్పష్టంగా ఉపయోగించుకుంటున్నారు. 'ఇదే చివరి మంచి సంబంధం', 'ఇలాంటి అబ్బాయి మళ్లీ రాడు' వంటి మాటలు ఒకరకమైన మానసిక మానిప్యులేషన్. ఈ పరిస్థితిలో తల్లిదండ్రులు ఆలోచన కంటే భయంతో నిర్ణయాలు తీసుకుంటున్నారు.. మ్యారేజ్ యాప్స్ ఈ వాణిజ్యీకరణను మరింత వేగవంతం చేశాయి. ఆల్గారిథమ్ ఆధారిత మ్యాచింగ్ అనేది సాంకేతికంగా ఆధునికంగా కనిపించినా, వాస్తవానికి అది కొద్ది కొలమానాలకే పరిమితం. వయసు, జీతం, కులం, ఆస్తి, మానవ స్వభావం, మానసిక ఆరోగ్యం, విలువలు వంటి అంశాలు డేటాగా మారలేవు.. కాబట్టి అవి పూర్తిగా పక్కకు నెట్టబడుతున్నాయి. ఫలితంగా మనిషి ఒక ప్రొఫైల్ కార్డుగా మారిపోయాడు.

ఇలాగే అయితే...

విద్య, వైద్యం వాణిజ్యమైతే ఫలితాలు మనం ఇప్పటికే చూస్తున్నాం. ఇప్పుడు వివాహ వ్యవస్థ కూడా అదే దారిలో నడిస్తే, దాని ప్రభావం మరింత లోతుగా ఉంటుంది. ఎందుకంటే కుటుంబం అనేది సమాజానికి మూల యూనిట్. కుటుంబాలు బలహీనపడితే, చట్టాలు ఎంత ఉన్నా సమాజం నిలబడదు.. దీర్ఘకాలంలో సామాజిక అసమతుల్యత పెరుగుతుంది. పెళ్లి ఒక డీల్‌గా మారితే, విశ్వాసం బలహీనపడుతుంది, కుటుంబాలు అస్థిరమవుతాయి. ఇది 'ఆధునికత వర్సెస్ సంప్రదాయం' అనే సులభమైన చర్చ కాదు. మార్పు అవసరం. యాప్స్ అవసరం. కానీ నియంత్రణ లేకుండా, బాధ్యత లేకుండా, లాభమే లక్ష్యంగా మారితే అది అభివృద్ధి కాదు, మానవతా విలువల క్షీణత.

### పరిష్కారం...

ఈ పరిస్థితికి పరిష్కారం రెండు స్థాయిల్లో ఉండాలి. ఒకటి వ్యవస్థాగతంగా.. అంటే మ్యారేజ్ బ్యూరోలకి చట్ట బద్ధమైన నమోదు, కమిషన్ పరిమితులు, తప్పుడు సమాచారానికి శిక్షలు, కనీస వెరిఫికేషన్ ప్రమాణాలు అవసరం. రెండోది సామాజికం.. కుటుంబాలు 'పెళ్లి కుదిరితే చాలు' అనే ఆలోచన నుంచి 'ఎలాంటి పెళ్లి' అనే ప్రశ్న వైపు మారాలి. ఎందుకంటే పెళ్లి అనేది మార్కెట్ డీల్ కాదు.. అది జీవితకాల బాధ్యత. దాన్ని పూర్తిగా వ్యాపారంగా మార్చి భవిష్యత్ తరాల మానసిక ఆరోగ్యాన్ని కూడా ప్రమాదంలోకి నెడుతున్నాం. పెళ్లి అంటే బాధ్యత, విశ్వాసం, మానవత్వం. వాటిని కమీషన్లలో కొలవడం మన సమాజం చేసిన నైతిక అపరాధం. ఇది ఇప్పుడే ఆలోచించాల్సిన సమయం.. తర్వాత కాదు..

## రాష్ట్రాల హక్కులపై కేంద్రం కబ్జా




భారతదేశం అనే మహావృక్షానికి రాష్ట్రాలే వేళ్లు. వేళ్లు బలంగా ఉంటేనే వృక్షం వర్ధిల్లుతుంది. కానీ, నేడు ఆ వేళ్లకు అందాల్సిన పోషకాలను కేంద్రం తన గుప్పిట్లోకి తీసుకుంటూ, రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని నీరుగారుస్తున్నది. దేశాభివృద్ధిలో ఇంజిన్లుగా పని చేస్తున్న రాష్ట్రాలకు బాసటగా నిలువాల్సిన కేంద్రం.. కన్నతల్లే దయ్యమైనట్టు రాష్ట్రాల వాటాను కబళించాలని చూడటం రాజ్యాంగబద్ధమైన సమాఖ్య స్ఫూర్తికే గొడ్డలిపెట్టు. ఇది కేవలం నిధుల పంపిణీకి సంబంధించిన సాంకేతిక అంశం కాదు; ప్రగతిని కాంక్షించే ప్రతి పౌరుడి ఆత్మగౌరవానికీ సంబంధించిన సమస్య. కేంద్రంలో అధికారంలో కాంగ్రెస్ బీజేపీ ఉన్నా దక్షిణాది రాష్ట్రాల పట్ల అనుసరిస్తున్న వివక్షాపూరిత వైఖరి మాత్రం ఒక్కటే. గడిచిన ఆరు ఆర్థిక సంఘాల కాలపరిమితిని విశ్లేషిస్తే, నాలుగు పర్యాయాలు బీజేపీ ప్రాతినిధ్యం ఉంటే, మరో మూడు పర్యాయాలు కాంగ్రెస్ భాగస్వామ్యం ఉన్నది. అంటే ఢిల్లీ పీఠంపై ఏ జెండా ఉన్నా, దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక మూలాలను దెబ్బతీసి, నిధులను దారి మళ్లించడంలో మాత్రం ఆ రెండు పార్టీలది ఒకే బాట. పార్టీలు మారినా, రాష్ట్రాల హక్కులను హరించి అధికారాన్ని కేంద్రంలో కుప్పబోసుకోవాలనే వారి ఆలోచనా ధోరణిలో ఏమాత్రం మార్పు లేదు. దక్షిణాది రాష్ట్రాలు గడిచిన నాలుగు దశాబ్దాలుగా మానవాభివృద్ధి సూచికల్లో దేశానికే దిక్సూచిగా నిలిచాయి. జనాభా నియంత్రణ, అక్షరాస్యత, ఆరోగ్య రంగాల్లో ఈ రాష్ట్రాలు సాధించిన అద్భుత ప్రగతి నేడు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నది. దేశ జీడీపీలో దాదాపు 30 శాతానికి పైగా వాటాను అందిస్తూ, కేంద్ర ఖజానాకు సింహభాగం ఆదాయాన్ని సమకూరుస్తున్న ఈ రాష్ట్రాల పట్ల కేంద్రం అమానవీయమైన పద్ధతిలో వ్యవహరిస్తున్నది. 11వ ఆర్థిక సంఘం కాలంలో దక్షిణాది రాష్ట్రాల పన్నుల వాటా 21.1 శాతం. అది 15వ ఆర్థిక సంఘం నాటికి 15.8 శాతానికి పడిపోయింది. ఇటీవల 16వ ఆర్థిక సంఘం స్వల్ప సర్దుబాటు, గత దశాబ్దకాలంగా జరిగిన భారీ నష్టాన్ని ఏమాత్రం పూడ్చలేని నామమాత్రపు ఓదార్పు. రాష్ట్రాలకు ఊతమివ్వకుండా నిధుల్లో కోత కోయడం ప్రగతిశీలతకు వేస్తున్న జరిమానా తప్ప మరొకటి కాదు. కేంద్ర ప్రభుత్వం 'సెస్సులు, సర్‌చార్జీల' పేరుతో రాష్ట్రాల రాజ్యాంగబద్ధమైన వాటాను అత్యంత చాకచక్యంగా తప్పిస్తున్నది. పన్నుల ఆదాయంలో రాష్ట్రాలకు వాటా ఇవ్వాలి కానీ, సెస్సుల రూపంలో వసూలు చేసే నిధులను రాష్ట్రాలతో పంచుకోవాల్సిన అవసరం లేదనే రాజ్యాంగ లొసుగును కేంద్రం అస్త్రంగా వాడుకుంటున్నది. ఫలితంగా, రాష్ట్రాలకు పంచాల్సిన నిధుల రాశి క్రమంగా కుంచించుకుపోతున్నది. 'నానాటికి తీసికట్టు నాగంభొట్లు' అన్న చందంగా రాష్ట్రాల అధికారాలు, నిధులు తగ్గిపోతుంటే.. అవి కేవలం సాధారణ పరిపాలనకు మాత్రమే తప్ప, మరే గొప్ప ప్రజాహిత కార్యక్రమం చేపట్టలేని నిస్సహాయతలోకి జారిపోతున్నాయి. కేంద్రం చేసే ఈ లోపాయికారి దోపిడీ వల్ల నిధులు లేక రాష్ట్రాలు విలవిల్లాడుతుంటే, క్షేత్రస్థాయిలో ప్రజల అసంతృప్తికి మాత్రం రాష్ట్ర ప్రభుత్వాలే మొదటి లక్ష్యం (టార్గెట్)గా మారుతున్నాయి. సామాన్య ప్రజలకు ఈ సంక్లిష్ట ఆర్థిక సమీకరణాలు అర్థం కావు కనుక కేంద్రం తెలివిగా బాధ్యత నుంచి తప్పించుకుంటున్నది. జాతీయ స్థాయి ఎన్నికలు వచ్చినప్పుడు అసలైన ఆర్థిక సమస్యలు చర్చకు రాకుండా, భావోద్వేగాలను రెచ్చగొట్టి ప్రజల దృష్టిని మళ్లించి ఓట్లు కొల్లగొడుతున్నది. ప్రజల అవసరాలు తీర్చలేని నేరానికి రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ముందు దోషులుగా నిలబడి బలి అయిపోతుంటే, ఆ నిస్సహాయతకు అసలు కారణమైన కేంద్రం మాత్రం తెరచాటున పబ్బం గడుపుకొంటున్నది. కేంద్రం చేస్తున్న ఈ దాడి.. ఇంద్రజిత్తు మేఘాల చాటున దాగి చేసే యుద్ధంలా ఉన్నది. బాణం విడిచిన వాడు కనపడడు కానీ, ఆ బాణం రాష్ట్రాల గుండెలకు తగిలి ప్రాణం పోతున్నది. ఒక ప్రాంతం కష్టపడి సంపాదించి పెడుతున్నా, తమ న్యాయబద్ధమైన వాటాను కేంద్రం కాలరాస్తున్నదన్న భావన బలపడితే, అది దేశ సమగ్రతకు ఏమాత్రం క్షేమకరం కాదు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిని ఎవరూ కాదనరు, కానీ అది ప్రగతిశీల రాష్ట్రాల ప్రయోజనాలను దెబ్బతీస్తూ జరగకూడదు. రాష్ట్రాలు కేంద్రంపై ఆధారపడే యాచకులుగా కాకుండా, దేశ నిర్మాణంలో సమాన భాగస్వాములుగా గుర్తింపు పొందినప్పుడే నిజమైన సమాఖ్య వ్యవస్థ వర్ధిల్లుతుంది.

# ధురందర్ - 2‘లో సల్మాన్ ఖాన్ - వైరల్ అవుతున్న ఫొటో

## ధురందర్ సీక్వెల్ లో సల్మాన్ ఖాన్ - ఆ పవర్ఫుల్ పాత్ర 'సల్లు భాయ్' దేనా- సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం!



నటుడు సల్మాన్ ఖాన్ ధురంధర్ - 2లో నటిస్తున్నారా? ఈ సినిమాలో ఆయన కీ లక పాత్ర చేయనున్నారా? ప్రస్తుతం సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం ఇది. ఎందుకంటే సల్మాన్ ్ు సంబంధించి ఓ ఫొటో సోషల్ మీడియాలో బాగా వైరల్అవుతోంది. అది ధురంధర్ 2 సినిమా షూటింగ్ స్పాట్ లోనిదే అని పుకార్లు మొదలయ్యాయి. దీంతో సల్మాన్ ఖాన్ ఈ సీక్వెల్ లో నటిస్తున్నారంటూ చర్చ మొదలైంది.

అభిమానుల్లో కన్ఫ్యూజన్ ఆదిత్య ధర్- బాలీవుడ్ స్టార్ హీరో రణ్ వీర్ సింగ్ కాంబోలో తెరకెక్కిన ధురంధర్ మూవీ గతేడాది డిసెంబర్ లో విడుదలైంది. అయితే, దీనికి సీక్వెల్ రానున్నట్లు చిత్రబృందం ఇదివరకే ప్రకటించింది. ఈ సీక్వెల్ ‘ధురంధర్: ది రివెంజ్‘ పేరుతో మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీనికి సంబంధించిన టీజర్ కూడా మంగళవారం రిలీజైంది. ఈ నేపథ్యంలో ఈ సీక్వెల్‌లో సల్మాన్ ఖాన్ ఉన్నట్లు ఒక ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అందులో సల్మాన్ వైట్ షర్ట్ తో పైనుంచి నల్లటి కోట్ ధరించి కనిపిస్తున్నారు. ఇందులో ఆయన మెడలో టై స్పెషల్ అట్రాక్షన్ గా ఉంది. ఆయనతోపాటు ఇద్దరు వ్యక్తులు పక్కన ఉన్నారు. ఇది ధురంధర్ సీక్వెల్ లోని షూటింగ్ స్పాట్ లోని ఫొటో అని ప్రచారం సాగుతోంది. ఆ పాత్రలోనేనా? సినిమా హైప్ పెంచడానికి నిర్మాతలు సల్మాన్ ను సంప్రదించారని సినీ వర్గాల్లోనూ టాక్ నడుస్తోంది. ‘ధురంధర్‘ మొదటి భాగంలో, ఒక శక్తిమంతమైన పాత్ర ఉంది. ఆ పాత్ర పేరు ‘బడే సాహబ్‘. కానీ ఇందులో ఎవరు నటిస్తున్నారనేది తొలి పార్ట్లో రివీల్ చేయలేదు. ఈ విషయాన్ని సస్పెన్స్ గా ఉంచారు. ఈ పాత్ర సీక్వెల్ లో కీలకం కానుందని టాక్. అయితే, ‘ధురందర్ 2‘ టీజర్ విడుదలైన వెంటనే ఆ పాత్రలోకి పవర్ ఫుల్ క్యారెక్టర్ ఎంట్రీ ఇవ్వనున్నట్లు సోషల్ మీడియాలో రూమర్స్ మొదలయ్యాయి. ఇంతలో సల్మాన్ ఖాన్ ఫొటో వైరల్ గా మారింది. దీంతో ఆ పవర్ ఫుల్ పాత్రలో సల్మానే నటిస్తున్నారంటూ వార్తలు వస్తున్నాయి.

### అసలు సంగతేంటి?

సల్మాన్ ఫొటో అయితే వైరల్ అవుతోంది. కానీ ఆ ఫొటోను గనుక ఒకసారి సరిగ్గా గమనిస్తే అది రియల్ ఫొటోనా? లేదా ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ (ఒు×) వాడి క్రియేట్ చేసిందా అనే సందేహాలు మొదలయ్యాయి. కొందరు అది సల్మాన్ ఒరిజినల్ ఫొటోనే అంటే, మరికొందరు మాత్రం విజువల్‌గా క్రియేట్ చేసినట్లు ఉందని అంటున్నారు. అయితే ఇది పూర్తిగా ఏఐ ఫొటోనే అని పోస్టు కింద డిస్ క్లైమర్ రాసి ఉంది. ఇది కేవలం ఎంటర్టైన్మెంట్ కోసం క్రియేట్ చేసిందని, దీనిపై ఎలాంటి అఫీషియల్ అప్డేట్ లేదని స్పష్టంగా క్యాప్షన్‌లో రాసి ఉంది. ఈ విషయంపై చిత్ర బృందం నుంచి క్లారిటీ రావాల్సి ఉంది. ఒకవేళ ఇందులో సల్మాన్ ఉంటే మాత్రం సినిమా ఇంకో లెవెల్‌లో ఉంటుందని ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. కాగా, ధురందర్ సినిమా మొదటి భాగం హిందీలో మాత్రమే విడుదల కాగా, రెండో పార్ట్ హిందీతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ అవుతుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని టీజర్‌ను కూడా చిత్రనిర్మాతలు విడుదల చేశారు. ‘ఇది కొత్త భారతదేశం. సరిహద్దులు దాటి చొచ్చుకువచ్చి మరి దెబ్బకొట్టి తీరుతుంది‘ అని రణ్‌వీర్ సింగ్ రివెంజ్ డైలాగుతో అదరగొట్టారు. దీంతో ఆయన అభిమానులు సినిమా ఎప్పుడెప్పుడు చూడాలని తాపత్రయపడుతున్నారు. ఇదిలా ఉండగా, గతేడాది డిసెంబర్ 5న ఎలాంటి అంచనా లేకుండా విడుదలైన ధురందర్ సినిమా విడుదలైంది. తొలి రోజునుంచే మౌత్ టాక్‌తో దూసుకెళ్లింది. సీక్రెట్ ఏజెంట్‌గా హీరో రణ్‌వీర్ సింగ్ లుక్స్, యాక్టింగ్, విలన్‌గా అక్షయ్ ఖన్నా పెర్ఫామెన్స్, పోరాటాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అందుకు తగ్గట్టే ఈ మూవీ వసూళ్ల రికార్డులను సైతం సృష్టించింది. దాదాపు రూ.1400 కోట్లతో అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా ‘ధురంధర్‘ రికార్డు నెలకొల్పిడం గమనార్హం. అంతేకాదు, ఎక్కువ కలెక్షన్లు రాబట్టిన భారతీయ చిత్రాల జాబితాలో నాలుగో స్థానంలో నిలిచింది. కేవలం హిందీలోనే విడుదలై, అత్యధిక వసూళ్లు సాధించిన రెండో మూవీగా ఘనత సాధించింది.

# సమ్మర్ రిలీజ్ లపై నో క్లారిటీ- ‘ప్యారడైజ్‘, ‘పెద్ది‘ తో ‘ఉస్తాద్ భగత్ సింగ్ ‘పై ఎఫెక్ట్!

## టాలీవుడ్ లో నెలకొన్న గందరగోళం- సమ్మర్ రిలీజ్ లపై ఇంకా వీడని సస్పెన్స్- దాదాపు పోస్ట్ పోన్ ఖాయమేనా?







టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సంక్రాంతి సీజన్ సినిమాల సందడి ముగిసింది. ఈ పండక్కి వచ్చిన సినిమాలు దాదాపు అన్నీ ప్రేక్షకులను అలరించాయి. ఇక సంక్రాంతి తర్వాత సినిమాల రిలీజ్‌లకు అతిపెద్ద సీజన్ సమ్మర్. ఇప్పుడు ప్రేక్షకుల దృష్టి సమ్మర్ సినిమా రిలీజ్ లపై పడింది. అందులో భాగంగానే నాని ప్యారడైజ్, రామ్ చరణ్ పెద్ది సినిమాల రిలీజ్ డేట్లు ఆయా ప్రాజెక్ట్ ల మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. కానీ, ఈ సినిమాలు పోస్ట్ పోన్ అయ్యే ఛాన్స్ ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. దీంతో గందరగోళం నెలకొంది.

### ప్యారడైజ్, పెద్ది మూవీ రిలీజ్ లో కన్ఫ్యూజన్!

ఈ సమ్మర్ లో భారీ అంచనాలతో రానున్న సినిమాలు ప్యారడైజ్ (మార్చి 26), పెద్ది (మార్చి 27) ఒకరోజు గ్యాప్ లో రిలీజ్ కానున్నట్లు మేకర్స్ ప్రకటన చేశారు. దీంతో ఆడియెన్స్ కూడా ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. కానీ కొన్ని రోజులుగా ఈ సినిమా విడుదల విషయంలో కన్ ఫ్యూజన్ పెరుగుతోంది. ముందుగా ప్రకటించిన డేట్స్ ప్రకారం మార్చిలో రిలీజ్ చేయట్లేదని రెండు సినిమాల డిస్ట్రిబ్యూటర్లకు సమాచారం వెళ్లినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తుంది. రిలీజ్ కు ఇంకా 50 రోజులే సమయం ఉన్నా, దీనిపై మాత్రం నిర్మాతల నుంచి అప్డేట్ లేదు. భారీ బడ్జెట్ సినిమాలు బాక్సాఫీస్ క్లాష్ వద్దని భావిస్తే ఏదో ఒక సినిమా పోస్ట్ పోన్ అయ్యే ఛాన్స్ ఉంది. తెలుగు సినిమాలతో పాటు అదే నెలలో కేజీఎఫ్ స్టార్ యశ్ ‘టాక్సిక్‘, రణ్ వీర్ సింగ్ ‘ధురంధర్ 2‘ కూడా రానున్నాయి. అందుకే సేఫ్ సైడ్ ఆలోచించి ఒకరు రేసు నుంచి తప్పుకునే ఛాన్స్ ఉంది. లేదంటే నాలుగు సినిమాలు వచ్చిన థియేటర్ అడ్జెస్ట్ మెంట్ ఉండొచ్చు! మరి ఎవరైనా తగ్గుతారా? లేదా చెప్పిన తేదీకే వస్తారా? అనేది చూడాలి. ఉస్తాద్ పై ఎఫెక్ట్ అయితే ఈ సినిమాల విడుదలపై ఎలాంటి క్లారిటీ లేనందున, ఇది ఇతర ప్రాజెక్ట్స్ పైన ఎఫెక్ట్ చూపుతుంది. ముఖ్యంగా ఉస్తాద్ భగత్‌సింగ్ మూవీపై పడిందని అనుకోవచ్చు. ఈ సినిమా షూటింగ్ కంప్లీట్ అయిపోయినా, మేకర్స్ మాత్రం రిలీజ్ డేట్ ప్రకటించలేదు. దీనికి కారణం ఈ నిర్మాతలు, పెద్ది సినిమా విడుదలపై క్లారిటీ కోసం ఎదురుచూస్తున్నారు. ఎందుకంటే ఉస్తాద్ భగత్ సింగ్ ప్రొడక్షన్ సంస్థ, అటు పెద్ది సినిమాకు కొంతమేర ఫైనాన్స్ చేసినట్లు సమాచారం. అందుకే ఉస్తాద్ భగత్ సింగ్ టీమ్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోతుంది. అలాగే మెగాస్టార్ చిరంజీవి విశ్వంభర కూడా మే నెలలో రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారని తెలిసింది. కానీ ఇప్పటికీ ఈ సమ్మర్ లో రానున్న సినిమాలపై మాత్రం ఓ స్పష్టత రాలేదు.

### ‘పెద్ది‘తో రామ్ చరణ్

ఇక ‘పెద్ది‘ సినిమా విషయానికొస్తే దీనికి బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. దీంట్లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కు జోడిగా జాన్వీ కపూర్ నటిస్తున్నారు. కాగా ఈ చిత్రాన్ని ఉత్తరాంధ్ర ప్రాంతం నేపథ్యంలో స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన షూట్ దగ్గర పడుతోంది. దీంట్లో శివ్ రాజ్‌కుమార్, దివ్యేందు శర్మ, జగపతి బాబు వంటి నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇక ఈ సినిమా మార్చి 27న విడుదల కానుందని మూవీ మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేశారు. మరి ప్రస్తుత పరిస్థితులలో మూవీ డేట్ మారే అవకాశం ఉంది.

### నాని ‘ప్యారడైజ్‘

దసరా‘తో హిట్ సాధించిన దర్శకుడు శ్రీకాంత్ ఓదెలా, మరోసారి నానితో కలిసి పనిచేస్తున్నారు. సికింద్రాబాద్ నేపథ్యంగా రూపొందుతున్న ఈ పీరియడ్ యాక్షన్ డ్రామాలో నాని సరసన కాయదు లోహార్, రాఘవ జూయాల్, సోనాలి కుల్‌కర్ణి వంటి వారు నటిస్తున్నారు. అయితే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం ఆలస్యమైంది. అయితే ఈ సినిమా కూడా అనుకున్న డేట్ కు రిలీజ్ అవ్వటం కష్టమేనని టాక్ వినిపిస్తోంది. రిలీజ్ తేదీ వాయిదా పడే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ సినిమాలతో సమ్మర్ లో ఇంకా యశ్ మూవీ టాక్సిక్ , అడవి శేష్ సినిమా డకాయిట్ , విశ్వంభర, స్వయంభ్ వంటి సినిమాలు సమ్మర్ లో రిలీజ్ కు ప్లాన్ చేసుకున్నాయి.

# ప్రేమ మిమ్మల్ని మంచి వ్యక్తిగా మారుస్తుంది‘

# ధనుష్‌తో డేటింగ్ రూమర్ల వేళ మృణాల్

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్‌తో మృణాల్ లవ్ ఉన్నట్లు వార్తలు

ఈ క్రమంలో ప్రేమ గురించి మృణాల్ కీలక వ్యాఖ్యలు

ప్రేమను అందమైన అనుభూతిగా అభివర్ణించిన హీరోయిన్



తమిళ హీరో ధనుష్, స్టార్ హీరోయిన్ మృణాల్ లవ్‌లో ఉన్నారని, ఈ క్రమంలో డేటింగ్ చేస్తున్నారని గత కొంతకాలంగా వార్తలు వినిపిస్తున్నాయి. అలాగే ధనుష్, మృణాల్ పెళ్లి ఫిబ్రవరి 14న జరగనుందని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారం వేళ మృణాల్ ఠాకూర్ ప్రేమ గురించి తన అభిప్రాయాలను ఓ ఇంటర్వ్యూలో షేర్ చేసుకున్నారు. లవ్ గురించి మృణాల్ ఏమన్నారంటే?

### ప్రేమ మిమ్మల్ని మంచి వ్యక్తిగా మారుస్తుంది : మృణాల్ ఠాకూర్

ప్రేమ అనేది ఒక అందమైన అనుభూతి అని, ఈ భూమిపై ఉన్న ప్రతి ఒక్కరికీ లవ్ కలగాలని మృణాల్ చెప్పుకొచ్చారు. ప్రేమ అనేది మిమ్మల్ని ఒక మంచి వ్యక్తిగా మారుస్తుందన్నారు. “లవ్ అనేది మిమ్మల్ని మీరు పునర్ సృష్టించుకోవడం, మీ బాల్యం నుంచి ఉన్న సమస్యలను పరిష్కరించుకోవడం లాంటిది. ప్రేమ ప్రపంచంలోనే అత్యంత అందమైన విషయం. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ప్రేమను పొందాలని నేను ఆశిస్తున్నాను.“ అని మృణాల్ స్పష్టం చేశారు. ప్రేమలో ఎవరు ఎక్కువ త్యాగం చేస్తారు? పురుషుడా లేక మహిళనా? అని ఇంటర్వ్యూలో ఎదురైన ప్రశ్నకు మృణాల్ తనదైన శైలిలో సమాధానం ఇచ్చారు. ఎవరైనా ప్రేమలో ఉన్నప్పుడు, వారు లింగంతో సంబంధం లేకుండా తమ భాగస్వామి కోసం పనులు చేస్తారని అన్నారు. “ప్రేమలో ఉన్న ప్రతి ఒక్కరూ ఎక్కువ త్యాగం చేస్తారు. కానీ ప్రేమలో ముఖ్యమైనది దానిని అంగీకరించడం. కొన్నిసార్లు ప్రేమను స్వీకరించడం, గుర్తించడం చాలా కష్టం. ప్రేమ నిర్వచనం మారుతుంటుంది. లవ్ మాత్రమే స్థిరంగా ఉంటుంది. మీరు దానిని ఎలా స్వీకరిస్తారు అనేదే ముఖ్యం. అబ్బాయి అయినా అమ్మాయి అయినా ప్రేమలో ఉన్నప్పుడు ఒకరికి కోసం ఇచ్చిపుచ్చుకొనే ధోరణిలో ఉంటారు. లవ్‌లో ఉన్నప్పుడు మీరు సరెండర్ అయిపోతారు.“ అని మృణాల్ పేర్కొన్నారు.

### ‘ఆ బ్రేకప్ గురించి నేనేమీ బాధపడలేదు‘

అలాగే ఇటీవలే ఓ సినిమా ప్రచారంలో భాగంగా ఇంటర్వ్యూలో పాల్గొన్న మృణాల్ తన మాజీ ప్రియుడి గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తన మాజీ బాయ్‌ఫ్రెండ్‌తో బంధం ముగిసిపోయినందుకు తానేమీ బాధ పడలేదని చెప్పారు. తాను యాక్టింగ్ చేయడం కూడా తన లవర్‌కు నచ్చలేదని, విడిపోవడానికి అది కూడా ఓ కారణమన్నారు. బ్రేకప్ చెప్పినందుకు తానేం బాధపడలేదని, తన మాజీ ప్రియుడి మనస్తత్వం గురించి జాలి పడ్డానని మృణాల్ చెప్పుకొచ్చారు. అలాంటివాళ్లతో కొనసాగడం కూడా కష్టమేనని, అందుకే విడిపోయామని తెలిపారు.

### ధనుష్ డేటింగ్ వార్తలపై స్పందించిన మృణాల్

కొన్నాళ్లుగా తమిళ స్టార్ హీరో ధనుష్‌తో మృణాల్ డేటింగ్‌లో ఉన్నారనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ వార్తలపై మృణాల్ ఇటీవలే స్పందించారు. ధనుష్ తనకు మంచి స్నేహితుడని ఆ ప్రచారాన్ని ఖండించారు మృణాల్. ఆ తర్వాత టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌తో ఆమె డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు రాగా వాటిని మృణాల్ ఖండించారు. ఇలాంటి రూమర్స్ వినడానికి ఫన్‌గా ఉంటాయన్నారు. ఇలాంటి వార్తలను సృష్టిస్తుంటారని, వాటిని చూసి తాను నవ్వుకుంటాయని తెలిపారు. ఫ్రీ పీఆర్ స్టంట్స్ ఇవన్నారు. ఇక తెలుగులో మృణాల్ అడివి శేష్ లీడ్ రోల్‌లో తెరకెక్కుతున్న ‘డకాయిట్ , ఓ ప్రేమ కథ‘ సినిమాలో యాక్ట్ చేస్తున్నారు. ఈ సినిమా ‘గూఢచారి‘కి సీక్వెల్. డైరెక్టర్ షానిల్ డియోల్ ఈ సినిమాను స్పై యాక్షన్ థ్రిల్లర్ జానర్‌లో రూపొందిస్తున్నారు. దాదాపు రూ.100 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోంది. సినిమాలో పలు యాక్షన్ ఎపిసోడ్స్ ను పోలాండ్, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, ఇటలీ వంటి దేశాల్లో తీశారు. బాలీవుడ్ స్టార్ యాక్టర్ ఇమ్రాన్ హష్మి ఇందులో కీలక పాత్రలో కనిపించనున్నారు. సీనియర్ నటులు అనురాగ్ కశ్యప్, ప్రకాశ్‌రాజ్ కూడా ఆయా పాత్రల్లో మెరవనున్నారు.

# వారణాసి రిలీజ్ లోపు అలా జరగకపోతే టెంట్ వేసుకుని ధర్నా చేస్తా

వారణాసి మూవీటీమ్ చిట్ చాట్

సినిమాకు సంబంధించిన విషయాలు షేర్ చేసుకున్న

రాజమౌళి, మహేశ్ బాబు

ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినిమా ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న చిత్రం ‘వారణాసి‘. ఎస్ ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబినేషన్ లో తెరకెక్కుతున్న ఈ చిత్రం ఏడాది ముందు నుంచే భారీ ప్రమోషన్స్ లో ఫుల్ బిజీగా ఉంది. ఎప్పుడు లేని విధంగా సినిమా షూటింగ్ దశలో ఉండగానే ప్రమోషన్స్ లో పాల్గొనడం అభిమానులకు చాలా ప్రత్యేకంగా అనిపిస్తుంది. అయితే హాలీవుడ్ కు సంబంధించిన ప్రముఖ మీడియాతో చిత్ర బృందం ఓ ఇంటర్వ్యూలో పాల్గొంది. ఇందులో మూవీకి సంబంధించిన విషయాలు, అనుభవాలను షేర్ చేసుకుంది. అవేంటంటే? వారణాసి సీక్వెల్ పై క్లారిటీ ఇంత భారీ బడ్జెట్ తో తెరకెక్కిస్తున్న ఈ సినిమా కచ్చితంగా రెండు భాగాలుగా ఉంటుందని ప్రేక్షకులు అంచనా వేశారు. ఈ ప్రాజెక్ట్ అనౌన్స్ చేసినప్పటి నుంచి దీనిపై సోషల్ మీడియాలో భారీ చర్చ జరుగుతుంది. అయితే ఈ అపోహలన్నిటికీ సినిమా దర్శకుడు చెక్ పెట్టారు. ఈ చిత్రాన్ని రూపొందించే క్రమంలో దీన్ని రెండు భాగాలుగా తెరకెక్కించాలని అనుకున్నామని, కానీ వెంటనే ఆ ఆలోచనను విరమించుకొని సింగిల్ పార్ట్ గా తీసుకొస్తున్నట్లు రాజమౌళి చెప్పారు. అయితే ఈ సినిమా మూడు గంటల రన్ టైంతో 2027లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

### రాజమౌళితో సినిమా అంటే భయమేసింది!

రాజమౌళి- మహేశ్ బాబు కాంబినేషన్ లో 15 ఏళ్ల క్రితమే సినిమా తెరకెక్కాల్సిందట. కానీ కొన్ని కారణాల వల్ల అది కుదరలేదని మహేశ్ తెలిపారు. ఈ సినిమా కథ వినేందుకు దర్శకుడు ఆయనను ఆఫీస్ కు పిలిచారని, ఈ కథ రాజమౌళి ఇప్పటి వరకు తెరకెక్కించిన అన్ని సినిమాల కంటే కూడా చాలా భిన్నంగా ఉంటుందని మహేశ్ అన్నారు. ఆశ్చర్యం కలిగించే విషయం ఏంటంటే, ఈ కథలో అన్ని జానాల ( యక్షన్ , డ్రామా, అడ్వెంచర్ , టైం ట్రావేల్ )కు సంబంధించిన అంశాలు ఉన్నాయి. ఇందులో హీరోగా నటించేందుకు మొదట్లో భయమేసినా, దర్శకుడు కథను వివరించిన తీరు తన భయాన్ని పోగొట్టిందని మహేశ్ తెలిపారు. 6 నెలలు నేర్చుకున్న మహేశ్ ఈ సినిమాలో మహేశ్ రుద్ర పాత్రతో పాటు రాముడి పాత్రలో కూడా కనిపించనున్నారు. రాముడి పాత్రలో నటించడం అంత సులువైన విషయం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఆయన నడవడిక, హుందాతనం వేరే పాత్రలతో పోల్చితే చాలా భిన్నంగా ఉంటుందని, కనపడని ఒక తేజస్సు ఉంటుందని తెలిపారు. అయితే నిలబడే విధానం దగ్గర నుంచి పాత్రలో నటించడం వరకూ ఎన్నో రిహార్సల్స్ చేశారట. ఈ రిహార్సల్స్ కోసమే దాదాపు 2- 3 నెలల వరకు కష్టపడ్డారట. ఇదే కాకుండా మహేశ్ రన్నింగ్ కు ఒక ప్రత్యేకమైన స్టైల్ ఉంటుంది. సినిమా కోసం ఆ స్టైల్ ను మార్చుకుని, అందులో పర్ఫెక్ట్ అయ్యేందుకు ఆయనకు ఆరు నెలల సమయం పట్టిందని హీరో క్లారిటీ ఇచ్చారు. కెరీర్ ను మార్చిన సినిమాలు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్న మహేశ్ , ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ తమ కెరీర్ ను మార్చిన సినిమా గురించి ప్రస్తావించారు. అయితే మహేశ్ ఇప్పటి వరకు నటించిన చిత్రాలలో ‘పోకిరి‘ తన కెరీర్ ను పూర్తిగా మార్చేసిందని తెలిపారు. ఆ సమయంలో ఈ సినిమా భారీ హిట్ కొట్టింది. దీని తర్వాత తన మైండ్ అంతా బ్లాంక్ అయ్యిందని మహేశ్ తెలిపారు. ప్రేక్షకులలో తన సినిమాలపై భారీ అంచనాలు ఉన్నయన్న విషయం అప్పుడే తెలిసిందని, వారి కోసం కథలు ఎంచుకోవడంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నానని ఆయన అన్నారు. తాను



ఇప్పటి వరకు నటించిన అన్ని సినిమాలు తనకు ఏదో ఒక విషయం నేర్పిస్తూనే ఉంటాయని ప్రియాంక చెప్పారు. అయితే అన్ని పాత్రల్లో కల్లా బాలీవుడ్ హీరో రణ్ బీర్ కపూర్ తో కలిసి నటించిన ‘బర్ఫీ (దీబతీటఱ)‘ లోని పాత్ర చాలా ఛాలెంజింగ్ గా అనిపించిందని తెలిపారు. ఆ సినిమాలో పాత్ర చాలా అమాయకంగా, చిన్న పిల్ల మనస్తత్వం కలిగి ఉంటుంది. అయితే ఈ సినిమా తన కెరీర్ ను మార్చేసిందని తెలిపారు. నెగిటివ్ పాత్రలో నటిస్తున్న పృథ్వీరాజ్ కు కూడా కెరీర్ టర్నింగ్ సినిమా ఉందని అన్నారు. అదే ‘గోట్ లైఫ్‘ . ఈ సినిమా కథ పూర్తిగా బానిసత్వంపై ఆధారపడి ఉంటుంది. ఈ సినిమా షూట్ చేస్తున్న సమయంలో కరోనా వల్ల చాలా కష్టాలు ఎదుర్కొన్నారట. ఈ సినిమా సంవత్సరం తర్వాత మళ్లీ షూట్ చేసినట్లు తెలిపారు. ఆ సమయంలో అతను చాలా విషయాలు నేర్చుకున్నారని చెప్పారు.

### ఇండియాలో ఆ ఆప్షన్ ఉంది

వారణాసి సినిమాను కచ్చితంగా ఐమ్యాక్స్ థియేటర్ లోనే విడుదల చేస్తానని రాజమౌళి బహిరంగంగా ఇప్పటికే ప్రకటించారు. ఒకవేళ భారత్ లో 2027 నాటికి ఐమ్యాక్స్ లు అందుబాటులోకి రాకపోతే ఏం చేస్తారు? అని యాంకర్ దర్శకుడిని ప్రశ్నించారు. దానికి సమాధానంగా, “ఇండియాలో మాకు ఒక ఆప్షన్ ఉంది. అనుకున్నది జరగకపోతే ఆఫీసుల ముందు ధర్నా చేయవచ్చు. నా సినిమా రిలీజ్ సమయానికి ఐమ్యాక్స్ ఫార్మాట్ రాకపోతే నేను కూడా టెంట్ వేసుకుని థియేటర్ల బయట ధర్నా చేస్తాను“ అని నవ్వుతూ సమాధానం ఇచ్చారు.

## రామగుండం నగర పాలక సంస్థ
## ఎన్నికల్లో ప్రవర్తనా నియమావళి తప్పనిసరి...

**అభ్యర్థులు నిబంధనలు కచ్చితంగా పాటించాలి...**

**పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ అరుణ శ్రీ..**



గోదావరిఖని//**ఫిబ్రవరి 04 ఆకాంక్ష :** రామగుండం నగర పాలక సంస్థ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అనుసరించాలని పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్, స్థానిక సంస్థలు మరియు రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ సూచించారు. బుధవారం ఎన్టీపీసీ, పీటీఎస్‌లోని కాకతీయ కళ్యాణ మండపంలో రామగుండం నగర పాలక సంస్థ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో పాటించాల్సిన విధి విధానాలపై ఎన్నికల సంఘం రూపొందించిన హ్యాండ్‌బుక్‌ను అభ్యర్థులకు అందజేశామని తెలిపారు. అందులో పేర్కొన్న నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే రిటర్నింగ్ అధికారులను లేదా రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలోని ఎలెక్షన్ సెల్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో ఉపయోగించే వాహనాలకు తప్పనిసరిగా నగర పాలక సంస్థ నుండి అనుమతి తీసుకోవాలని, ఆ అనుమతి పత్రాన్ని వాహనంపై స్పష్టంగా ప్రదర్శించాలని పేర్కొన్నారు. ఎన్నికల వ్యయ పరిమితి రూ. 1.50 లక్షలకు మించరాదని, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన రేట్ల ప్రకారమే అభ్యర్థుల వ్యయాన్ని లెక్కించబడుతుందని వివరించారు.ఏ.సి.పి. ఎం. రమేష్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అభ్యర్థులు పోలీసు శాఖకు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. మైకులు, లౌడ్‌స్పీకర్లు వినియోగించేందుకు మీ సేవా కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో అనుమతి పొందాలని తెలిపారు. ర్యాలీల నిర్వహణకు ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని, నిర్ణీత సమయాల్లోనే ప్రచారం నిర్వహించాలని సూచించారు.డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌ను పటిష్టంగా అమలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తనిఖీల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గస్తీ నిర్వహిస్తున్నామని, ఎక్కడైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరిగితే నగర పాలక సంస్థ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలని కోరారు.ఈ సమావేశంలో శిక్షకులు స్వరూప్ చంద్, శ్రీనివాస్‌లు అభ్యర్థులు అనుసరించాల్సిన ప్రవర్తనా నియమావళిపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించడంతో పాటు అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో ఎన్నికల పరిశీలకులు పద్మజా రాణి, వ్యయ పరిశీలకులు సుజాత, కృష్ణ మోహన్, రవి బాబు, నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఏసీపీ శ్రీహరి, టీపీఎస్ నవీన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, సీఐలు ఇంద్రసేనా రెడ్డి, ప్రసాద రావు తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్‌లో చేరిన మాజీ కార్పోరేటర్ కోదాటి ప్రవీన్...



**ఫిబ్రవరి 04 ఆకాంక్ష :** రామగుండం పట్టణానికి చెందిన మాజీ కార్పోరేటర్ కోదాటి ప్రవీన్ బుధవారం భారత రాష్ట్ర సమితి (బీ.ఆర్.ఎస్) పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.రామగుండం పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి బీ.ఆర్.ఎస్ పార్టీ నిరంతరం కృషి చేస్తోందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. రాష్ట్రంలో బీ.ఆర్.ఎస్ పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు విశ్వాసం పెరిగిందని తెలిపారు. అలాంటి పార్టీతో కలిసి పనిచేయడం ఆనందంగా ఉందని కోదాటి ప్రవీన్ అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్.ఎస్ నాయకులు కౌశిక హరి, నడిపెల్లి మురళీధర్ రావు, గోపు ఆయులయ్య యాదవ్, బోడ్డుపల్లి శ్రీనివాస్‌తో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. రానున్న రోజుల్లో రామగుండం పట్టణంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సమిష్టిగా కృషి చేస్తామని నాయకులు స్పష్టం చేశారు.

## ప్రజా సమస్యలపై చర్చ లతో వెల్దుర్తి మండల సర్వసభ్య సమావేశం.

**వెల్దుర్తిలో సర్వసభ్య సమావేశం**

**వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు అవసరం.**



వెల్దుర్తి,**ఫిబ్రవరి 04 ఆకాంక్ష :** కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం అయిన వెల్దుర్తి మండల ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి ఎంపీపీ లక్ష్మీ దేవమ్మ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సొసైటీ చైర్మన్ రమాకాంత్ రెడ్డి, జడ్పిటిసి సుంకన్న, డిప్యూటీ ఎంపీడీవో రవి కిషోర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండలంలో పెరుగుతున్న తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.అదేవిధంగా విద్యుత్ శాఖకు సంబంధించిన సమస్యలపై కూడా చర్చ జరిగింది. గ్రామాల్లో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు వంగిపోయి ప్రమాదకరంగా మారినాయని, వాటిని వెంటనే మార్చాలని సభ్యులు డిమాండ్ చేశారు.సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై వివరించారు.ఈ సందర్భంగా సొసైటీ సింగిల్ విండో చైర్మన్ బొమ్మన రమాకాంత్ రెడ్డి మాట్లాడుతూ, రైతులకు అవసరమైన వ్యవసాయ మందులు సొసైటీలో అందుబాటులో ఉన్నాయని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతుల అభివృద్ధికి సొసైటీ ఎల్లప్పుడూ తోడ్పాటునిస్తుందని తెలిపారు.అంగన్వాడీ సూపర్వైజర్లు మాట్లాడుతూ, గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల నిర్మాణానికి మూడు సెంట్ల స్థలాన్ని కేటాయించాలని సర్పంచులను కోరారు. చిన్నారుల పోషణ, సంక్షేమానికి అంగన్వాడీ కేంద్రాలు కీలకమని వారు పేర్కొన్నారు.ఈ సమావేశంలో డిప్యూటీ ఎమ్మార్వో గురుస్వామి రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి అక్బర్ బాషా, ఏపీఓ లక్ష్మన్నతో పాటు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.

## ప్రపంచాన్ని నమ్మించి..బంగ్లాకు వెన్నుపోటు పొడిచి
## సీక్రెట్‌గా వరల్డ్ కప్ ఏర్పాట్లు చేస్తున్న పాక్

టీ20 వరల్డ్ కప్ 2026 వేదికగా ఆసియా ఖండం మరోసారి క్రికెట్ పండుగకు సిద్ధమవుతోంది. అయితే గత కొన్ని రోజులుగా ఈ మెగా టోర్నీని బహిష్కరిస్తామంటూ పాకిస్థాన్ ఆడుతున్న డ్రామాలు అన్నీ ఇన్నీ కావు. ప్రపంచం ముందు వరల్డ్ కప్ ఆడబోమని, భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తామని బిల్డప్ ఇచ్చిన పాక్.. లోలోపల మాత్రం అసలు కథ వేరే నడిపించింది. ప్రపంచాన్ని నమ్మించి..బంగ్లాకు వెన్నుపోటు పొడిచి..సీక్రెట్‌గా వరల్డ్ కప్ ఏర్పాట్లు చేస్తున్న పాక్ టీ20 వరల్డ్ కప్ 2026 వేదికగా ఆసియా ఖండం మరోసారి క్రికెట్ పండుగకు సిద్ధమవుతోంది. అయితే గత కొన్ని రోజులుగా ఈ మెగా టోర్నీని బహిష్కరిస్తామంటూ పాకిస్థాన్ ఆడుతున్న డ్రామాలు అన్నీ ఇన్నీ కావు. ప్రపంచం ముందు వరల్డ్ కప్ ఆడబోమని, భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తామని బిల్డప్ ఇచ్చిన పాక్.. లోలోపల మాత్రం అసలు కథ వేరే నడిపించింది. తాజాగా వెలుగులోకి వచ్చిన వార్తలు పాకిస్థాన్ అసలు నైజాన్ని బయటపెట్టాయి. టీ20 వరల్డ్ కప్ 2026 విషయంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్ ఆడుతున్న వింత నాటకాలు ఇప్పుడు వెలుగులోకి వచ్చాయి. భారత్ తమ దేశానికి వచ్చి ఆడటం లేదన్న నెపంతో, తాము కూడా టీ20 వరల్డ్ కప్ ఆడబోమని, టోర్నీని బహిష్కరిస్తామని పాక్ ప్రచారం చేసింది. కానీ, తాజా నివేదిక ప్రకారం.. పాకిస్థాన్ లోలోపల తన ఆటగాళ్ల కోసం ఇప్పటికే శ్రీలంక ప్రయాణ ఏర్పాట్లు పూర్తి చేసేసింది. ప్రపంచం ముందు ఒకలా మాట్లాడుతూ, వెనక మాత్రం టోర్నీలో పాల్గొనడానికి సిద్ధమవ్వడం పాక్ ద్వంద్వ నీతికి అద్దం పడుతోంది. పాకిస్థాన్ జట్టు ఫిబ్రవరి 2వ తేదీన ఉదయాన్నే కొలంబోకు బయలుదేరనుంది. ఇప్పటికే ఆటగాళ్ల వీసాలు, హోటల్ బుకింగ్‌లు అన్నీ పీసీబీ పూర్తి చేసింది. అంటే, ఇన్నాళ్లూ పాక్ చేసిన బహిష్కరణ హెచ్చరికలన్నీ కేవలం ఐసీసీపై ఒత్తిడి తెచ్చేందుకే అని స్పష్టమైంది.

## పరీక్షల వేళ పిల్లలకు ఎలాంటి ఆహారం ఇవ్వాలి? - నిపుణుల కీలక సూచనలు!

**ఎగ్జామ్స్ టైమ్‌లో సరైన పోషకాహారం తీసుకోవాలంటున్న నిపుణులు**

**ఈ బెస్ట్ ఫుడ్స్ తీసుకుంటే ఎంతో మంచిదట!**



ఏడాదంతా చదవడం ఒకెత్తయితే, ఎగ్జామ్స్ టైంలో విద్యార్థులు చదవడం మరో ఎత్తు. పరీక్షలకు ప్రిపేర్ అయ్యే సమయంలో పుస్తకాలతో కుస్తీ పడుతూ తిండిపై అంతగా ఆసక్తి చూపించరు. టైంకి తినకపోవడం, అంతగా ఆకలేస్తే ఏదో ఒకటి తినేయడం వల్ల అనారోగ్య సమస్యలు కొనితెచ్చుకొనే అవకాశం ఉంటుందంటున్నారు పోషకాహార నిపుణులు. అందువల్ల, ఇలాంటి సమయంలో ఆహారం విషయంలో అస్సలు అజాగ్రత్త పనికిరాదని హెచ్చరిస్తున్నారు. ఒత్తిడి తగ్గించే ఆహారం తీసుకోవడం ఎంతో అవసరమని సూచిస్తున్నారు. ఈ క్రమంలో పది, ఇంటర్ పరీక్షలు దగ్గర పడుతున్న తరుణంలో ఎలాంటి ఆహారం తీసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం! చదవడం కెలరీలు ఖర్చయ్యే పనేం కాదు. కానీ అలసటతో కూడుకున్నదంటున్నారు నిపుణులు. అందువల్ల రక్తంలో చక్కెర స్థాయిలను చూసుకుంటుండాలని చెబుతున్నారు. పరీక్షల హడవుడిలో పడి.. రోజుల పాటు కూర్చొనే ఉంటే బరువులో తేడాలొస్తాయని పేర్కొంటున్నారు. అందువల్ల మితంగా, అన్ని పోషకాలూ అందేలా ఆహారాన్ని తీసుకోవాలని సూచిస్తున్నారు. మెదడు, న్యూరో ట్రాన్స్‌మీటర్లకు ఈ సమయంలో మేలైన మాంసకృతులు కావాలంటున్నారు నిపుణులు. పాలు, పెరుగు, పప్పుధాన్యాలు, సోయా గింజలు, నూనె గింజల్లో ఇవి లభిస్తాయని సూచిస్తున్నారు. పెసరట్టు, మినపట్టు, కుడుము, గుప్పెడు ఉడకబెట్టిన వేరుశనగలు, గుగ్గిళ్లు, అలసందలు ఇవ్వొచ్చని సలహా ఇస్తున్నారు. ట్రెడిషనల్ ఫుడ్‌తో ఆరోగ్యంగా – మన పూర్వీకులు హెల్తీగా ఉండడానికి ఇవే కారణమట! మాంసాహారులు తక్కువ నూనెతో చేసిన గుడ్డు, ఆమ్లెట్, చికెన్, చేపలు రోజూ తినొచ్చని సూచిస్తున్నారు. ఈ టైంలో అన్నం తగ్గించాలని, లేదంటే నిద్ర వచ్చేస్తుందని చెబుతున్నారు. తక్కువ మోతాదులో ఆహారం తీసుకోవాలని నిపుణులు అంటున్నారు. అన్నాన్ని ఒకపూటకు పరిమితం చేసుకొని, మిగతా వేళల్లో పొట్టుతో ఉన్న జొన్న, సజ్జ, గోధుమ రొట్టెలు లేదా దంపుడు బియ్యం వంటివి తీసుకుంటే బి కాంప్లెక్స్ కొరత ఉండదని సూచిస్తున్నారు. అలాగే, ఆకు, కాయగూరలకు ప్రత్యామ్నాయం లేదని తెలియజేస్తున్నారు. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంచడానికి అరటిపండు, ఆపిల్, నారింజ, బొప్పాయి, జామ లేదా పుచ్చకాయ వంటి కాలానుగుణ పండ్లు ఇవ్వాలని అధ్యయనం పేర్కొంది. ఆరోగ్యకరమైన ఆహారం, జీవనశైలిలో భాగంగా ఉన్నవాళ్లు పరీక్షల కోసం ప్రత్యేకంగా తినాల్సిన అవసరం లేదు. కానీ, సరైన పోషకాహారం తీసుకొని వాళ్లు పరీక్షల్లోనైనా కొంత మేరకు ఆహార అలవాట్లు మార్చుకుంటే మేలు. పోషకాహారమే ఆరోగ్యం, ఆనందం.. ఈ రెండూ ఉంటేనే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధిస్తారు. అలాగే, కెరియర్‌లోనూ రాణిస్తారు – డాక్టర్ లతాశశి, పోషకాహార నిపుణులు ఒత్తిడిని తట్టుకొనేందుకు విటమిన్లు, క్యాల్షియం, మెగ్నీషియం ఎక్కువగా ఉండే నువ్వులు, అవిసె లడ్డూ, నట్స్, మరమరాలు, జొన్న పేలాలు, వేయించిన పుట్నాలు, బఠానీలు సాయపడతాయని వివరిస్తున్నారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థులైతే.. టమాటా, కీరా, క్యారెట్‌తో పాటు మునగాకు, కరివేపాకు, గోంగూర, పుదీనా పొడులు తింటే మేలంటున్నారు నిపుణులు. రోజూ 300 మీ పాలు, పాల ఉత్పత్తులు తీసుకుంటే గ్లూకోమిక్స్, క్యాల్షియం తగినంత లభిస్తుందని పేర్కొంటున్నారు. మంచి నీరు పక్కనే ఉంచుకోవాలి. వేడి వల్ల శరీరం లవణాలు కోల్పోయి నీరసం, తలనొప్పి వస్తాయంటున్నారు నిపుణులు. ఎలక్ట్రాల్ లేదా నిమ్మకాయ నీటిని రోజులో రెండు సార్లు తాగాలని చెబుతున్నారు. చక్కెర వేసిన జ్యూస్‌లకు దూరంగా ఉండాలని తెలియజేస్తున్నారు. వీటికి బదులుగా నేరుగా పండ్లు తినాలని సూచిస్తున్నారు. ఎక్కువ నూనెలు ఉండే పూరీ, వడ, పులిహోర, బిర్యానీ లాంటి వంటి జోలికి పోవద్దని అంటున్నారు. వీటికి బదులుగా పెరుగన్నం, కూరగాయ కర్రీ, ఆకుకూర పప్పు బ్యాలెన్స్‌డ్‌గా ఉంటుందని చెబుతున్నారు. సాయంత్రం వేళ బ్రెడ్, గ్లాసు పాలు, అరటిపండు, జామ్ లేదా తేనెతో చపాతీ, చట్నీ, పొడులతో ఇడ్లీ ఇవ్వొచ్చని తెలియజేస్తున్నారు. మార్నింగ్ బ్రేక్ ఫాస్ట్‌లో లేదా స్నాక్స్ టైంలో ఎగ్స్ ఇవ్వడం చాలా ముఖ్యం. ఎందుకంటే, ఇందులో విటమిన్ సి తప్ప అన్ని రకాల న్యూట్రిషన్స్ ఉంటాయి. ఇలాంటి న్యూట్రిషన్స్ లభించినప్పుడు హెల్తీగా ఉండటంతోపాటు బ్రెయిన్ ఫంక్షన్‌కి కూడా చాలా ఉపయోగపడుతుంది. కిడ్నీ బీన్స్, బాదం, పిస్తా, జీడిపప్పు లాంటివి ఇవ్వాలి– శుభాంగి తమ్మళ్వార్, న్యూట్రిషనిస్ట్ పరీక్షలు ఉన్నన్ని రోజులు కాసిని ఉసిరి క్యాండీలనో, ఉప్పులో వేసిన ముక్కలనో దగ్గర పెట్టుకోమంటున్నారు నిపుణులు. పిల్లలకు అప్పుడప్పుడు ఇవ్వాలని చెబుతున్నారు. ఇవి మెదడుకి ఆక్సిజన్ పుష్కలంగా అందేట్టు చేసి పిల్లల్ని చురుగ్గా ఉంచుతాయని తెలియజేస్తున్నారు. హుషారుగా పరీక్షలు రాసేందుకు సహకరిస్తాయని వివరిస్తున్నారు. పరీక్ష సమయంలో చక్కెర ఉన్న చాక్లెట్‌లు, తక్షణ శక్తినిచ్చే గ్లూకోజ్ బిళ్లలు దగ్గర పెట్టుకోవాలని సలహా ఇస్తున్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య, మానసిక నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

## "హైబీపీ"తో ఆందోళనగా ఉందా - "ఫిట్ హోగా భారత్" సరైన వేదిక!

**జీవనశైలి మార్పులు, ఆహార అలవాట్లలో మార్పులు అనివార్యం - నిపుణులు ఏమంటున్నారో మీ కోసం!**



"మానసిక ఒత్తిడి, అధిక బరువు" హై బీపీకి మార్గాలుగా నిలుస్తున్నాయని అనేక పరిశోధనలు వెల్లడించాయి. నేటి ఉరుకుల పరుగుల జీవనశైలిలో ప్రశాంత జీవనంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకునే విధంగా "ఫిట్ హోగా భారత్" మిమ్మల్ని తీర్చిదిద్దుతుంది. ఇంట్లోనే ఉంటూ రోజు వారి ఆహారం, అలవాట్లు మార్చుకోవడం ద్వారా మిమ్మల్ని మీరు మెరుగుపర్చుకునేందుకు ఇపుడే 30 రోజుల ఛాలెంజ్ లో చేరండి. ఏదైనా అనారోగ్యంతో ఆస్పత్రులకు వెళ్లినపుడు ముందుగా శరీర బరువుతో పాటు బీపీ (రక్తపోటు) చెక్ చేస్తుంటారు. శరీరంలో రక్తం ప్రవాహ వేగం ఎక్కువగా ఉందా లేక తక్కువగా ఉందా? అనే విషయాన్ని తెలుసుకోవడానికి బీపీ చూస్తుంటారు. కాగా, మారిన జీవనశైలి కారణంగా అధిక రక్తపోటు బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. భారతదేశంలో అధిక రక్తపోటు ఒక ప్రధాన ఆరోగ్య సమస్యగా మారింది. గతంలో పట్టణ, నగర ప్రజల్లో ఎక్కువగా కనిపించే అధిక రక్తపోటు ఇటీవల గ్రామీణ ప్రాంతాల్లోనూ వేగంగా పెరుగుతోంది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం దాదాపు ప్రతి ముగ్గురిలో ఒకరు రక్తపోటుకు గురవుతున్నారు. ఈ పెరుగుదల పట్టణ ప్రాంతాల్లో అధికంగా ఉండగా మొత్తం దేశ జనాభాలో 31.1కోట్ల మంది అధిక రక్తపోటుతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. చీఫ్‌నూ-5 (2019-2020) ప్రకారం పట్టణ జనాభాలో 34శాతం, గ్రామీణ జనాభాలో 28శాతం, పురుషులు 21%, మహిళలు 28% బీపీతో బాధపడుతున్నారు. ఛాతీలో రెండు ఊపిరితిత్తుల మధ్య గుప్పెడంత గుండె ఉంటుంది. గుండె ఎక్కువగా కొట్టుకున్నా, తక్కువగా కొట్టుకున్నా అది జీవనాన్ని శాసించే రక్తపోటు తదితర గుండె జబ్బులకు దారితీస్తుంది. రక్తం శరీరంలోని అన్నిభాగాలకు సరఫరా అవుతుంది. చెడు రక్తం గుండెకు చేరి పరిశుభ్రమై తిరిగి అవయవాలకు చేరుతుంది. ఈ క్రమంలోనే గుండె లయకు అనుగుణంగా రక్త ప్రసరణ ఉడాలి. కానీ, కొందరిలో చెడు కొలెస్ట్రాల్ పెరిగిపోయి రక్తనాళాలు గట్టిపడిపోవడం వల్ల అధిక రక్తపోటు (హైబీపీ) వస్తుంది. దీనినే వైద్య పరిభాషలో అని పిలుస్తారు. ఉండాల్సిన దాని కంటే తక్కువగా ఉంటే దాన్ని లేదా లోబీపీ అంటారు. గుండె పనితీరును ఈ రక్తపోటు చెప్పకనే చెప్తుంది. "రక్తపోటు అనేది రోగం కాదు, రోగ లక్షణం మాత్రమే కానీ, అదొక సైలెంట్ కిల్లర్" అని వైద్యులు చెప్తుంటారు. విప్పపువ్వులో పోషకాలెన్నో - మేడారం జాతరలోనూ "విప్పపువ్వ లడ్డూ" ఇవ్వాలనుకున్నాం! హై బీపీ సాధారణ లక్షణాలు హై బీపీ సాధారణ లక్షణాలుఅధిక రక్తపోటు వల్ల కలిగే ప్రమాదాలు : అదుపులో లేని రక్తపోటు వల్ల, రక్తనాళాలలో కొవ్వు పేరుకుపోతుంది. దీంతో పక్షవాతం, గుండెపోటు వచ్చేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. గుండె వాపు, గుండె సరిగ్గా పని చేయకపోవడం, ఆయాసం కనిపిస్తుంటాయి. దీర్ఘకాల అధిక రక్తపోటు కారణంగా మూత్ర పిండాలు దెబ్బతింటాయి. కంటి రెటీనా దెబ్బతిని (హైపర్టెన్సివ్ రెటినోపతి) చూపు మందగిస్తుంది. బ్రెయిన్ స్ట్రోక్, జ్ఞాపక శక్తి మందగించే అవకాశాలున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అధిక రక్తపోటు ఏ వయసు వారిలో ఎలా అధిక రక్తపోటు ఏ వయసు వారిలో ఎలా బీపీ చెకింగ్‌కు వెళ్తే ఇలా చేయండి! కొంత మందికి ఆస్పత్రి వాతావరణం, డాక్టర్లను చూడగానే భయపడిపోతుంటారు. ఇలాంటి వారు బీపీ పరీక్ష చేయించుకోవడానికి వెళ్లినపుడు ఆందోళనకు గురయ్యే అవకాశాలున్నాయి. ఎవరైనా సరే బీపీ పరీక్షకు ముందు పాటించాల్సిన సూచనలివి. గంట ముందుగా ధూమపానం, వ్యాయామం చేయకూడదు. కనీసం పది నిమిషాలు ప్రశాంతంగా కూర్చున్నాక పరీక్ష చేయించుకోవాలి.బీపీ యంత్రం ఆ వ్యక్తి గుండె ఎత్తులో ఉండాలి. పాదాలు పూర్తిగా నేల మీద ఉండేలా చూసుకోవాలి. వెనక ఆసరా ఉండడంతో పాటు చెయ్యి టేబుల్‌పైన పెట్టాలి. బీపీ చూసే సమయంలో కదలకుండా, మాట్లాడకుండా ఉండాలి. అధిక రక్తపోటుకు కారణాలు అధిక రక్తపోటుకు కారణాలు అధిక రక్తపోటు నివారణ చర్యలు రక్తపోటు సమస్య ఉన్నట్లు తేలితే ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలి. హైబీపీ గురించి ఆందోళన చెందకుండా శరీరానికి క్యాలరీలు, కొవ్వు పదార్థాలు తక్కువగా తీసుకోవాలి. ప్రొటీన్ ఫుడ్ ఎక్కువగా తీసుకోవాలి. కాల్షియం, మెగ్నిషియం, పొటాషియం లాంటి ఖనిజాలు రోజు వారి ఆహారంలో ఉండేలా చూసుకోవాలి.

రోజూ 30 నుంచి 45 నిమిషాల పాటు యోగా, నడక వంటి సున్నితమైన వ్యాయామాలు అలవాటు చేసుకోవాలి. పనిచేసే కార్యాలయాలు, ఆఫీసుల్లో కుర్చీలకే పరిమితం కాకుండా ప్రతి అరగంటకు ఒకసారి నడవాలి. శరీర బరువును అదుపులో ఉంచాలి. మద్యపానం, ధూమపానం మానెయ్యాలి. ఖాళీ సమయంలో నచ్చిన వారితో మాట్లాడడంతో పాటు నచ్చిన పనులు చేయాలి. ఆహార పదార్థాల విషయంలో ఉప్పు వాడకాన్ని తగ్గించాలి. రోజుకు 5 గ్రాములకు మించి వాడొద్దు . ముఖ్యంగా ప్రాసెస్ చేసిన, ప్యాకేజ్ పదార్థాలు మానెయ్యాలి. వాటిల్లో ఉండే సోడియం క్లోరైడ్ రక్తపోటును పెంచుతుంది. పొటాషియం ఆహారంలో ఎక్కువగా పండ్లు, కూరగాయలు ఉండేలా చూసుకోవాలి. రక్తపోటును తగ్గించేందుకు పొటాషియం లభించే కొబ్బరినీళ్లు తీసుకోవాలి. నారింజ, పుట్టగొడుగులు, పాలకూర, కంద గడ్డలు, బ్రొకొలి, అరటి పండ్లు, యాప్రికాట్స్, అవకాడో, బాదం, పిస్తా, పప్పు, వాల్‌నట్స్, గుమ్మడికాయ, పొద్దు తిరుగుడు గింజలు తినాలి. కొవ్వు పదార్థాలు రక్తంలో కొలెస్ట్రాల్ అధికంగా ఉండడం రక్తపోటుకు దారితీస్తుంది. నూనెలు తగ్గించడంతో పాటు పచ్చళ్లు, ఊరగాయలు తగ్గించాలి. వంటల్లోనూ నూనె, మసాలాలు, కారం వాడకాన్ని తగ్గించాలి. ఎక్కువ పీచు పదార్థం లభించే పండ్లు, ఆకుకూరలు, పప్పులు తీసుకోవాలి 30 రోజుల ఛాలెంజ్‌లో పాల్గొనండి. సహజ పద్ధతుల్లో రక్తపోటు నియంత్రణలో ఉంచుకోవడంతోపాటు మరింత ఆరోగ్య సమాచారం, జీవనశైలి చిట్కాల కోసం జుఌ దీఫ్థుతీఫ్ క్లిక్ చేయండి. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య, మానసిక నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

## బ్లాక్ సండే స్టాక్ మార్కెట్స్ పై 'పన్ను' ఎఫెక్ట్ - సెన్సెక్స్ 1500 పాయింట్లు డౌన్

**బడ్జెట్ నేపథ్యంలో ఆదివారం అయినప్పటికీ పనిచేసిన స్టాక్ మార్కెట్లు- కానీ కుప్పకూలిన సూచీలు**



కేంద్ర బడ్జెట్ ప్రభావం దేశీయ స్టాక్ మార్కెట్లపై స్పష్టంగా కనిపించింది. సాధారణంగా ఆదివారం రోజున స్టాక్ ఎక్స్ఛేంజీలు మూతపడుతుంటాయి. కానీ ఈసారి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ఆదివారమే ప్రవేశపెట్టాలని నిర్ణయించడంతో ప్రత్యేకంగా ట్రేడింగ్ నిర్వహించారు. దీంతో వారాంతమైనప్పటికీ దళారుల హడావుడితో మార్కెట్లు కదిలాయి. అయితే ట్రేడింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే సూచీలు భారీ ఒడిదొడుకులకు లోనై మదుపర్లను ఆందోళనకు గురిచేశాయి. చివరకు భారీ నష్టాలదో ముగిశాయి.

మొదట్లో ఫ్లాట్ గా కదిలినా!

మొదట్లో సూచీలు ఫ్లాట్‌గా కదిలినా, బడ్జెట్ ప్రసంగంలో సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్టీటీ) పెంపు ప్రకటన రావడంతో ఒక్కసారిగా అమ్మకాల ఒత్తిడి పెరిగింది. ఫ్యూచర్స్, ఆప్షన్స్ ట్రేడింగ్‌పై పన్నులు పెంచడం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీంతో పెట్టుబడిదారులు లాభాల బుకింగ్‌కు దిగడంతో సూచీలు క్షణాల్లో కుప్పకూలాయి. ఒక దశలో సెన్సెక్స్ 2,300 పాయింట్లకు పైగా పతనమై భారీ నష్టాలను చవిచూసింది. ఆ తర్వాత కొంతమేర రికవరీ వచ్చినప్పటికీ, ఇంకా 1,200 పాయింట్లకు పైగా నష్టంలోనే ట్రేడైంది. చివరకు సెన్సెక్స్ 1,546 పాయింట్లు నష్టపోయి 80,722 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 495 పాయింట్లు దిగజారి 24,825 పాయింట్ల వద్ద ముగిసింది.

ఎస్టీటీ అంటే ఏంటి

స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టైన సెక్యూరిటీల కొనుగోలు, అమ్మకాలపై విధించే పన్నే ఎస్టీటీ. దీన్ని 0.02 శాతం నుంచి 0.05 శాతానికి పెంచుతున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. అదేవిధంగా ఆప్షన్స్ ప్రీమియంపై ఎస్టిటిని 0.15 శాతానికి పెంచారు. ఈ నిర్ణయాలు ముఖ్యంగా డెరివేటివ్ ట్రేడింగ్ చేసే మదుపర్లకు అదనపు భారం కానున్నాయి. ఇక బైబ్యాక్‌ల విషయంలో కూడా కీలక మార్పులు ప్రతిపాదించారు. కంపెనీలు తమ షేర్లను తిరిగి కొనుగోలు చేసే ప్రక్రియను మూలధన లాభాలుగా పరిగణిస్తూ పన్ను విధించాలని నిర్ణయించారు. అక్రమ వినియోగాన్ని అరికట్టేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు కేంద్రం తెలిపింది. కార్పొరేట్ ప్రమోటర్ల బైబ్యాక్‌లపై 22 శాతం, నాన్ కార్పొరేట్ ప్రమోటర్లపై 30 శాతం పన్ను విధించడం మార్కెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ మార్పులు కంపెనీలకు, మదుపర్లకు రెండింటికీ భారంగా మారే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

బ్రోకరేజ్ కంపెనీలపై తీవ్ర ప్రభావం

ఎస్టీటీ పెంపు ప్రభావం ముఖ్యంగా బ్రోకరేజ్ కంపెనీల షేర్లపై తీవ్రంగా కనిపించింది. ట్రేడింగ్ వాల్యూమ్ తగ్గుతుందనే ఆందోళనలతో ఈ రంగంలోని షేర్లు భారీగా క్షీణించాయి. బీఎస్ఈలో మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీ షేరు 18.08 శాతం పతనమై రూ. 2,068కు చేరింది. గ్రో మాతృ సంస్థ బిలియన్ బ్రెయిన్ గ్యారెజీ వెంచర్స్ 13 శాతం క్షీణించి రూ. 154 వద్ద నిలిచింది. ఐఐఎఫ్ఎల్ క్యాపిటల్ 10.4 శాతం పడిపోయి రూ. 296.10కు చేరగా, యాంజెల్ వన్ షేరు 11.84 శాతం నష్టపోయింది. ఆనంద్ రాఠీ అండ్ స్టాక్ బ్రోకర్స్ కూడా 8.5 శాతం తగ్గింది.

ట్రేడింగ్ వ్యాపారంపై పన్నుల భారం!

మార్కెట్ మౌలిక సదుపాయ సంస్థలకూ ఈ ప్రభావం తాకింది. బీఎస్ఈ లిమిటెడ్ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొనగా, ఎన్ఎస్ఈలో దాని విలువ దాదాపు 15 శాతం క్షీణించి రూ. 2,377 వద్ద ట్రేడవుతోంది. ట్రేడింగ్ వ్యాపారంపై పన్నుల భారం పెరగడంతో భవిష్యత్‌లో వాల్యూమ్ తగ్గే అవకాశం ఉందనే అంచనాలు ఈ పతనానికి కారణమయ్యాయి. మొత్తంగా చూసుకుంటే, బడ్జెట్‌లో పన్నుల పెంపు చర్యలు మార్కెట్‌కు షాక్ ఇచ్చాయి. పెట్టుబడిదారులు జాగ్రత్తగా వ్యవహరిస్తూ, ప్రభుత్వ నిర్ణయాల ప్రభావాన్ని అంచనా వేస్తున్నారు. వచ్చే రోజుల్లో పరిస్థితులు ఎలా మారతాయో అన్నదానిపై అందరి దృష్టి పడింది.

## సాంఘిక సంక్షేమ గురుకుల

# పాఠశాల సందర్శించిన గ్రూప్1 శిక్షణ అధికారులు...



నాగర్‌కర్నూల్ టౌన్/ఫిబ్రవరి 04 **ఆకాంక్ష** : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఎస్పీఎస్ గ్రూప్1లో ఎంపికైన నూతన అధికారుల శిక్షణలో భాగంగా బిజినేపల్లి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను బుధవారం ఉదయం అధికారులు సందర్శించారు. ఉదయం 8 గంటలకు పాఠశాలకు చేరుకున్న శిక్షణ అధికారులు విద్యార్థులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ సుమతి అధికారులు ఆహ్వానించి, వారికి అవసరమైన ఏర్పాట్లను పాఠశాల ప్రాంగణంలో కల్పించారు. శిక్షణలో భాగంగా అధికారులు రెండు రోజుల పాటు పాఠశాలలోనే ఉండి విద్యార్థులతో సమీపంగా గడపనున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న సౌకర్యాలు, విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అందుతున్న వసతులు, బోధనా విధానాలు, విద్యా ప్రమాణాలు తదితర అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థుల విద్యా అభివృద్ధికి ఉపాధ్యాయులు అవలంబిస్తున్న పద్ధతులు, గురుకుల పాఠశాలల నిర్వహణ తీరు, విద్యార్థుల జీవన శైలి వంటి అంశాలపై అధికారులకు వివరించారు. మధ్యాహ్నం గ్రూప్1కు ఎంపికైన అధికారులు విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వారితో మమేకమయ్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలోని ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని అధికారులకు పూర్తి స్థాయిలో సహకరించారు. ప్రభుత్వ సంక్షేమ పాఠశాలల ద్వారా విద్యార్థులకు అందుతున్న సేవలను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం లభించిందని శిక్షణ అధికారులు పేర్కొన్నారు.



## భూసార పరీక్షలు తప్పనిసరి

# రైతులు తప్పక వినియోగించుకోవాలి.

### మండల వ్యవసాయ అధికారి ఆర్. అక్బర్ బాషా.




వెల్దుర్తి//ఫిబ్రవరి 04 **ఆకాంక్ష** : కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం అయిన మండల పరిధిలోని వెల్దుర్తి మరియు మదార్‌పురం గ్రామాలలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది (ఆర్జాజచీఫ్) ఆధ్వర్యంలో భూసార పరీక్షల కోసం మట్టి నమూనాల సేకరణ కార్యక్రమం కొనసాగుతోందని వెల్దుర్తి మండల వ్యవసాయ అధికారి ఆర్. అక్బర్ బాషా తెలిపారు. మండల వ్యాప్తంగా మొత్తం 1097 మట్టి నమూనాలు సేకరించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. సేంద్రీయ మరియు ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపుతున్న రైతుల నుంచి ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది సహకారంతో మట్టి నమూనాలను సేకరిస్తున్నట్లు ఆర్. అక్బర్ బాషా వివరించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం సిబ్బందికి మట్టి నమూనాల సేకరణ పద్ధతులపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం కూడా నిర్వహించినట్లు తెలిపారు. భూసార పరీక్షల ద్వారా భూమిలో ఉన్న లోపాలను గుర్తించి, అవసరమైన పోషకాలను సమతులంగా అందించడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి ఆర్. అక్బర్ బాషా రైతులకు సూచించారు. విచక్షణా రహితంగా రసాయన ఎరువులు వినియోగించకుండా, సేంద్రియ ఎరువుల వినియోగం వైపు రైతులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. నెల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషించే సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్టె ఎరువుల వినియోగాన్ని రైతులు మరింతగా పెంచుకోవాలని ఆర్. అక్బర్ బాషా కోరారు. సమతుల ఎరువుల యాజమాన్యం భూసార పరీక్షల ద్వారానే సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. భూసార పరీక్షలు చేయించుకోవాలనుకునే రైతులు తమ గ్రామంలోని రైతు సేవా కేంద్రం సిబ్బందిని లేదా ప్రకృతి వ్యవసాయం సిబ్బందిని తప్పక సంప్రదించాలని వెల్దుర్తి మండల వ్యవసాయ అధికారి ఆర్. అక్బర్ బాషా విజ్ఞప్తి చేశారు.

## గోల్డెన్ తులిప్' బ్యాంకెట్ హాల్ ప్రారంభించిన

# మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు...



పెద్దపల్లిటౌన్//ఫిబ్రవరి 04 **ఆకాంక్ష** : పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదురుగా నూతనంగా, ఆధునిక హంగులతో నిర్మించిన "గోల్డెన్ తులిప్ బ్యాంకెట్ హాల్" మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు కలిసి రిబ్బన్ కట్ చేసి బ్యాంకెట్ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా సౌకర్యవంతమైన, ఆధునిక వసతులతో కూడిన బ్యాంకెట్ హాల్ అందుబాటులోకి రావడం సంతోషకరమని అన్నారు. ఇలాంటి వాణిజ్య, సేవా రంగాల అభివృద్ధితో జిల్లా మరింత ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ వివాహాలు, సమావేశాలు, శుభకార్యాలకు అనువైన వసతులతో గోల్డెన్ తులిప్ బ్యాంకెట్ హాల్ ప్రజలకు ఉపయోగకరంగా నిలుస్తుందని తెలిపారు. యాజమాన్యానికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గోల్డెన్ తులిప్ బ్యాంకెట్ హాల్ యాజమాన్యం మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే విజయరమణ రావును శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, బ్యాంకెట్ హాల్ యాజమాన్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఆసుపత్రిలో ఘనంగా 'స్టార్ పెర్ఫార్మర్' అవార్డులు...




పెద్దపల్లిటౌన్//ఫిబ్రవరి 04 **ఆకాంక్ష** : పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత నాణ్యంగా అందించడంతో పాటు సిబ్బందిలో సేవాభావాన్ని పెంపొందించేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతినెల నిర్వహిస్తున్న 'స్టార్ పెర్ఫార్మర్' అవార్డుల కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. విధుల నిర్వహణలో అంకితభావం, నిబద్ధతతో పాటు ప్రత్యేక ప్రతిభను కనబర్చిన వైద్యులు, సిబ్బందిని ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ అవార్డులు ప్రదానం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఫిబ్రవరి నెలకు గాను డాక్టర్ సాయి భవాని మరియు ల్యాబ్ టెక్నీషియన్ శ్రీ పి. అజయ్ తమ విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కె. శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించి వారికి 'స్టార్ పెర్ఫార్మర్' అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా డా. కె. శ్రీధర్ మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. అంకిత భావంతో విధులు నిర్వహించే సిబ్బందిని గుర్తించి ప్రోత్సహించడం ద్వారా ఆసుపత్రిలో సేవల నాణ్యత మరింత పెరుగుతుందని అన్నారు. ఈ అవార్డులు మిగతా సిబ్బందికి స్ఫూర్తినిచ్చి భవిష్యత్తులో ఇంకా మెరుగైన సేవలు అందించేందుకు దోహదపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎం.ఓ డా. విజయ్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ జమున, ఆసుపత్రి వైద్యులు, నర్సులు మరియు ఇతర సిబ్బంది పాల్గొని అవార్డు గ్రహీతలను అభినందించారు.

# కష్టం వస్తే కంటికి రెప్పలా కాపాడే పెద్దెల్లి కుటుంబం..

### మరోసారి ప్రజల ముందుకు తేజస్విని ప్రకాష్..

గోదావరిఖని//ఫిబ్రవరి 04 **ఆకాంక్ష** : కష్టం వస్తే కంటికి రెప్పలా కాపాడుకునే పెద్ద మనసుతో, ప్రజల మధ్యే ఉండి సేవలందించిన చరిత్ర పెద్దెల్లిది. ఆ సంప్రదాయానికి ప్రతిరూపంగా నిలిచిన పెద్దెల్లి కుటుంబం డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం పోరాటం చేస్తూ ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. గతంలో కార్పొరేటర్‌గా గెలిచిన పెద్దెల్లి ప్రకాష్, తేజస్విని డివిజన్ అభివృద్ధి కోసం చేసిన కృషి, ప్రజల సమస్యలపై చూపిన చిత్తశుద్ధి అందరికీ తెలిసిందే. ఏ ఇంటికి ఆపద వచ్చినా సొంత ఇంటి మనిషిలా ముందుకు వెళ్లి ఆదుకోవడం, బాధితులను అక్కున చేర్చుకోవడం పెద్దెల్లి కుటుంబానికి అలవాటైన సేవాభావంగా మారింది. చంటి బిడ్డను సైతం చంకలో పెట్టుకుని మున్సిపల్ కార్యాలయాల్లో అర్ధరాత్రి వరకు నిధుల మంజూరుకోసం పోరాడిన ఘనత పెద్దెల్లి కుటుంబానిదేనని స్థానికులు గుర్తు చేసుకుంటున్నారు. డివిజన్ అభివృద్ధి కోసం అధికారుల తలుపులు తట్టడం, ప్రజల అవసరాలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా అనేక సమస్యలకు పరిష్కారం చూపారని వారు చెబుతున్నారు. అనుభవం లేని వ్యక్తులు మాయ మాటలతో ప్రజలను మోసగించేందుకు ప్రయత్నిస్తున్నారని, అలాంటి మాటలను నమ్మి ప్రజలు మోసపోవద్దని కొందరు



హెచ్చరిస్తున్నారు. అన్ని తెలిసిన, అనుభవం ఉన్న వారిని గెలిపిస్తేనే డివిజన్ అభివృద్ధి సక్రమంగా సాగుతుందని, అందరికీ సమాన న్యాయం దక్కుతుందని వారు పేర్కొన్నారు. డివిజన్ అభివృద్ధిని అడ్డుకునేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగా విషప్రచారాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారికి తగిన బుద్ధి చెప్పాలని ప్రజలు పిలుపునిచ్చారు. పార్టీ నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి, పార్టీపై విశ్వాసంతోనే ఇప్పటివరకు పని చేశామని, అవసరం కోసం ఎప్పుడూ పరాయి పార్టీల వైపు చూడలేదని పెద్దెల్లి కుటుంబ సభ్యులు స్పష్టం చేశారు. ప్రస్తుతం అవసరాల కోసం పరాయి పార్టీల వైపు చూసే వారు రేపు డివిజన్ అభివృద్ధిని ఎలా





ముందుకు తీసుకెళ్తారన్న ప్రశ్నలను వారు లేవనెత్తారు. ఒకే పార్టీ, ఒకే సిద్ధాంతంతో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్న వారికే ప్రజా సేవలో నిజాయితీ ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పెద్దెల్లి తేజస్విని ప్రకాష్ మాట్లాడుతూ, ఇప్పటివరకు పార్టీని, ప్రజలను నమ్ముకొని పని చేశానని, అదే విశ్వాసంతో మరోసారి ప్రజా ఆశీర్వాదం కోసం మీ ముందుకు వస్తున్నానని తెలిపారు. మరోసారి అవకాశం ఇస్తే డివిజన్‌ను మరింత అభివృద్ధి చేసి, మీ ఇంట్లో ఒక కుటుంబ సభ్యుడిలా మీతోనే ఉంటానని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలే తన అజెండాగా ముందుకు సాగుతానని, పెద్దపల్లి డివిజన్‌ను అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలబెట్టడమే లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.

# జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయి వైద్యం..

### ఇద్దరు మహిళలకు విజయవంతమైన లాప్రోస్కోపిక్ శస్త్రచికిత్సలు..

పెద్దపల్లిటౌన్//ఫిబ్రవరి 04 **ఆకాంక్ష** : పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి (ఐజిఖా) పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తూ మరోసారి తన సామర్థ్యాన్ని చాటింది. గాల్‌బ్లాడర్ (పిత్తాశయం) రాళ్ల సమస్యతో బాధపడుతున్న గోదావరిఖని పట్టణానికి చెందిన ఇద్దరు మహిళలకు అత్యాధునిక లాప్రోస్కోపిక్ విధానంలో శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించి వైద్య రంగంలో మరో మైలురాయిని సాధించింది. గత కొంతకాలంగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్న ఈ ఇద్దరు మహిళలు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని ఆశ్రయించగా, వైద్యులు సమగ్రంగా పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం పిత్తాశయంలో రాళ్లు ఉన్నట్లు నిర్ధారణ కావడంతో శస్త్రచికిత్స అవసరమని తెలిపారు. సాధారణంగా ఈ తరహా ఆపరేషన్‌కు ప్రైవేట్ ఆసుపత్రుల్లో భారీగా ఖర్చు అవుతుండగా, పేద ప్రజలపై ఆర్థిక భారం పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఉచితంగా ఈ సర్జరీలు నిర్వహించారు. ప్రముఖ లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ అమర సింహా రెడ్డి నేతృత్వంలో డాక్టర్ సాయి ప్రసాద్, డాక్టర్ రామం, డాక్టర్ భవాని తదితర వైద్య బృందం



'లాప్రోస్కోపిక్ కొలిసిస్టెక్టమీ' పద్ధతిలో అతి తక్కువ కోతతో శస్త్రచికిత్సలు పూర్తి చేశారు. దీంతో రోగులు త్వరగా కోలుకునే అవకాశముందని వైద్యులు తెలిపారు. విజయవంతమైన శస్త్రచికిత్సలు నిర్వహించిన వైద్య బృందాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలతో పాటు అనుభవజ్ఞులైన నిపుణ వైద్యులు అందుబాటులో ఉన్నారని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి అధిక ఖర్చులు భరించకుండా, ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న నాణ్యమైన



వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే ఆసుపత్రిలో నవజాత శిశు సంరక్షణ కేంద్రం (ఖాచీజఖ), 2డీ ఎకో, యూరాలజీ సేవలు, ఆధునిక లాప్రోస్కోపిక్ శస్త్రచికిత్సలు, దంత వైద్య విభాగంలో రూట్ కెనాల్ చికిత్స వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వైద్య సేవల విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా రోగులు లేదా వారి బంధువులు నేరుగా తనను సంప్రదించవచ్చని డాక్టర్ శ్రీధర్ స్పష్టం చేశారు.

## మున్సిపల్ అభ్యర్థులకు అవగాహన సదస్సు...



పెద్దపల్లిటౌన్//ఫిబ్రవరి 04 **ఆకాంక్ష** : తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ రెండో సాధారణ ఎన్నికల నేపథ్యంలో పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 36 వార్డుల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు కీలక సూచనలు చేసేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 05 (గురువారం) ఉదయం 10:30 గంటల నుండి 11:00 గంటల వరకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఈ సమావేశం జరుగుతుందని అధికారులు వెల్లడించారు. రాష్ట్ర ఎలక్షన్ జనరల్ అబ్జర్వర్ పద్మజ రాణి, ఎక్స్పెండచర్ అబ్జర్వర్ సుజాత ఆధ్వర్యంలో జరిగే ఈ భేటీలో ఎన్నికల బ్యాలెట్ నిర్వహణ, అభ్యర్థులు పాటించాల్సిన వ్యయ నియమాలు, ఇతర సాంకేతిక అంశాలపై క్షుణ్ణంగా అవగాహన కల్పించనున్నారు. ఎవరు హాజరు కావాలి నామినేషన్ వేసిన అభ్యర్థి లేదా వారి ఎన్నికల ఏజెంట్ ఇద్దరిలో ఒకరు మాత్రమే హాజరు కావాలి. కోవిడ్ లేదా ఇతర భద్రతా నిబంధనల దృష్ట్యా ప్రతి అభ్యర్థి తరపున ఒక్కరికి మాత్రమే అనుమతి ఉంటుంది. ఎన్నికల ఖర్చుల రిజిస్టర్ల నిర్వహణ, బ్యాలెట్ పేపర్ పై అభ్యర్థుల పేర్లు, గుర్తుల పరిశీలనపై కీలక సూచనలు చేయనున్నారు.

## శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఉత్సవాల నిర్వహణ...

### ప్రతి గిరిజన సోదరుడు తరలిరావాలి మాన్య నాయక్ పిలుపు



నాగర్‌కర్నూల్ టౌన్//ఫిబ్రవరి 04 **ఆకాంక్ష** : శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఉత్సవాల నిర్వహణలో భాగంగా ప్రతి గిరిజన సోదరుడు తప్పనిసరిగా పాల్గొనాలని శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జిల్లా ఉత్సవ కమిటీ అధ్యక్షులు మాన్య నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని తెలిపారు. గతంలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కుచుకుళ్ల రాజేష్ రెడ్డి శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి మూడు కోట్ల రూపాయలను మంజూరు చేయడం జరిగిందని మాన్య నాయక్ గుర్తు చేశారు. ఈ నిధుల విడుదలలో భాగంగా ఆలయ నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఉత్సవ కార్యక్రమాల ఏర్పాట్లలో భాగంగా నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన గిరిజన సోదరులు, ఆయా మండలాల అధ్యక్షులు, కోశాధికారులు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు బుధవారం ఉదయం 9 గంటలకు నాగర్‌కర్నూల్ నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్యే డాక్టర్ కుచుకుళ్ల రాజేష్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలవాలని ఆయన కోరారు. గిరిజనుల ఆరాధ్య దైవమైన శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ దేవాలయాల నిర్మాణానికి విశేషంగా కృషి చేసిన ఎమ్మెల్యే డాక్టర్ కుచుకుళ్ల రాజేష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలపడం ఈ సమావేశం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రతి గిరిజన సోదరుడు హాజరై ఉత్సవాలకు మద్దతు తెలియజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఈ నెలలో నిర్వహించనున్న శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఉత్సవాల్లో భాగంగా ప్రతి గిరిజనుడి సలహాలు, సూచనలు స్వీకరించనున్నట్లు మాన్య నాయక్ తెలిపారు. గిరిజనుల ఐక్యత, సంప్రదాయాల పరిరక్షణ, ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించడమే లక్ష్యంగా ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

## వెల్దుర్తి పదోతరగతి విద్యార్థులు క్షేమంగా తిరిగి చేరిక.



వెల్దుర్తి//ఫిబ్రవరి 04 **ఆకాంక్ష** : వెల్దుర్తి పట్టణానికి చెందిన పదోతరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు (స్నేహితులు) ఇటీవల తప్పిపోయిన ఘటనకు సుఖాంతం జరిగింది. గత నెల 31న తమ పిల్లలు కనిపించట్లేదని తల్లిదండ్రులు వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్సై నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ విషయం స్థానిక వార్తాపత్రికల్లో కూడా ప్రచురితమైంది. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న షేక్ హుస్సేన్, షేక్ అబ్దుల్ హిమాన్లు స్నేహితులు. పదోతరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో బాగా చదవాలని తల్లిదండ్రులు మందలించడంతో భయపడి, ఇంట్లో చెప్పకుండా పాఠశాల నుంచే వెళ్లిపోయారు. రైలు ఎక్కి హైదరాబాద్‌కు చేరుకున్న వారు అక్కడ ఒక మసీదులో కొద్ది రోజుల పాటు ఉన్నట్లు తెలిసింది. వద్ద ఉన్న డబ్బులు ఖర్చైపోవడంతో హైదరాబాద్‌లో కొత్తగా జీవించడం ఎలా అన్న ఆందోళనకు లోనైన విద్యార్థులు చివరికి తిరుగు ప్రయాణమై బుధవారం వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. విషయం తెలిసిన ఎస్సై నరేష్ తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి, విద్యార్థులను వారి కుటుంబాలకు సురక్షితంగా అప్పగించారు. ఈ సందర్భంగా పోలీసులు విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి, ఇకపై ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని సూచించారు. చదువుపై దృష్టి పెట్టి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని హితవు పలికారు. పిల్లలు క్షేమంగా తిరిగి రావడంతో తల్లిదండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

## యువ నాయకత్వానికి ప్రజల ఘన మద్దతు...

### 9వ డివిజన్‌లో బిఆర్ఎస్ అభ్యర్థి కొలుగురి సాయికుమార్ విస్తృత ప్రచారం...



గోదావరిఖని//ఫిబ్రవరి 04 **ఆకాంక్ష** : రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 9వ డివిజన్‌లో యువ నాయకత్వానికి అవకాశం ఇవ్వాలన్న పిలుపుతో బిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి కొలుగురి సాయికుమార్ (చింటూ) విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డివిజన్ అభివృద్ధికి ప్రజల సహకారంతో పూర్తిస్థాయిలో కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. విద్యావేత్తల భాగస్వామ్యంతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొంటూ, గాలి హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసే నాయకుల మాటలను నమ్మవద్దని ఆయన ప్రజలను కోరారు. ప్రచారంలో భాగంగా డివిజన్‌లోని పలు కాలనీలు, వీధులు, వాణిజ్య ప్రాంతాల్లో సాయికుమార్ పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి స్పష్టమైన ప్రణాళికను వివరించారు. తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, వీధిదీపాలు, పారిశుధ్యం, విద్యాఆరోగ్య సదుపాయాల మెరుగుదలే తన ప్రథమ లక్ష్యమని ఆయన వెల్లడించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా మున్సిపల్ స్థాయిలో చేయగల పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తానని చెప్పారు. సాయికుమార్ ప్రచారానికి డివిజన్ ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. అడుగడుగునా ప్రజలు ఘన స్వాగతం పలుకుతూ, పూలమాలలు వేసి జననీరాజనాలు తెలుపుతూ తమ మద్దతును ప్రకటించారు.



మహిళలు, యువకులు, వృద్ధులు స్వచ్ఛందంగా ప్రచారంలో పాల్గొని బిఆర్ఎస్ పార్టీకి, సాయికుమార్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉందని వెల్లడించారు. పార్టీ జెండాలతో వీధులు కిటకిటలాడగా, "యువ నాయకుడికి అవకాశం ఇవ్వాలి" అన్న నినాదాలు మార్మోగాయి. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ, ప్రజల విశ్వాసమే తనకు పెద్ద బలం అని అన్నారు. గతంలో డివిజన్ ఎదుర్కొన్న సమస్యలను గుర్తు చేస్తూ, వాటిని పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేసిన వారిని ప్రజలు గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. అభివృద్ధి పేరుతో మాటలకే పరిమితమైన నాయకత్వం కాకుండా, పనితో మాట్లాడే నాయకత్వం అవసరమని స్పష్టం చేశారు. డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అందరి సహకారం అవసరమని కోరారు. ప్రచారంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇంటింటి ప్రచారం, చిన్న సమావేశాలు, రోడ్‌షోలు నిర్వహిస్తూ ప్రజలతో నేరుగా మమేకమవుతూ ముందుకు సాగుతున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటే ఆయుధమని, అభివృద్ధిని కోరుకునే వారు సరైన అభ్యర్థిని ఎన్నుకోవాలని సాయికుమార్ విజ్ఞప్తి చేశారు. డివిజన్ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, ఆ భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే తన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## తపస్ డైరీ ఆవిష్కరణ ఉపాధ్యాయ సమస్యలపై వినతి...



నాగర్‌కర్నూల్ టౌన్//ఫిబ్రవరి 04 **ఆకాంక్ష** : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) 2026 సంవత్సర డైరీని జిల్లా విద్యాధికారి ఏ. రమేష్ కుమార్ బుధవారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. అనంతరం ఉపాధ్యాయుల పలు సమస్యలపై ఆయనకు వినతి పత్రం సమర్పించారు. వేసవి వృత్యంతర శిక్షణ పొందిన ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు మంజూరు చేయడం, గ్రామపంచాయతీ ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సీసీఎల్‌ఎస్ ఇవ్వడం, స్పాట్ మూల్యాంకనం, సమగ్ర కుటుంబ సర్వే చేసిన ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షులు దెంది రాజా రెడ్డి, ప్రధాన కార్యదర్శి శేఖర్ నాగరాజు, జగదీశ్వర్ రెడ్డి, రాజశేఖర్ రావు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యం భరించలేక వివాహిత ఆత్మహత్య...

మంచిర్యాల//ఫిబ్రవరి 04 **ఆకాంక్ష :** మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం రాసపల్లి గ్రామంలో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పల్లికొండ పద్మ (46) తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ, జీవితంపై నిరాశ చెంది ఆత్మహత్యకు పాల్పడింది. మూత్రపిండాల వ్యాధితో గత కొంత కాలంగా చికిత్స పొందుతున్న ఆమె, వ్యాధి భారం తట్టుకోలేక పురుగుల మందు తాగినట్లు పోలీసులు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు, పద్మ భర్త చేపల వేటకు వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగింది. భర్త ఇంటికి వచ్చిన వెంటనే పిల్లలను బాగా చూసుకోవాలని, తాను ఇక బతకలేనని చెప్పిన పద్మ, పురుగుల మందు తాగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వెంటనే అప్రమత్తమైన భర్త ఆమెను లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. అక్కడ చికిత్స అందించినప్పటికీ, ఆమె పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న దండేపల్లి ఎస్సై తహసీనుద్దీన్ సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతురాలి కుటుంబ సభ్యుల వాంగ్మూలాలు నమోదు చేసి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. ఈ సంఘటనతో రాసపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ప్రభుత్వం, సమాజం మరింత మద్దతు అందించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

### రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ శివారులో

## మహిళా న్యాయవాది దారుణ హత్య...

రంగారెడ్డి//ఫిబ్రవరి 04 **ఆకాంక్ష :** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ శివారులో మహిళా న్యాయవాది స్వప్న దారుణ హత్యకు గురయ్యారు. ఉదయం పొలం వద్ద ఆమె హత్యకు గురైనట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలన చేయగా, దుండగులు అత్యంత పాశవికంగా స్వప్న మెడపై నరికి హత్య చేసినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. చేవెళ్ల కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్న స్వప్న ఇటీవల నిత్యకార్యాల నిమిత్తం మొయినాబాద్ శివారులోని పొలానికి వెళ్లినట్లు సమాచారం. ఇదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆమెపై దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనకు సంబంధించి ఎటువంటి ప్రత్యక్ష సాక్షులు లభించకపోవడంతో అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే మొయినాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి, క్లూస్ టీమ్, ఫోరెన్సిక్ నిపుణులతో ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వ్యక్తిగత శత్రుత్వాలా, వృత్తి సంబంధిత కారణాలా, లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా అన్న కోణంలో విచారణ కొనసాగుతోంది. మహిళా న్యాయవాదిని ఇంత కిరాతకంగా హత్య చేయడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. న్యాయ వాదులు, మహిళా సంఘాలు ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నాయి. మహిళల భద్రతపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్న ఈ ఘటనపై పోలీసులు త్వరితగతిన నిందితులను పట్టుకుంటామని హామీ ఇచ్చారు.

## డ్రంకెన్ డ్రైవ్ కేసులో పది రోజుల జైలు శిక్ష...



మంచిర్యాల//ఫిబ్రవరి 04 **ఆకాంక్ష :** మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తికి కోర్టు కఠిన శిక్ష విధించింది. మంచిర్యాల జిల్లా భీమారం మండలం పోలంపల్లి గ్రామానికి చెందిన వడ్లకొండ పున్నంకు డ్రంకెన్ డ్రైవ్ కేసులో చెన్నూరు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి పర్వతపు రవి పది రోజుల జైలు శిక్షను ఖరారు చేశారు. నిందితుడు మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడినట్లు కేసు నమోదు చేసిన అధికారులు తెలిపారు. అంతేకాకుండా, పదేపదే 100 నెంబర్‌కు కాల్ చేసి పోలీసుల విలువైన సమయాన్ని వృథా చేసినట్లు విచారణలో తేలినట్లు భీమారం ఎస్సై రాజేందర్ వెల్లడించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రజల ప్రాణాలకు ప్రమాదం కలిగించే విధంగా వ్యవహరించినందుకు నిందితుడిపై చట్టప్రకారం చర్యలు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కోర్టు తీర్పు అనంతరం వడ్లకొండ పున్నంకును లక్షెట్టిపేట సబ్ జైలుకు తరలించినట్లు అధికారులు తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం నేరమని, ఇటువంటి చర్యలపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు ప్రజలకు హెచ్చరిక చేశారు. డ్రంకెన్ డ్రైవ్ వల్ల ప్రాణ నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నందున ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, పోలీసుల పనికి ఆటంకం కలిగించే చర్యలకు పాల్పడవద్దని సూచించారు.

### కాంగ్రెస్ పాలనలో విద్యార్థుల

## ప్రాణాలకు రక్షణ లేదని కవిత విమర్శలు...



మహబూబాబాద్//ఫిబ్రవరి 04 **ఆకాంక్ష :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భద్రత విషయంలో ఘోరంగా విఫలమైందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తీవ్ర స్థాయిలో విమర్శించారు. మహబూబాబాద్ జిల్లాలో గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని అశ్మిత పాముకాటుకు గురైన ఘటనపై ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో వరుసగా జరుగుతున్న ప్రమాదాలు, నిర్లక్ష్య ఘటనలు విద్యార్థుల ప్రాణాలకు ముప్పుగా మారాయని ఆమె ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో విద్యార్థులకు కనీస భద్రత, మౌలిక వసతులు లేవని కవిత విమర్శించారు. కలుషిత ఆహారం కారణంగా విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్న ఘటనలు, ఒత్తిడితో ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు, ఇప్పుడు పాముకాట్ల వంటి ప్రమాదాలు చోటుచేసుకోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. ఈ తరహా ఘటనలు పునరావృతమవుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమని అన్నారు. ప్రత్యేకించి గురుకుల విద్యాలయాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొని ఉందని, అరకొర వసతుల కారణంగా విషజ్వరాలు, ఇతర వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని కవిత ఆరోపించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ప్రభుత్వం దృష్టి పెట్టకపోతే భవిష్యత్‌లో మరిన్ని విషాద ఘటనలు తప్పవని ఆమె హెచ్చరించారు. మహబూబాబాద్ జిల్లాలోని ఘటనలో గాయపడిన విద్యార్థిని అశ్మితకు తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని కవిత డిమాండ్ చేశారు. ఈ విషయంలో విద్యాశాఖ మంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా జోక్యం చేసుకుని బాధిత కుటుంబానికి భరోసా ఇవ్వాలని కోరారు. విద్యార్థుల ప్రాణాల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని, ఆ బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో భద్రతా చర్యలు, పారిశుధ్యం, వైద్య సదుపాయాలను వెంటనే మెరుగు పరచాలని, లేకపోతే తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని కవిత స్పష్టం చేశారు.

## కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలంలో వివాహిత ఆత్మహత్య...

### భర్త వేధింపులే కారణమని ఆరోపణలపై కేసు నమోదు...



కరీంనగర్//ఫిబ్రవరి 04 **ఆకాంక్ష :** భర్త వేధింపులు తట్టుకోలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం కరీంనగర్ నగర శివారులోని రేకుర్తి గ్రామానికి చెందిన కుతాడి కిశోర్, శిరీషారాణి అలియాస్ లహరి (33) భార్యా భర్తలుగా జీవిస్తున్నారు. కొంతకాలంగా భర్త కిశోర్ తన భార్య లహరిని అందంగా లేదని, మరో వివాహం చేసుకుంటానని బెదిరిస్తూ మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేస్తున్నాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అదనపు వరకట్నం తీసుకురావాలంటూ తరచూ లహరిపై ఒత్తిడి తెచ్చేవాడని, ఈ క్రమంలో ఇరు కుటుంబాల మధ్య పలుమార్లు వివాదాలు చోటుచేసుకున్నట్లు సమాచారం. సోమవారం సాయంత్రం కిశోర్ మద్యం సేవించి ఇంటికి వచ్చి మరోసారి భార్యతో గొడవకు దిగడంతో తీవ్ర మనస్తాపానికి గురైన లహరి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించినా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త కిశోర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వివాహిత మృతికి గల అన్ని కోణాలను పరిశీలిస్తూ, వేధింపులపై ఆరోపణల నిజానిజాలను వెలికితీసే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చగా, వరకట్న వేధింపులు, గృహహింసలపై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.ద

### ప్రజాసేవే లక్ష్యంగా స్వతంత్ర అభ్యర్థి

## గుండు రాజు దూసుకుపోతున్న ప్రచారం...



గోదావరిఖని//ఫిబ్రవరి 04 **ఆకాంక్ష :** అభివృద్ధే ధ్యేయంగా, ప్రజాసేవే పరమార్థంగా, ముఖ్యంగా మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే స్పష్టమైన లక్ష్యంతో రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 57వ డివిజన్‌లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన రాజు ఎన్నికల ప్రచారం వేగం పెంచారు. కుర్చీ గుర్తు రాజు, గెలుపే టా తిరుగుతూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. రాజకీయాలు అంటే వాగ్దానాలు కావని కేవలం చేసి చూపించడమే అసలైన నిజం అని నమ్మే వ్యక్తిగా గుండు రాజు ప్రజల్లో విశ్వాసం కలిగిస్తున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు పెద్దపీట వేస్తూ స్వయం ఉపాధి రంగాల్లో శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించడమే తన ప్రధాన అజెండాగా ప్రజలకు వివరిస్తున్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, కలుపుగోలుగా మెలుగుతూ ప్రజల్లో మమేకమవుతూ సాగుతున్న ప్రచారం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. నేను గెలిస్తే ఒక్కడే కార్పొరేటర్ కాదుడ ఈ వార్డు ప్రజలందరూ కార్పొరేటర్లే" అన్న భావనతో తాను ప్రజలకు కుటుంబ సభ్యుడిలా ఉంటానని గుండు రాజు హామీ ఇస్తున్నారు. రాజు ప్రజాసేవా తపనకు స్పందించిన 57వ డివిజన్ ప్రజలు కూడా ఆయనకు అండగా నిలుస్తామని, కచ్చితంగా గెలిపిస్తామని భరోసా ఇస్తున్నారు. ప్రచారంలో అడుగడుగునా ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ, దీవెనలు గుండు రాజుకు మరింత ఉత్సాహాన్ని ఇస్తున్నాయి. రామగుండం కార్పొరేషన్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తూ, 57వ డివిజన్‌లో ప్రజల మద్దతుతో గెలుపు దిశగా దూసుకెళ్తున్న గుండు రాజు ప్రచారం, ప్రజాసేవే ఏకైక లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

### రూ.15 లక్షల లంచం తీసుకుంటూ

## ఏసీబీకి చిక్కిన జీహెచ్ఎంసీ ఎస్ఈ...



హైదరాబాద్//ఫిబ్రవరి 04 **ఆకాంక్ష :** హైదరాబాద్ జిల్లా కూకట్ పల్లి జోనల్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు బుధవారం మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోన్‌కు చెందిన సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) చిన్నారెడ్డి ఓ కాంట్రాక్టర్ నుంచి రూ.15 లక్షల లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఏసీబీ వర్గాల సమాచారం ప్రకారం, కాంట్రాక్టర్‌కు సంబంధించిన పెండింగ్ బిల్లులను క్లియర్ చేయడానికి ఎస్ఈ చిన్నారెడ్డి లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై బాధిత కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించగా, ముందస్తు ప్రణాళికతో అధికారులు వల పన్నారు. నిర్ణీత సమయానికి కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో లంచం మొత్తాన్ని స్వీకరిస్తున్న సమయంలోనే ఏసీబీ అధికారులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు, ఎస్ఈని విచారణ కోసం తరలించారు. కార్యాలయంలోని పలు ఫైళ్లు, సంబంధిత రికార్డులను కూడా ఏసీబీ అధికారులు పరిశీలించినట్లు తెలిసింది. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి తావు లేదని, ప్రజాధనంతో సంబంధం ఉన్న పనుల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏసీబీ అధికారులు స్పష్టం చేశారు. ఈ ఘటనతో జీహెచ్ఎంసీ వర్గాల్లో కలకలం రేగింది. అవినీతి ఆరోపణలపై పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏసీబీ అధికారులు తెలిపారు.

## గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం...



నాగర్ కర్నూల్//ఫిబ్రవరి 04 **ఆకాంక్ష :** రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నాగర్ కర్నూల్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ శ్రీమతి ఏ. శ్రీదేవి హాజరై క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 4న ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ దినోత్సవాన్ని జరుపుకోవడం ద్వారా ప్రజల్లో క్యాన్సర్‌పై అవగాహన పెంచడం, దాని నివారణ, చికిత్సకు ప్రోత్సాహం కల్పించడం ప్రధాన లక్ష్యమన్నారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే సరైన వైద్యం అందించి పూర్తిగా నియంత్రించవచ్చని తెలిపారు. ప్రజలు చిన్న లక్షణాలను కూడా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీమతి ఏ. శ్రీదేవి స్వయంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్యాన్సర్ రోగులను కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న వారికి కుటుంబ సభ్యులు, సమాజం మానసికంగా అండగా నిలవాలని, ధైర్యం కల్పిస్తే వారు మరింత ఆత్మవిశ్వాసంతో చికిత్సను ఎదుర్కోగలరని పేర్కొన్నారు. క్యాన్సర్ రోగులు మానసికంగా దృఢంగా ఉండాలని, ఆశావహ దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు. క్యాన్సర్ రోగులకు పండ్లు పంపిణీ చేయగా, రోగులచే కేక్ కట్ చేయించి వారిలో ఉత్సాహం, ధైర్యం నింపారు. ఆసుపత్రి వాతావరణం మొత్తం ఆత్మీయతతో నిండిపోయింది. రోగులతో మాట్లాడిన అధికారులు వారికి అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీరామ్ ఆర్య, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీమతి భవాని భాయి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. రవికుమార్, సివిల్ సర్జన్ డాక్టర్ రవిశంకర్, గైనకాలజిస్ట్ డాక్టర్ సుప్రియ, డాక్టర్ అతిథి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి, పాలియేటివ్ కేర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక, డీడీఎంఓ రాజగోపాల చారి, ఎన్‌సీడీ కోఆర్డినేటర్లు విజయ్ కుమార్, మల్లేష్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వై. శ్రీనివాసులు, హెల్త్ ఎడ్యుకేటర్ నరసింహ, డీపీఎంఓ సుకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీసీలను రాజ్యాధికారానికి దూరం చేస్తున్న మోడీ ప్రభుత్వం...

### జనగణనలోనే కులగణన చేయాలి... పసుల చంటి



ఆదిలాబాద్//ఫిబ్రవరి 04 **ఆకాంక్ష :** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం బీసీ ప్రధాని అని చెప్పుకుంటూనే బీసీలను రాజ్యాధికారానికి దూరం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి తీవ్ర విమర్శలు చేశారు. బోథ్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డితో కలిసి నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 30, 2025న కేంద్ర కేబినెట్ జనగణనతో పాటు కులగణన నిర్వహిస్తామని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం, జనవరి 22న కేవలం జనగణనకు మాత్రమే నోటిఫికేషన్ జారీ చేయడం ద్వారా బీసీలకు మోసం చేసిందని ఆరోపించారు. జనగణనలో ఎస్సీ, ఎస్టీలకే పరిమితమవుతూ బీసీలు సహా అన్ని కులాలు, ఉపకులాల వివరాలను పక్కన పెట్టడం అన్యాయమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కులగణన నిర్వహించి దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచామని, కులాల వారీగా వాటాలు నిర్ధారించి రాజకీయ రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పసుల చంటి పేర్కొన్నారు. జనగణనలోనే కులగణన చేపడితే బడ్జెట్ కేటాయింపులు, సంక్షేమ ఫలాలు, ప్రత్యేక రాయితీలు న్యాయంగా అందే అవకాశముంటుందని తెలిపారు. మేమెంతో మాకంతా" నినాదాన్ని తుంగలో తొక్కి దొడ్డి దారిలో బీసీలను రాజ్యాధికారానికి దూరం చేస్తున్నారని కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. రాష్ట్రంలోని బీసీ సంఘాలు బీజేపీ ఎంపీలపై ఒత్తిడి పెంచి పార్లమెంటులో ఈ అంశంపై చర్చ జరిపించేలా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అందూర్ గ్రామ సర్పంచ్ పెందూర్ పృథ్వీరాజ్, నక్కలవాడ గ్రామ సర్పంచ్ అడప నవీన్ కుమార్, దన్నూర్ సర్పంచ్ ఎల్మ రోహిణి వినయ్ రెడ్డి, కుచలాపూర్ ఉపసర్పంచ్ సుద్దుల అరుణ్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ మహమ్మద్ అబ్రార్, సీనియర్ నాయకులు మెరుగు భోజన్న, పన్నాల చమేందర్ రెడ్డి, కోలా ప్రశాంత్, తరుణ్, యువ నాయకులు అచ్యుతానంద రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా నాయకులు ఉమేష్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### మండల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్‌గా

## జల్కె పాండురంగ్ రెండోసారి ఎన్నిక...



ఆదిలాబాద్//ఫిబ్రవరి 04 **ఆకాంక్ష :** ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్‌గా జల్కె పాండురంగ్‌ను రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం మండల కేంద్రంలోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశానికి మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సమావేశంలో జల్కె పాండురంగ్ పేరును ప్రతిపాదించగా, హాజరైన సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. గతంలో మండల స్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో, ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేయడంలో ఆయన పోషించిన కీలక పాత్రను గుర్తించి మరోసారి ఈ బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల కన్వీనర్ జల్కె పాండురంగ్ మాట్లాడుతూ, తనపై మరోసారి నమ్మకం ఉంచిన కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడతానని చెప్పారు. కార్యకర్తలందరినీ కలుపుకొని మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా పనిచేస్తానని స్పష్టం చేశారు. సమావేశంలో పాల్గొన్న మండల కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, జల్కె పాండురంగ్ నాయకత్వంలో పార్టీకి మండలంలో మంచి ప్రజాదరణ లభించిందని తెలిపారు. రానున్న రోజుల్లో ఆయన నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీనియర్ కార్యకర్తలు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 12 సార్వత్రిక సమ్మెను సింగరేణిలో జయప్రదం చేయాలి..

### జేఏసీ నాయకుల పిలుపు..




గోదావరిఖని//ఫిబ్రవరి 04 **ఆకాంక్ష :** కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలనే డిమాండ్‌తో దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 12న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెలో సింగరేణి కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని సింగరేణి జేఏసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జేఏసీ నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, కచ్చకాయల సదానందం, తుమ్మల రాజిరెడ్డి, నూనె కొమురయ్య, ఐ. కృష్ణ, పెద్దపల్లి సత్యనారాయణలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల కార్మిక వర్గానికి తీవ్ర నష్టం జరుగుతుందని స్పష్టం చేశారు. దేశ స్వాతంత్ర్యానికి పూర్వమే కార్మిక వర్గం పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం ద్వారా కార్మికుల హక్కులను హరించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఏప్రిల్ ఒకటి నుంచి కొత్త లేబర్ కోడ్‌ల అమలుకు పరిశ్రమల యాజమాన్యాలు ప్రయత్నాలు చేస్తున్నాయని, ఇవి అమలులోకి వస్తే ఉద్యోగ భద్రత, వేతనాలు, పని గంటలు, సంఘ స్వేచ్ఛ వంటి మౌలిక హక్కులకు ముప్పు ఏర్పడుతుందని పేర్కొన్నారు. కార్మిక వర్గానికి వ్యతిరేకంగా ఉన్న ఈ లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు ఫిబ్రవరి 12న సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయని తెలిపారు. అందులో భాగంగా సింగరేణి పరిధిలోని అన్ని గనులు, యూనిట్లలో పని చేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్టు కార్మికులు ఐక్యంగా సమ్మెలో పాల్గొని ఉద్యమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల ఐక్యతే ప్రభుత్వ విధానాలకు గట్టి సమాధానం అని, హక్కుల పరిరక్షణ కోసం సమిష్టి పోరాటం తప్పనిసరిగా కొనసాగాలని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జేఏసీ కార్మిక సంఘాల నాయకులు మద్దె ఎల్లా గౌడ్, వై.వి. రావు, ఎం.ఎ. గౌస్, నరహరి, రాజమౌళి, వడ్డెపల్లి శంకర్, ఈదునూరి నరేశ్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహిళా పోలీసు సిబ్బందికి ప్రత్యేక విశ్రాంతి గది ప్రారంభం...



ఆదిలాబాద్//ఫిబ్రవరి 04 **ఆకాంక్ష :** జిల్లాలో మహిళల భద్రత, రక్షణ చర్యలకు పోలీసు యంత్రాంగం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు. ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌ను ఆయన గురువారం పరిశీలించి, మహిళా పోలీసు సిబ్బంది నిత్యవసర పనులు, విశ్రాంతి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నూతన గదిని ప్రారంభించారు. శాస్త్రోక్తంగా వేద మంత్రోచారణల నడుమ మహిళా కానిస్టేబుల్ చేత రిబ్బన్ కట్ చేయించి గదిని ప్రారంభించడం విశేషంగా నిలిచింది. ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో మహిళా సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు మరింత మెరుగు పరచాలన్న లక్ష్యంతో ఈ విశ్రాంతి గదిని ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. విధి నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉండే మహిళా పోలీసులకు విశ్రాంతి, సౌకర్యాలు కల్పించడం వారి పనితీరును మరింత మెరుగు పరుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇదే సందర్భంగా పురుష సిబ్బందికి కూడా ప్రత్యేక విశ్రాంతి గదిని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్, ఇచ్చోడ సీఐ బండారి రాజు కలిసి ప్రారంభించారు. జిల్లాలో మహిళల రక్షణకై షీ టీం 24 గంటలు అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేస్తోందని ఎస్పీ తెలిపారు. మహిళలు, చిన్నారుల భద్రత కోసం షీ టీం ఆధ్వర్యంలో 'పోలీసు అక్క' కార్యక్రమాన్ని అమలు చేస్తూ చిన్నారులకు మరింత చేరువవుతున్నామని చెప్పారు. మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు పాఠశాలలు, కళాశాలలు, గ్రామ గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తూ చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌ను సమగ్రంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ, రికార్డుల నవీకరణ ఎప్పటికప్పుడు చేయాలని సిబ్బందికి సూచించారు. ఎలాంటి పెండెన్సీ లేకుండా బాధితుల సమస్యలను బాధ్యతాయుతంగా పరిష్కరించాలని, ఇందుకోసం అవసరమైన సిబ్బందిని కేటాయించి వేగంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి కోర్టుల్లో చార్జిషీట్లు దాఖలు చేయాలని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా ప్రతి ఫిర్యాదుపై సున్నితంగా స్పందించి న్యాయం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఇచ్చోడ సీఐ బండారి రాజు, ఎస్ఐ రమేష్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యం...

### మహదేవుని శ్రీనివాస్..




కొమురవెల్లి//ఫిబ్రవరి 04 **ఆకాంక్ష :** కాంగ్రెస్ పార్టీతోనే ప్రజలకు నిజమైన సంక్షేమం, సమగ్ర అభివృద్ధి సాధ్యమని కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహదేవుని శ్రీనివాస్ స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో చేర్యాల మున్సిపాలిటీలోని 10వ వార్డులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి తుమ్మలపల్లి లీల సంజీవులు గారికి మద్దతుగా ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మహదేవుని శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్ల పథకం, అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, పేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అలాగే 10వ వార్డులో నెలకొన్న మురుగు కాలువలు, రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాల సమస్యలను గుర్తించి, జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీ కొమ్మూరి ప్రతాపరెడ్డి సహకారంతో కాలపరిమితిలో పూర్తిగా పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి లీల సంజీవులు గారిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. గెలిచిన వెంటనే వార్డును అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లింగంపల్లి శ్రీనివాస్, లింగంపల్లి కనకరాజు, బత్తిని నర్సింలు గౌడ్, సార్ల లింగం, బొచ్చు ఎల్లయ్య యాదవ్, ఏర్పుల రాజు, ఉప్పల వంశీ కృష్ణ, ఈగ కనకరాజు, గుండా మహేష్, ముత్యం కరుణాకర్, రుద్రారం సిద్దులు, ఏలు సత్యనారాయణ, నర్సింలు, శ్రావణ్‌తో పాటు పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## జననేతగా ప్రచారంలో దూసుకు పోతున్న నీలటి శ్రీనివాస్...



గోదావరిఖని//ఫిబ్రవరి 04 **ఆకాంక్ష** : రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనపై విసుగు చెందిన ప్రజలంతా బీఆర్ఎస్ కారు గుర్తు వైపే చూస్తున్నారన్నది రామగుండం కార్పొరేషన్‌లో అక్షరాల సత్యంగా మారిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పెద్దపల్లి జిల్లా రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 41వ డివిజన్‌లో ప్రజల మనసులను దోచుకుంటూ, ప్రజలతో మమేకమవుతూ తనదైన శైలిలో ప్రచారంలో దూసుకుపోతున్న నీలటి శ్రీనివాస్‌కు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది.వాడ వాడ వీధి వీధి తిరుగుతూ ఇంటింటా కలుస్తూ సమస్యలను తెలుసుకుంటూ పరిష్కార హామీలతో ముందుకెళ్తున్న నీలటి శ్రీనివాస్ ప్రచారం వేగం పెంచింది. కారు గుర్తుకు తిరుగులేదన్న నమ్మకంతో కార్యకర్తలు ఉత్సాహంగా పని చేస్తుండగా, ప్రజల నుంచి వస్తున్న స్పందన ప్రచార శైలిని బట్టి స్పష్టంగా కనిపిస్తోంది. అభివృద్ధి, సంక్షేమం, ప్రజాసేవనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని నీలటి శ్రీనివాస్ చెబుతుండగా, గత పాలనపై అసంతృప్తి చెందిన ప్రజలు కారు గుర్తుకే మద్దతు ప్రకటిస్తున్నారు.41వ డివిజన్‌లో మార్పు కావాలని, ప్రజల సమస్యలను నేరుగా వినే నాయకత్వం కావాలని కోరుకుంటున్నామని స్థానికులు వెల్లడిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రచారంలో దూసుకుపోతున్న నీలటి శ్రీనివాస్‌కు గెలుపు మలుపు రావాలని ప్రజలు ఆకాంక్షిస్తూ, కారు గుర్తుకే తమ మొగ్గు స్పష్టంగా చూపుతున్నారని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## ఈనెల 6 నుంచి శివ దీక్ష స్వాములకు అన్నదానం, వసతి ఏర్పాట్లు...

నాగర్‌కర్నూల్//ఫిబ్రవరి 04 **ఆకాంక్ష** : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం సమీపంలోని కొల్లాపూర్ చౌరస్తాలో ఉన్న శ్రీ జ్ఞానేశ్వర వాత్సల్య మందిరం ఆవరణలో మహాశివరాత్రిని పురస్కరించుకొని ఈ నెల 6 నుంచి మహాశివరాత్రి వరకు శ్రీశైలం వెళ్తున్న శివ దీక్ష స్వాములకు, కాలినడక భక్తులకు అన్న ప్రసాదం, అల్పాహారం, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు మందిరం అధ్యక్షులు ఆకారపు విశ్వనాథం తెలిపారు. త్రాగునీరు, స్నాన సౌకర్యం, సెల్‌ఫోన్ ఛార్జింగ్, రాత్రి విశ్రాంతి ఏర్పాట్లు ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు ఈ సేవలను వినియోగించుకోవాలని ఆకారపు వంశీయులు కోరారు.మరిన్ని వివరాలకు: 9848320723, 9490236890. సంప్రదించాలని కోరారు.

## బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయి జన్ శేఖర్ జన్మదిన వేడుకలు...



ఉప్పల్//ఫిబ్రవరి 04 **ఆకాంక్ష** : బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, నాచారం డివిజన్ కార్పొరేటర్‌గా పదేళ్ల సేవలు పూర్తి చేసిన శాంతి సాయి జన్ శేఖర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాచారం డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన సాయి జన్ శేఖర్ పుట్టినరోజు వేడుకలను బుధవారం ఏఎన్ఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి హాజరై సాయి జన్ శేఖర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాచారం డివిజన్ అభివృద్ధిలో సాయి జన్ శేఖర్ చేసిన సేవలు అభినందనీయమని, ప్రజలతో మమేకమై పనిచేసే నాయకుడిగా గుర్తింపు పొందారని ప్రశంసించారు. మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, హౌసింగ్ బోర్డు కార్పొరేటర్ ప్రభుదాస్, చిల్కానగర్ కార్పొరేటర్ బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, మాజీ కార్పొరేటర్ గంధం జ్యోష్నా, నాగేశ్వరరావు, కొత్త రామారావు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.నియోజకవర్గంలోని పది డివిజన్ల నుంచి బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సుమారు 3,000 మంది నాచారం డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంఘాల ప్రతినిధులు, పుర ప్రముఖులు, మున్సిపల్ సిబ్బంది ఈ వేడుకల్లో పాల్గొని సాయి జన్ శేఖర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఉప్పల్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతం, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలుకు కలిసి పనిచేయాలని ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆకాంక్ష వ్యక్తం చేశారు.

## ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా నూతన కమిటీకి ఎక్సైజ్ సీఐ ఓంకార్ సన్మానం...



ఉప్పల్, ఫిబ్రవరి 04 **ఆకాంక్ష** : ఉప్పల్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ నూతన కమిటీ కార్యవర్గ సభ్యులు ఉప్పల్ ఎక్సైజ్ సీఐ ఓంకార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఆయన అభినందిస్తూ ఘనంగా సన్మానించారు.సన్మాన కార్యక్రమంలో సీఐ ఓంకార్ మాట్లాడుతూ, సమాజంలో ప్రజలకు వాస్తవాలను నిష్పక్షపాతంగా తెలియ జేయడంలో మీడియా కీలకమైన, బాధ్యతాయుతమైన పాత్రను నిర్వహిస్తోందని అన్నారు.ప్రజా సమస్యలను ఎలాంటి పక్షపాతం లేకుండా వెలుగులోకి తీసుకువచ్చేలా ఉప్పల్ ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలని ఆకాంక్షించారు. చట్టపరమైన అవగాహన కల్పించడం, సామాజిక బాధ్యతను ప్రజల్లో పెంపొందించడం వంటి అంశాల్లో మీడియా మరింత చురుకుగా వ్యవహరించాలని సూచించారు.ఉప్పల్ ప్రాంతంలో శాంతిభద్రతలు, ప్రజా సంక్షేమానికి సంబంధించి మీడియా సహకారం ఎల్లప్పుడూ అవసరమని పేర్కొన్న సీఐ ఓంకార్, ఉప్పల్ ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్‌కు, నూతన కమిటీకి ఉప్పల్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ తరపున సంపూర్ణ సహాయ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈకార్యక్రమాన్ని ఉప్పల్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్ వడ్డేపల్లి కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్‌కు చెందిన పలువురు జర్నలిస్టులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో వృద్ధురాలి మృతి...



వెల్దుర్తి//ఫిబ్రవరి 04 **ఆకాంక్ష** : కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం వెల్దుర్తి మండల కేంద్రంలోని 15వ వార్డుకు చెందిన జరదొడ్డి గంగమ్మ (61) గుండెపోటుతో మృతి చెందారు. అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించగా, ఆమె ఆరోగ్యం కొంత మేరకు మెరుగుపడటంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే బుధవారం తెల్లవారుజామున చికిత్స పొందుతూ ఉన్న సమయంలో ఆమెకు మళ్లీ హఠాత్తుగా గుండెపోటు రావడంతో తుది శ్వాస విడిచినట్లు వైద్యులు నిర్ధారించారు.గంగమ్మ మృతి వార్త తెలుసుకున్న బంధువులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో ఆమె నివాసానికి చేరుకుని చివరి నివాళులు అర్పించారు. ఈ ఘటనతో 15వ వార్డు పరిధిలో విషాదఛాయలు అలుముకున్నాయి.మృతురాలికి కుమారులు,కోడళ్ళు, మనవాళ్లు, ఒక మనవరాలు ఉన్నారు. ఆమె అకాల మరణంతో కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

## అభివృద్ధే లక్ష్యంగా ప్రజల్లోకి వెళ్లిన కూటమి అభ్యర్థి మద్దెల దినేష్...

సింహం గుర్తుకు ఓటు వేయాలని గడప గడపకు ప్రచారం....

రామగుండం 43వ డివిజన్‌లో మద్దెల దినేష్ ప్రచారయాత్ర...



గోదావరిఖని//ఫిబ్రవరి 04 **ఆకాంక్ష** : రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా 43వ డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా అల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్, తెలంగాణ జాగృతి, హెచ్ఎంఎస్ పార్టీ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న మద్దెల దినేష్ బుధవారం డివిజన్ వ్యాప్తంగా విస్తృత ప్రచార యాత్ర నిర్వహించారు. సింహం గుర్తుకు ఓటు వేయాలని కోరుతూ ప్రతి వీధి, ప్రతి గడపను సందర్శిస్తూ ప్రచారం కొనసాగించారు.ఈ సందర్భంగా సింహం గుర్తుతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రజలను పలకరించారు. డివిజన్‌లో అధికారంలో లేక పోయినప్పటికీ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రభుత్వంతో, అధికారులతో సమన్వయం చేసుకొని సాధించిన అభివృద్ధి పనులను ఓటర్లకు వివరించారు.భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపై స్పష్టమైన దృక్పథాన్ని ప్రజల ముందుంచారు.మీరు వేసే ఒక్క ఓటుతోనే డివిజన్ భవితవ్యం మారుతుందని, స్థానికంగా సమస్యలను అవగాహనతో పరిష్కరించగల వ్యక్తికి అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. డివిజన్‌లో తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, పారిశుధ్యం, విద్యుత్, పేదల గృహాల వంటి మౌలిక సమస్యలపై స్పష్టమైన ప్రణాళిక ఉందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా పని చేసే ప్రతినిధి కావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తామని, ఎవరూ మధ్యవర్తుల చేత మోసపోకుండా ఉచితంగా లబ్ధి పొందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. డివిజన్ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, స్వచ్ఛమైన పాలన కోసం సింహం గుర్తుకే ఓటు వేయాలని మద్దెల దినేష్ ప్రజలను అభ్యర్థించారు.ఈ ప్రచారయాత్రలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని మద్దెల దినేష్‌కు మద్దతు ప్రకటించారు. డివిజన్ ప్రజల నుంచి లభిస్తున్న స్పందనతో విజయం తమదేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# ప్రజల మన్ననలు పొందే అధికారులే నిజమైన పరిపాలకులు...

### నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్...






నాగర్‌కర్నూల్//ఫిబ్రవరి 04 **ఆకాంక్ష** : ప్రజాస్వామ్య వ్యవస్థలో పరిపాలనకు కేంద్రబిందువు ప్రజలేనని, అలాంటి ప్రజల మన్ననలు పొందాలంటే అధికార యంత్రాంగం తన విధులను మరింత నైపుణ్యంతో, సమర్థతతో నిర్వహించాల్సిన అవసరం ఉందని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. విధుల నిర్వహణలో వృత్తిపరమైన నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవడంతో పాటు,శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడమే నిజమైన పరిపాలనకు కొలమానం అని ఆయన స్పష్టం చేశారు.హైదరాబాద్ మానవ వనరుల అభివృద్ధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో రెండో బ్యాచ్ గ్రూప్1 అధికారుల నల్లమల్ల ట్రెక్కింగ్ మరియు స్టడీ టూర్‌ను బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని గిరిజన సంక్షేమ శాఖ శిక్షణ కేంద్రంలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారులు కేవలం నిబంధనల అమలుకే పరిమితం కాకుండా ప్రజల అవసరాలను అర్థం చేసుకుని స్పందించే దృక్పథాన్ని అలవరుచుకోవాలని సూచించారు.అదే సమర్థవంతమైన,ప్రజాపక్ష పరిపాలనకు అసలైన ప్రమాణమని పేర్కొన్నారు. వేగంగా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో అధికారులు తమ వృత్తిపరమైన నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందని, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ సమయపాలన, స్పష్టమైన సమాచార వ్యవహారం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. పారదర్శకత, నైతిక విలువలను పాటించడం ద్వారా పరిపాలనపై ప్రజల నమ్మకం మరింత బలపడుతుందని అన్నారు.ప్రజల సమస్యలను శ్రద్ధగా వినడం, సానుకూల దృక్పథంతో పరిష్కారాలు చూపించడం ద్వారా అధికారుల బాధ్యతలు మరింత సమర్థవంతంగా నిర్వహించగలమని జిల్లా కలెక్టర్ తెలిపారు. శిక్షణ సమయంలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని ప్రామాణికంగా తీసుకుని క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా సేవలు సులభంగా అందేలా వ్యవస్థలను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉంటుందని అన్నారు.ప్రజలతో మర్యాద పూర్వకంగా వ్యవహరించడం, బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకోవడం ద్వారా అధికారులపై గౌరవం పెరుగుతుందని, అలాంటి అధికారులే ప్రజల మన్ననలు పొందుతారని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. పరిపాలన అనేది ఒక్క రోజులో సాధ్యమయ్యేది కాదని, అది అధికారుల నిరంతర కృషి, నైపుణ్యాభివృద్ధి, సేవాభావం కలయికతోనే సాధ్యమవుతుందని ఆయన తెలిపారు.రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, ప్రోగ్రాం డైరెక్టర్ హెచ్. అరుణ్ కుమార్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయి పర్యటనల ద్వారానే అధికారుల నైపుణ్యాలు మరింతగా అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఈ నల్లమల్ల ట్రెక్కింగ్ మరియు స్టడీ టూర్‌ను తమ నైపుణ్యాభివృద్ధికి విజయవంతంగా మలుచుకోవాలని గ్రూప్1 అధికారులకు ఆయన సూచించారు. అనంతరం అధికారులు నల్లమల అటవీ ప్రాంతంలోని సలేశ్వరం అక్కమాంబ గృహాల సందర్శనకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అమరేందర్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫిరంగి, నాగరాజు అసిస్టెంట్ డైరెక్టర్, గ్రూప్1 సర్వీస్ అధికారులు 2026 (బ్యాచ్×) తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ బీమా ప్రాజెక్టుకు మిగిలిన భూ సేకరణను సకాలంలో పూర్తి చేస్తాం..

### జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్..



నాగర్‌కర్నూల్//ఫిబ్రవరి 04 **ఆకాంక్ష** : నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాల పరిధిలో నిర్మాణంలో ఉన్న రాజీవ్ బీమా ప్రాజెక్టుకు అవసరమైన భూ సేకరణను నిర్ణీత గడువులో పూర్తిచేసి, ప్రాజెక్టు నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ స్పష్టం చేశారు. ప్రాజెక్టుకు సంబంధించి మిగిలి ఉన్న భూమిని వెంటనే సేకరించి నిర్మాణ సంస్థకు అప్పగించే దిశగా జిల్లా యంత్రాంగం వేగంగా ముందుకు సాగుతోందని ఆయన తెలిపారు. బుధవారం ఢిల్లీలోని కేబినెట్ సెక్రటేరియట్ నుండి భారత ప్రభుత్వ కార్యదర్శి (సమన్వయం) అధ్యక్షతన నిర్వహించిన ప్రావీ+ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. ఈ సమావేశంలో నాగర్‌కర్నూల్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అదనపు కలెక్టర్ అమరేందర్‌తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాల్లో నిర్మితమవుతున్న రాజీవ్ బీమా ప్రాజెక్టుకు మొత్తం 59.04 హెక్టార్ల భూమి అవసరమని తెలిపారు. ఇందులో ఇప్పటివరకు 50.39 హెక్టార్ల భూ సేకరణ పూర్తయిందని, మిగిలిన 8.04 హెక్టార్ల భూమిని కూడా త్వరితగతిన సేకరించి ప్రాజెక్టు పనులకు అనువుగా అప్పగించనున్నట్లు క్యాబినెట్ సెక్రటరీకి వివరించారు.భూ సేకరణ ప్రక్రియలో రైతులకు చట్టబద్ధమైన పరిహారం చెల్లింపుతో పాటు, అవసరమైన అన్ని అనుమతులు సమన్వయంతో పూర్తి చేస్తామని, కేంద్రం సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా పనులు చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. రాజీవ్ బీమా ప్రాజెక్టు పూర్తయితే సాగునీటి వసతులు మెరుగుపడి, జిల్లాలోని వ్యవసాయాభివృద్ధికి గణనీయమైన ఊతం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో అదనపు కలెక్టర్ అమరేందర్, జిల్లా పరిశ్రమల అధికారి బి. సచిన్, డిప్యూటీ కలెక్టర్ (భూ సేకరణ) అధికారి అరుణ రెడ్డి, కలెక్టరేట్ భూ సేకరణ విభాగపు సూపరింటెండెంట్ సి. నారాయణతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే చికిత్స సులభం..

### వైద్యుల అవగాహన కార్యక్రమం..





నాగర్ కర్నూల్ టౌన్//ఫిబ్రవరి 04 **ఆకాంక్ష** : నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల కేంద్రంలో క్యాన్సర్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. నాగర్ కర్నూల్ మెడికల్ కళాశాల 2024 బ్యాచ్‌కు చెందిన వైద్య విద్యార్థులు క్షేత్రస్థాయి సందర్శనలో భాగంగా బిజినేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమాదేవి, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ ఉమారాణి ఆదేశాల మేరకు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ ఆసుపత్రికి వచ్చిన రోగులు, బాలింతలకు క్యాన్సర్ వ్యాధిపై విస్తృత అవగాహన కల్పించారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే చికిత్స సులభమవుతుందని, ఆలస్యం జరిగితే ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉందని ఆయన స్పష్టం చేశారు. అకారణంగా బరువు తగ్గడం, స్వరంలో మార్పులు రావడం, మలమూత్రాల్లో రక్తం కనిపించడం, శరీరంలో నొప్పిలేని గడ్డలు లేదా పుట్టుమచ్చలు అకస్మాత్తుగా పెరగడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. అలాగే మహిళల్లో స్తనంలో నొప్పిలేని గడ్డలు, కనతులు ఏర్పడటం, నోటిలో మానని పుండ్లు, ప్రేగుల్లో అల్సర్లు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు.వైద్య కళాశాల విద్యార్థులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నవజాత శిశువులు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. టీకాల ద్వారా అనేక ప్రాణాంతక వ్యాధులను ముందుగానే నివారించవచ్చని వారు వివరించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ రిషిత, డాక్టర్ రోహిత్, హెల్త్ సూపర్వైజర్ కె.గంగ, మెడికో సోషల్ వర్కర్ డి.బాలమ్మతో పాటు మెడికల్ కళాశాల విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తామని వైద్యులు తెలిపారు.

# రామగుండం రౌడీల పాలనగా మారింది...

### కాంగ్రెస్ విధ్వంసకర పాలనకు కార్పొరేషన్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి..

### రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్...





గోదావరిఖని//ఫిబ్రవరి 04 **ఆకాంక్ష** : పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజక వర్గం రౌడీల గుండాల పాలనగా మారిందని, అభివృద్ధి పేరుతో ప్రజలపై విధ్వంసం సృష్టిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. రామగుండంలో రాత్రిపూట దొంగల మాదిరిగా దేవాలయాలు, చిరు వ్యాపారుల దుకాణాలు కూల్చివేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆయన తీవ్ర విమర్శలు చేశారు. బుధవారం సాయంత్రం రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 39వ డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి హిందుజా కిరణ్ జీలతో కలిసి కోరుకంటి చందర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత రెండు సంవత్సరాలుగా రామగుండంలో అభివృద్ధి అనే మాట కేవలం నినాదంగానే మిగిలిపోయిందని, వాస్తవంగా మాత్రం ప్రజల జీవితాలపై దాడి జరుగుతోందని ఆరోపించారు. మైసమ్మ దేవాలయాలు, చిరు వ్యాపారుల దుకాణాలు రాత్రికి రాత్రే కూల్చివేస్తూ, వారికి ముందస్తు సమాచారం ఇవ్వకుండా రోడ్డున పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ నియంతలా వ్యవహరిస్తూ ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడం, నిరసన తెలిపితే దాడులు చేయించడం వంటి దుర్మార్గపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. చిరు వ్యాపారులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం వారిని ఇబ్బందులకు గురి చేస్తూ జీవనోపాధిని దూరం చేస్తోందని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతు నొక్కే పాలన కాంగ్రెస్ పార్టీ లక్షణమైందని అన్నారు.అబద్ధాలు,మోసాలకు కాంగ్రెస్ పార్టీ కేరాఫ్‌గా మారిందని కోరుకంటి చందర్ తీవ్రంగా వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ఇంటింటికీ తిరిగి అభయహస్తం కార్డులు అందించి హామీలిచ్చి, గెలిచిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. రేవంత్ రెడ్డి సర్కార్ ప్రజలను నమ్మించి మోసం చేసిందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుకు రెండేళ్లు గడిచినా ఒక్క అడుగు ముందుకు వేయలేదని అన్నారు.420 హామీలు, ఆరు గ్యారెంటీలు ఇచ్చి 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి ఊసే ఎత్తడం లేదని దుయ్యబట్టారు. వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మికులు, దివ్యాంగులకు డబుల్ పెన్షన్లు, ఆడబిడ్డల వివాహానికి తులం బంగారం, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే బాలికలకు సైకిళ్లు, స్కూటీలు, రైతులకు రుణమాఫీ, నిరుద్యోగ యువతకు జాబ్ క్యాలెండర్, విద్యాభరోసా, ఉచిత కరెంట్, గ్యాస్ వంటి పథకాలలో ఒక్కటైనా సక్రమంగా అమలు చేయలేదని విమర్శించారు. ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలం, రూ.5 లక్షల ఆర్థిక సహాయం ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని, రాజీవ్ యువకిరణాల పేరుతో నాలుగుసార్లు దరఖాస్తులు తీసుకుని ఇప్పటివరకు వాటి జాడే లేకుండా చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మళ్లీ ఓట్లు అడగడానికి వస్తే ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు.రామగుండంలో నియంత పాలనకు ముగింపు పలకాలంటే రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరుకంటి చందర్ ప్రజలను కోరారు. బీఆర్ఎస్ పాలనలోనే నిజమైన అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఆయన స్పష్టం చేశారు.ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో నాయకులు నడిపెల్లి మురళీధర్ రావు, నారాయణదాసు మారుతి తదితరులు పాల్గొన్నారు.

## ఏడుపాయల జాతరలో సామాన్య భక్తులకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టు ఏర్పాట్లు...



మెదక్//ఫిబ్రవరి 04 **ఆకాంక్ష** : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మెదక్ జిల్లా ఏడుపాయల నాగసాన్పల్లి వనదుర్గ భవానీ జాతరకు వచ్చే సామాన్య భక్తులకు ఎలాంటి ఆటంకాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజు అధికారులను ఆదేశించారు. ఈ నెల 15 నుంచి 17 వరకు నిర్వహించనున్న మహా శివరాత్రి జాతర ఏర్పాట్లపై హరిత హోటల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతర రోజుల్లో లక్షలాది మంది భక్తులు అనేక కష్టనష్టాలు ఓర్చి అమ్మవారి దర్శనం కోసం ఏడుపాయల వనదుర్గ మాత సన్నిధికి తరలివస్తారని కలెక్టర్ తెలిపారు. వచ్చిన ప్రతి భక్తుడు ప్రశాంతంగా అమ్మవారి దర్శనం చేసుకుని సంతృప్తితో క్షేత్రాన్ని వీడేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దర్శన వ్యవస్థలో సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు.అత్యధికంగా విఐపి పాసులు జారీ చేయడం వల్ల సామాన్య భక్తుల దర్శనానికి ఆటంకం ఏర్పడే ప్రమాదం ఉందని కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. విఐపి పాసుల జారీ విషయంలో ఆలయ సిబ్బంది తగిన జాగ్రత్తలు పాటించాలని, అవసరం లేని పాసుల జారిని నియంత్రించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో క్యూలైన్లు, భద్రత, త్రాగునీరు, పారిశుధ్యం, వైద్య సదుపాయాలు, రవాణా నిర్వహణ వంటి అంశాల్లో ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని తెలిపారు.ప్రతి సంవత్సరం భక్తుల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా ఏడుపాయల పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, విద్యుత్ సరఫరా, అగ్నిమాపక ఏర్పాట్లు మరింత బలోపేతం చేయాలని ఉన్నతాధికారులకు సూచించారు. జాతర సందర్భంగా అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి భక్తులకు సేవలందించాలని కలెక్టర్ రాహుల్ రాజు ఆదేశించారు.

Printed, Published and Owned by PENAGONDA SATHISH,Printed at BUILDING NO: 1-17-18, SVN COLONY, SUNDAY PRINTING PRESS,Editor: PENAGONDA SATHISH,: H NO : 8-4-458, RAM NAGAR, GODAVARIKHANI, PEDDAPALLI, TELANGANA - 505209. RNI.No.TGTEL/25/A1964,Cell : 8333818121,Email: akankshanewsdaily@gmail.com